ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-6-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 149 పేజీలు: 10+4 వెల: 6.50



రావి శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు 2

ఆస్కార్ కమిటీలో కమల్, ఖురానా 5


## ఇక పసుపు రైతుకు పసిడి కాలం



"మావోయిస్టులు తక్షణమే లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి రావాలి..

నిజామాబాద్‌లో ఆదివారం జరిగిన రైతు సమ్మేళన సభలో ప్రసంగిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా. సభకు హాజరైన రైతులు

**40 యేళ్ల కలను నెరవేర్చిన ప్రధాని నరేంద్ర మోడీ**

**ప్రపంచ మార్కెట్‌లోకి ఇందూరు పసుపు**

**2030 నాటికి బిలియన్ డాలర్ల పసుపు ఉత్పత్తుల ఎగుమతి**

**నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రారంభించిన అమిత్ షా**

**ప్రారంభోత్సవానికి హాజరైన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల, సీతక్క, ఎంపీలు లక్ష్మణ్, అరవింద్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్29:** నిజామాబాద్‌లో కేంద్రమంత్రి అమిత్ షా పసుపు బోర్డును ఆదివారం ప్రారంభించారు. అనంతరం స్థానిక పాలిటెక్నిక్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన రైతు సమ్మేళన సభలో ఆయన ప్రసంగించారు. 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల కలను ప్రధాని మోదీ నెరవేర్చారని అన్నారు. పసుపు బోర్డు ఇక్కడికి రావడంలో రాష్ట్ర బీజేపీ ఎంపీల కృషి చాలా ఉందన్నారు. నిజామాబాద్ పసుపు ప్రపంచ మార్కెట్‌లోకి వెళ్తుందని, పసుపుధర పెరుగుతుందని, వ్యాపారాలు పెరుగుతాయని వ్యాఖ్యానించారు. మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్ ఆఫీసు కూడా నిజామాబాద్‌లో ఉంటాయని, వివిధ దేశాలకు ఎగుమతి చేస్తామని పేర్కొన్నారు. పసుపుబోర్డు కార్యాలయం ఏర్పాటుతో స్థానిక రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలగనున్నాయని ఆయన చెప్పారు. భారత్ ఆర్గానిక్ లిమిటెడ్, భారత్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్ కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటవుతున్నాయని, భారత్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్‌తో నిజామాబాద్ పసుపు అమెరికా, యూరప్‌కు ఎగుమతి అవుతుందని అమిత్‌షా వెల్లడించారు. రాష్ట్రంలో అనేక అవినీతి జరిగిందని, తెలంగాణ మొన్నటి వరకు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎం గా ఉందని, ఇప్పుడు రేవంత్ రెడ్డికి మారిందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తేనే అవినీతి అంతం అవుతుందని కేంద్ర మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ తప్పక అధికారంలోకి వస్తుందని అమిత్‌షా దీమా వ్యక్తం చేశారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే బీజేపీ విజయం ఖాయమైందని తెలుస్తోందనివివరించారు. ఇచ్చిన హామీ ప్రకారం ఎంపీ అర్వింద్ నిజామాబాద్‌కు పసుపుబోర్డు

>>2

## మెడికోల స్టైపెండ్ 15% పెంపు



**సీనియర్ రెసిడెంట్ల వేతనం కూడా హెచ్చింపు**

**నేటి నుంచి తలపెట్టిన జూడాల సమ్మె విరమణ**

**16,448 మంది మెడికల్ ఉద్యోగుల పదవీ కాలం పొడిగింపు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్29:** మెడికోలకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ అందించింది. వారికి అందించే స్టైఫండ్‌ను భారీగా పెంచింది. ఒకేసారి 15శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం సాయంత్రం జీవో జారీ చేసింది. మెడికల్,డెంటల్ స్టూడెంట్స్‌తో పాటు సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనం సైతం పెంచింది. ఈ పెంపుతో ఇంటర్న్‌లకు నెలకు రూ.29,792,పీజీ డాక్టర్లకు ఫస్ట్ ఇయర్‌లో రూ.67,032,సెకండ్ ఇయర్‌లో 70,757,ఫైనల్ ఇయర్‌లో రూ.74,782 చొప్పున స్టైఫండ్ అందనుంది. సూపర్ స్పెషాలిటీ స్టూడెంట్లకు ఫస్ ఇయర్‌లో రూ.1,06,461,సెకండ్ ఇయర్‌లో రూ.1,11,785,థర్డ్ ఇయర్‌లో రూ.1,17,103 చొప్పున స్టైపెండ్ అందనుంది.అలాగే సీనియర్ రెసిడెంట్ డాక్టర్లకు ఇచ్చే గౌవర వేతనాన్ని 92,575 నుంచి 1,06,461 పెంచుతున్నట్లు జీవోలో పేర్కొన్నారు. కాగా. ప్రభుత్వంతో జూనియర్ డాక్టర్లు జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. దీంతో సోమవారం నుంచి తలపెట్టిన సమ్మెను విరమిస్తున్నట్లు జూడాలు ప్రకటించారు. స్టైఫండ్ పెంచడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ జూడాలను చర్యలకు ఆహ్వానించారు. చర్చలకు ముందే ప్రభుత్వం మెడికోలకు భారీగా స్టైఫండ్ పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఇదిలా ఉండగా, తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య శాఖ ఉద్యోగులకు భారీ గుడ్ న్యూస్ తెలిపింది. వైద్యారోగ్య శాఖలో పని చేస్తున్న ఉద్యోగులను మరో ఏడాది పొడగిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. వివిధ ప్రభుత్వ ఆసుపత్రులు,ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న దాదాపు 16,448 మంది ఉద్యోగులను మరో ఏడాదికి

>>2



## పూరీ రథయాత్రలో తొక్కిసలాట

**ముగ్గురు మహిళలు మృతి, 50 మందికిపైగా గాయాలు**

**తక్షణమే స్పందించిన ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాఝీ**

**కలెక్టర్, ఎస్పీలపై బదలీ వేటు**

**డిసిపి, పోలీస్ కమాండెంట్‌ల సస్పెన్షన్**

**మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలచొప్పన పరిహారం**

**పూరి,జూన్ 29:** పూరీ జగన్నాథ రథయాత్రలో జరిగిన తొక్కిసలాట సందర్భంగా ముగ్గురు మృతిచెందడంతోపాటు 50 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతిచెందిన ముగ్గురు కూడా మహిళలే కావడం గమనార్హం. వీరందరినీ జిల్లా ఆసుపత్రులకు తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని ఆసుపత్రిలోని వైద్యులు తెలిపారు. కాగా దుర్ఘటనపై ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాఝి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జగన్నాథ్ భక్తులందరికీ ప్రభుత్వం

>>2

## రాష్ట్ర బిజెపి చీఫ్‌గా రామచంద్రరావు?

**తనకు అధికారిక సమాచారమేదీ రాలేదని వెల్లడి**

**అధ్యక్ష పదవికి నేడు నామినేషన్ల స్వీకరణ**

**రేపు ఎన్నికకు అవకాశం**



**హైదరాబాద్,జూన్ 29:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా నగర మాజీ అధ్యక్షుడు సీనియర్ నాయకుడు రామచంద్రరావు పేరు ఖరారయినట్లు పార్టీ వర్గాలనుంచి విశ్వసనీయంగా తెలిసింది.తనకు పార్టీపరంగా ఎలాంటి బాధ్యతలు అప్పగించినా నియమబద్ధంగా కొనసాగిస్తానని రామచంద్రరావు ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. అయితే అధికారికంగా తనను రాష్ట్ర అధ్యక్షుడుగా ఖరారుచేసినట్లు తనకు ఇంకా సమాచారం రాలేదన్నారు. బిజెపి రాష్ట్ర అద్యక్షుడి నియామకంకోసం ఆదివారమే నోడిఫికేషన్ విడుదలచేసారు. రాష్ట్ర ఎన్నికల అధికారి మాజీఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ నోటిఫికేషన్ విడుదలచేసారు. సోమవారం మధ్యాహ్నం 2గంటలనుంచివ 4 గంటలవరకూ నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఉపసంహారణ సాయంత్రం 4నుంచి ఐదుగంటలవరకూ కొనసాగుతుంది. ఎన్నికల నిర్వహణకు కేంద్ర రిటర్నింగ్ అధికారిగా కేంద్ర మంత్రి శోభా కరాండ్లజే వ్యవహరించనున్నారు. అయితే ఇప్పటికే రామచంద్రరావు పేరు ఖరారయిందన్న వార్తలు గుప్పుమనడంతో ఆయన అభిమానుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. అయితే పార్టీపరంగా ఎలాంటి ధృవీకరణ ప్రకటన మాత్రం రాలేదని కొందరునేతలు చెపుతున్నారు.



## సన్నాలకు బోనస్ ఇంకా ఎన్నాళ్లకు?

**9 వారాలు గడిచినా ఉలుకుపలుకు లేని అధికారులు**

**రైతుకు రూ.1799 కోట్ల బకాయిలు**

**హైదరాబాద్,జూన్ 29,ప్రభాతవార్త:** రైతు భరోసా ఇచ్చారు కదా ఇక సన్నాలకు బోనస్ చెల్లించరేమో అని రైతాంగం అనిశ్చితికి గురవుతున్నారు. తొమ్మిదిరోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా చెల్లించారు కానీ తొమ్మిదివ వారంలోకి ప్రవేశించినా సన్నాల బోనస్ ఇవ్వడానికి ఖజానా తడుముకొంటున్నారు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లు పూర్తైయినా సన్నాల బోనస్ రూ. 1799.99 కోట్లు రైతుల ఖాతాల్లోకి పడలేదు. 12.85 వేల మంది రైతుల నుంచి 74.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయడంతో కొనుగోలు కేంద్రాలను అన్నింటిని మూసివేశారు.సన్న ధాన్యం క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఆ రకాలను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు.గతంలో సన్నవడ్లను ప్రైవేటు వ్యాపారులకు విక్రయించేవారు.తెలంగాణ మార్చిచివరివారం నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.కామారెడ్డి, సూర్యపేట జిల్లాలో మొదట పంట చేతికి రావడంతో అక్కడ కొనుగోలు కేంద్రాల తొందరగా ప్రారంభించారు. ఇంకా రెండు రోజులు గడిస్తే జూలై నెల వచ్చేస్తుంది. అయినా బోనస్ చెల్లింపులపై దృష్టిసారించడం లేదు. యాసంగిలో నాలుగున్నరల లక్షలమంది రైతులు 23.50లక్షల మె.ట సన్నరకం ధాన్యం విక్రయించారు. వీరిలో ఏ ఒక్కరి ఖాతాల్లో కూడా బోనస్ డబ్బులు ఇంకా జమ కాలేదు. క్వింటాల్‌కు ఐదు వందల చొప్పున 1799 కోట్ల,99,లక్షల 50వేల బోనస్ రైతులకు తెలంగాణ ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నప్పటికి ఇంకా రైతుల పేరుతో చెక్కులు రూపొం దించడంలేదు. యాసంగి సీజన్ ప్రారంభంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సన్నధాన్యం ఉత్పత్తి చేసిన రైతులకు నిర్దేశిత వ్యవధిలో బోనస్ చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చారు. వానాకాలం సీజన్లో ప్రభుత్వం చెప్పినట్లుగానే ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమైన వారం నుంచే బోనస్ చెల్లింపులు జరిగాయి. ధాన్యం సేకరించిన రెండు వారాల్లో దాదాపు చెల్లించారు.వానకాలం చివరి దశలో కొనుగోలు చేసిన సన్నాలకు బోనస్ చెల్లింపు కొంత ఆలస్యం జరిగింది.అంచనావేసిన బడ్జెట్‌కంటే సన్నాలు విక్రయానికి రావడంతో సుమారు నాలుగు వందల కోట్లు కొత్తగా బడ్జెట్ సాంక్షన్ చేయడంతో మేనెలలో కొంత మంది రైతులకు బోనస్ చెల్లించినట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు. ఇందులో కొన్ని సాంకేతిక కారణాలు తలెత్తడంతో కూడా కొందరు రైతులకు వానకాలంలో బోనస్ చెల్లింపులో జాప్యం జరిగినా తరవాత సమస్యలను పరిష్కరించారు. ప్రస్తుత యాసంగి సీజన్లో మాత్రం సేకరణ తుదిదశకు చేరినా కూడా చెల్లింపులు ప్రారంభం కాలేదు.మే 24 నుంచే జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురువడంతో అన్నదాత సాగు మొదలు పెట్టారు. ఊహించని విధంగా

>>2


వచ్చే ఏప్రిల్ నుంచి తొలిదశ జనగణన 2


## కాంగ్రెస్ అవినీతిపై విచారణ జరిపించలేరా?




**కేంద్రమంత్రి అమిత్‌షాను ప్రశ్నించిన కెటిఆర్**

**తెలంగాణలో బిజెపికి అధికారం కల్ల**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్29:** తెలంగాణలోని రేవంత్ సర్కారు.. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ఏటీఎంలా మారిపోయిందని నిజామాబాద్ గడ్డపై తేల్చిచెప్పిన మీరు, మరి కేంద్ర హోంమంత్రిగా ఎందుకు విచారణకు ఆదేశించడం లేదో చెప్పగలరా..? అని అమిత్‌షాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. కేంద్ర అత్యున్నత దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీతో.. అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వంపై విచారణ జరపడానికి కేంద్రానికి ఏం అడ్డువస్తుందో తెలంగాణ ప్రజలకు వివరించగలరా..? అని అడిగారు. ఢిల్లీలో కాంగ్రెస్‌తో బీజేపీ కుస్తీ, తెలంగాణలో మాత్రం దోస్తీ అన్నట్టుగా సాగుతున్న కుమ్మక్కు రాజకీయాల వల్లే రేవంత్‌ను వెనకేసుకొస్తున్నారనే ఆరోపణలకు సమాధానం ఉందా..? తెలంగాణ ప్రజల గొంతుకై నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక, రేవంత్‌ను బీజేపీ పావుగా వాడుకుంటున్న మాట వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. గతంలో దేశ ప్రధాని మోదీ వచ్చినప్పుడు,

>>2

# వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి తొలిదశ జనగణన

## రాష్ట్రాల సిఎస్‌లకు లేఖలు రాసిన రిజిస్ట్రార్‌జనరల్ కుమార్‌నారాయణ్



**న్యూఢిల్లీ,జూన్ 29:** కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించే జనాభా లెక్కల కోసం గృహాల జాబితాచేసే కార్యక్రమం వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతాయని భారత జనాభా లెక్కల కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తెలిపారు. ఇది జనాభా లెక్కల మొదటి దశ ప్రారంభమన్నారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు ఆయన లేఖలు రాసారు. పర్యవేక్షకులు, గణకుల నియామకాలు రాష్ట్రాలు, జిల్లా పరిపాలన సహకారంతో జరుగుతుందని, జనాభా లెక్కింపు కార్యక్రమం రెండు దశల్లో జరగనుంది. మొదటి దశలో గణకులు ఇంటింటికి వెళ్లి గృహాల గుర్తింపు ప్రక్రియ చేపట్టి, ఆ తర్వాత రెండో దశలో ఇంటింటికి వెళ్లి జన గణన చేపడతారు. ప్రతి ఇంట్లోని జనాభా, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వివరాలను సేకరిస్తారు. ఇది 2027 ఫిబ్రవరి 1 నాటికి జరగనుంది. జనగణనతో పాటు కుల గణన కూడా జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్పష్టంచేసింది. జనగణన కార్యకలాపాల కోసం 34 లక్షలకు పైగా గణకులు, పర్యవేక్షకులు, సుమారు 1.3 లక్షల జనాభా గణన కార్యకర్తలను నియమిస్తున్నామన్నారు. నూతన జనాభా గణనను మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి డిజిటల్ విధానంలో నిర్వహిస్తారు. డిజిటల్ విధానంతో జనాభా లెక్కించేందుకు అధికారులతోపాటు ప్రజలకూ అవకాశం ఇవ్వనున్నారు. రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణన కమిషనర్ కార్యాలయం పౌరులను అడగడానికి దాదాపు 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసింది. ఈ సర్వేలో ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీప్, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ, ట్రాన్సిస్టర్) వంటి వస్తువుల యాజమాన్యం గురించి అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, లైటింగ్, మరుగుదొడ్ల వాడకం, స్నానం, వంటగది సౌకర్యాలు, వంట కోసం ఉపయోగించే ఇంధనం, ఎల్పీజీ/పీఎన్జీ కనెక్షన్లు ఆరాతీస్తారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు కోసం ఉపయోగించిన మెటీరియల్, నివాసితుల సంఖ్య, ఇంటి గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి. జనగణన నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీఎస్‌లకు భారత జనాభా లెక్కల కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ లేఖ రాశారు. జనాభా లెక్కల ప్రక్రియకు తుది తేదీగా పరిగణించే ఈ ఏడాది డిసెంబర్ 31కి ముందు పరిపాలనా యూనిట్ల సరిహద్దుల్లో ఏవైనా ప్రతిపాదిత మార్పులు చేయాలని అందులో కోరారు. జనగణన కోసం అన్ని గ్రామాలు, పట్టణాలను ఏకరీతి గణన బ్లాక్‌లుగా విభజించామన్నారు. జనగణన సమయంలో ఎటువంటి తప్పిదాలు పునరావృతం కాకుండా ఉండటానికి ప్రతి బ్లాక్‌కు ఒక గణకుడిని నియమిస్తామన్నారు. 2026 ఏప్రిల్ 1 నుంచి హౌస్ లిస్టింగ్ ఆపరేషన్లు, సూపర్ వైజర్లు, గణకుల నియామకం, వారి మధ్య పని విభజన జరుగుతుందని మృతుంజయ్ కుమార్ తెలిపారు. 2027 ఫిబ్రవరి 1 నాటికి జనగణన ప్రారంభమవుతుందని వెల్లడించారు. డిసెంబర్ 31 లోపు మున్సిపల్ కార్పొరేషన్లు, రెవెన్యూ గ్రామాలు, సబ్ డివిజన్లు, జిల్లాల సరిహద్దుల్లో ఏవైనా ప్రతిపాదిత మార్పులు చేయాలని అన్ని విభాగాలను ఆదేశించాలని అన్ని రాష్ట్రాల సీఎస్‌లను కోరారు. సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. ఆ తర్వాత కోవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణన నిలిచిపోయింది. తాజాగా 16వ జనగణనకు కేంద్రం సర్వం సిద్ధంచేసింది.



ఆదివారం వర్షంలోనే న్యూఢిల్లీలో ఇండియాగేట్ ప్రాంతాన్ని సందర్శిస్తున్న ప్రజలు

## మెడికోల స్టైపెండ్ 15% పెంపు

>> పొడగించారు. వీరిలో 4,772 పోస్టుల కాంట్రాక్ట్ బేస్డ్, 8,615 ఔట్ సోర్సింగ్ విధానంలో,3,956 పోస్టుల గౌరవ వేతన పద్ధతిలో,5 పోస్టులు ఎంటిఎస్ ప్రాతిపదికన పని చేస్తున్న ఉద్యోగులకు ఈ ఉత్తర్వులు వర్తించనున్నాయి.ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ప్రకటన జారీ చేశారు. మొత్తం 16,448 మంది గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు, బోధనా ఆసుపత్రులు, నర్సింగ్, డెంటల్ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో బోధనా సిబ్బంది సహా నర్సింగ్, డీఈఓలు, పారామెడికల్ సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగులు ఉండటం గమనార్హం. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విభాగంలో సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టుగా సమాచారం. కాగా ఈ ఆదేశాలు 2026 మార్చి 31వరకు కొనసాగనున్నాయి. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి థర్డ్ పార్టీ నుంచి, మిగతా విభాగాల వారికి ప్రభుత్వం నుంచి నేరుగా శాలరీలు అందించనున్నారు.

సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల సమ్మె విరమణకు అవకాశం

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల అసోసియేషన్ జూలై 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె తలపెట్టింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ రెసిడెంట్ డాక్టర్లకు గౌరవ వేతనం పెంచడంతో సమ్మె విరమించే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, ఎన్నోసార్లు ప్రభుత్వం, వైద్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల్లో పని చేస్తున్న సీనియర్ రెసిడెంట్ డాక్టర్లకు గత మూడు నెలలుగా స్టైపెండ్ చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ పెంపు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, అలాగే రెసిడెంట్‌ల ఉద్యోగ కాలాన్ని కొనసాగించేందుకు కీలకమైన ఎక్స్‌టెన్షన్ జీవో ఇంకా విడుదల చేయబడలేదని వాపోయారు. అధికారులతో చేసిన అనేక ప్రయత్నాలు విఫలమైన నేపథ్యంలో, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు జూలై 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టాలని నిర్ణయించుకున్నట్టు వెల్లడించారు. అత్యవసర వైద్య సేవలపై సమ్మె ప్రభావం ఉండదని, తమ డిమాండ్లు నెరవేరిన తరువాతే సమ్మెను విరమిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి, వైద్య సేవలలో అంతరాయం కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ అవినీతిపై విచారణ జరిపించలేరా?

>> ఏకంగా రాహుల్‌రేవంత్ కలిసి ఆర్‌ఆర్ టాక్స్ పేరిట దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు కానీ దర్యాప్తునకు మాత్రం నేటికీ ఆదేశించలేదు. దేశ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి హోదాలో మీరు తెలంగాణకు వచ్చి కేవలం సీఎంపై అవినీతి ఆరోపణలు చేస్తే సరిపోతుందా..? పట్టపగలు ప్రజాధనం లూటీ చేస్తూ ఢిల్లీకి మూటలు పంపుతున్న కాంగ్రెస్ సీఎం అక్రమాలకు కేంద్ర అడ్డుకట్ట వేయలేదా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు కేటీఆర్.మరోవైపు.. ధాన్యం దిగుబడిలో పంజాబ్‌నే తలదన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానానికి తెలంగాణ ఎదగడంలో కీలకపాత్ర పోషించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై బురదజల్లడం అత్యంత దురదృష్టకరం. ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినా, ఇద్దరు కేంద్రమంత్రులున్నా, తెలంగాణలోని ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా, కనీసం ఒక్క ఐఐటీ, ఐఐఎం, మెడికల్ కాలేజీ వంటి ఉన్నత విద్యాసంస్థలు మంజూరు చేయకుండా బీజేపీ చేస్తున్న అన్యాయాన్ని నాలుగు కోట్ల ప్రజలు నిత్యం గమనిస్తూనే ఉన్నారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు నయా పైసా కేటాయించకుండా.. పేరుకు పసుపు బోర్డు పెట్టి రిబ్బన్ కట్ చేస్తే ప్రయోజనమేంటి ? కనీసం సొంత భవనం కూడా కట్టకుండా.. సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పసుపు బోర్డు ఆఫీసును ప్రారంభించడం సమంజసమేనా..? అసలు ఒక్క పసుపు బోర్డును ఇన్నిసార్లు ప్రారంభించడం సబబేనా? ఈ జనవరి 14న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఢిల్లీ నుంచి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ వర్చువల్‌గా పసుపు బోర్డును ప్రారంభించేశారు. మరోసారి మీరు ఆదివారం(జూన్ 29న)పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించడం వల్ల ప్రయోజనమేంటి..? అని కేటీఆర్ నిలదీశారు. ఏపీలోని టీడీపీ ప్రభుత్వం చేపట్టిన బనకచర్లకు నదుల అనుసంధానం ముసుగులో కేంద్రం బంగారు బాటలు వేయడం.. గోదావరిపై తెలంగాణ రైతుల హక్కులను కాలరాయడం కాదా..? విభజన చట్టం ప్రకారం అడవిబిడ్డలకు ఉపాధి కల్పించే బయ్యారం ఉక్కు కర్మాగారానికి పాతరేసి, హైదరాబాద్ రూపురేఖలు మార్చే ఐటీఐఆర్ ప్రాజెక్టును కూడా రద్దుచేయడం తెలంగాణ ప్రజలకు కేంద్రం చేసిన ద్రోహం కాదా..? పేరుకు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తున్నా, నిర్వహణ బాధ్యతలు ప్రైవేటుకే అప్పగించే ప్రయత్నాలకు స్వస్తిపలికి వరంగల్ యువత ఉపాధికి భరోసా ఇవ్వగలరా..? కేంద్రంలో అధికారంలోకి వచ్చిన క్షణం నుంచి నేటి వరకు అడుగడుగునా తెలంగాణ వ్యతిరేకిగా వ్యవహరిస్తున్న బీజేపీ ఈ రాష్ట్రంలో ఎప్పటికీ అధికారంలోకి రాదు. రాలేదు.. అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## సన్నాలకు బోనస్ ఇంకా ఎన్నాళ్లకు?

>> వర్షాకాలం ముందుగా రావడంతో అన్నదాతకు వ్యవసాయ పెట్టుబడుల అవసరం ఏర్పడింది. ఎరువులు, విత్తనాలు సమకూర్చుకోవడానికి సమాయత్తమవుతున్నారు. సన్నాలు విక్రయించిన రైతులు బోగస్ డబ్బులు త్వరగా వస్తాయని ఆశించారు. సన్నధాన్యం అమ్మి తొమ్మిది వారాలు గడిచినా ఇంకా విడుదల కాకపోవడంతో నిరీక్షి స్తున్నారు. త్వరగా వస్తే పెట్టుబడులకు సద్వినియోగం చేసుకోవచ్చని ఆలోచిస్తున్నారు. సన్న ధాన్యాన్ని గతంలో వ్యాపారులకు విక్రయించేవారు. ఈ ఏడాది ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ప్రైవేట్ వ్యాపారులను కాదని ప్రభుత్వానికే ధాన్యాన్ని విక్రయించారు. అనుకున్న సమయానికి బోనస్ డబ్బులు జమకాక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

## ధర్మశాలలో సిపిఎ సదస్సులో పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్, మండలి ఛైర్మన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్29:** కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఎ) ఇండియా రీజియన్, జోనల్ 2 కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆదివారం హిమాచల్ ప్రదేశ్‌లో ధర్మశాల చేరుకున్నారు. ఈసందర్భంగా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ కులదీప్ సింగ్ పటానియాని శాలువాతో తెలంగాణ స్పీకర్, ఛైర్మన్ సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సెక్రటరీ జనరల్ పిసి మోడీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సతీష్ మహానా, తెలంగాణ లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు పాల్గొన్నారు. తర్వాత కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## రావి శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు

**హైదరాబాద్, జూన్29,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్చార్జి రావి శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటుపడింది. శ్రీనివాస్‌ను ఆరేళ్లపాటు సస్పెండ్ చేస్తున్నట్టు టిపిసిసి క్రమశిక్షణ కమిటీ ప్రకటించింది. రావి శ్రీనివాస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, జిల్లా ఇన్ఛార్జి మంత్రి సీతక్కపై విమర్శలు చేశారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేశారని ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షుడు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన టిపిసిసి క్రమశిక్షణ చర్య కమిటీ ఛైర్మన్ చిన్నారెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 28వ తేదీలోపు వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో పార్టీ నియమావళిని అనుసరించి చర్యలుంటాయని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. రావి శ్రీనివాస్ నుంచి సరైన వివరణ రాకపోవడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు.

### వారం - వర్జ్యం

తేది : 30-06-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
పంచమి ఉ.9.27
మఖ ఉ.7.22
వర్జ్యం మ.3.53-సా.5.35
దు.మ.12.38-1.30, 2) మ.3.15-సా.4.07
శుభసమయం : ఉ.5.15-6.00
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం :** జీవితభాగస్వామితో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. వాహనసౌఖ్యం.

**వృషభం :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. సాంకేతిక విద్యలపట్ల ఆసక్తిచూపుతారు.

**మిథునం:** మాటల చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకుని ఎంతటిపనినైనా సాధిస్తారు.

**కర్కాటకం:** పూర్వపు మిత్రుల నుండి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకొంటారు. వస్తుసేకరణ.

**సింహం:** కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**కన్య :** ఆస్తి వివాదాలు ఎదురై చికాకులుపెడతాయి. ఆర్థిక పరిస్థితి కొంతవరకు అనుకూలం.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. ఉద్యోగులు పదోన్నతి అవకాశాలు పొందుతారు.

**వృశ్చికం:** సంఘంలో కీర్తిప్రతిష్టలు పెరుగు తాయి. అనుకోని విధంగా ధన, వస్తు లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. మాటకు విలువ పెరుగుతుంది.

**మకరం:** ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా వుండును. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**కుంభం:**కళాకారులకు, సాంకేతిక నిపుణులకు ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి. ప్రయాణాలు.

**మీనం :** మిత్రుల కష్టాలను కూడా మీవిగా భావించి కష్టపడతారు. పోటీ పరీక్షలలో విజయం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## మిగులు నిల్వలతో భారత్ కరెంటుఖాతాలోటు!

### నాలుగోత్రైమాసికంలో 13.5 బిలియన్ డాలర్ల మిగులు

**న్యూఢిల్లీ,జూన్ 29:** భారత కరెంటుఖాతాలోటు వార్షికపద్ధతిలో గణిస్తే 2.3 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. అయితే నాలుగో త్రైమాసికంలో మాత్రం 13.5 బిలియన్ డాలర్లు మిగులుతో ఉన్నట్లు రిజర్వు బ్యాంకు ప్రకటించింది. జనవరి మార్చి త్రైమాసికం గణాంకాలను రిజర్వుబ్యాంకు ప్రకటించింది. వార్షికపద్ధతిన గణిస్తే జిడిపిలో 0.6శాతం లోటుతో ఉన్నట్లు తేలింది. భారత్ చెల్లింపుల సమన్వయ పట్టికలో రిజర్వుబ్యాంకు ఈ వివరాలు తెలిపింది. 2024-25 నాలుగోత్రైమాసికంలో 13.5 బిలియన్ డాలర్లు మిగులుతో ఉందని అంటే జిడిపిలో 1.3శాతంగా ఉందని ఆర్బీఐ వివరించింది. అంతకుముందు సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఉన్న 4.6 బిలియన్ డాలర్లతోపోలిస్తే మిగులు భారీగాపెరిగింది. దేశ బాహ్య చెల్లింపుల వ్యవస్థకుసూచీగా చెల్లింపుల సమన్వయ పట్టికను కొలుస్తారు. ఇక వాణిజ్య లోటు కూడా నాలుగోత్రైమాసికంలో 59.5 బిలియన్ డాలర్లుగా ఉంది. అదే అంతకుముందు సంవత్సరం వాణిజ్యలోటు 52 బిలియన్ డాలర్లతోపోలిస్తే మరింతగాపెరిగింది. అయితే మూడోత్రైమాసికం లోటు 79.3 బిలియన్ డాలర్లతోపోలిస్తే కొంతమేర మెరుగుపడింది. నికరంగా సేవల చాబడులు 53.3 బిలియన్ డాలర్లుగా ఉంది. గత ఏడాది 42.7 బిలియన్ డాలర్లతోపోలిస్తే ఎక్కువే. సేవలరంగ ఎగుమతులు ఏటికేడాది పద్ధతిలోచూస్తే బిజినెస్ సర్వీసెస్, కంప్యూటర్‌సర్వీసెస్ పరంగా ఎక్కువ ఉన్నాయి. ఇక నగదు జమలు కూడా భారీగానే పెరిగాయి. విదేశాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పంపించిన నగదు జమలు నాలుగోత్రైమాసికంలో 33.9 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గత ఏడాది ఇదేకాలంలోన4 31.3 బిలియన్ డాలర్లతోపోలిస్తే భారీగాపెరిగాయి. ప్రాథమిక రాబడి ఖాతాద్వారా వ్యయం అంటే ఇన్వెస్ట్‌మెంట్‌పరంగాచూస్తే 11.9 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇక ఆర్థికసేవల ఖాతాపరంగాచూస్తే ఎఫ్‌డిఐలు నికరంగా 400 మిలియన్ డాలర్లు వచ్చినట్లు తేలింది. అదే గత ఏడాది 2.3 బిలియన్‌డాలర్లుగా ఉంది. విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులపరంగా నికరంగా 5.9 బిలియన్ డాలర్లు బయటకువెళ్లాయి. ఇక విదేశీ కరెన్సీ నిల్వలకు సుమారు 8.8 బిలియన్ డాలర్లు అదనంగా జమ అయ్యాయి. గత ఏడాది వచ్చి 10.2 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐలతోపోలిస్తే ఈ ఏడాది వచ్చిన ఎఫ్‌డిఐలు బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2024-25లో ఎఫ్‌పిఐలు 3.6 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఏడాదిక్రితం ఎఫ్‌పిఐలు 44.1 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బీఐ తన నివేదికలో వెల్లడించింది.



ఆదివారం నిజామాబాద్‌లో పసుపు బోర్డును ప్రారంభిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా. చిత్రంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ఎంపి అర్వింద్ తదితరులు

## ఇక పసుపు రైతుకు పసిడి కాలం

>>సాధించారని చెప్పారు. పసుపుబోర్డు ప్రధాన కార్యాలయాన్ని కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేస్తున్నామని అమిత్ షా వెల్లడించారు. మోదీ ఏదైనా చెప్పారంటే అది తప్పకుండా చేసి చూపిస్తారని ఆయన అన్నారు. నిజామాబాద్ పసుపుకు ప్రపంచ మార్కెట్లో గొప్ప పేరుందని, దాని ప్రాధాన్యతను మరింత పెంచాల్సిన అవసరం ఉందని అమిత్ షా అభిప్రాయపడ్డారు. పసుపు కేవలం ఒక పంట కాదని, యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ క్యాన్సర్ గుణాలున్న ఒక దివ్య ఔషధమని ఆయన కొనియాడారు. "2030 సంవత్సరం నాటికి ఒక బిలియన్‌డాలర్ల (సుమారు రూ.8,300 కోట్లు) విలువైన పసుపు ఉత్పత్తులను భారతదేశం నుంచి ఎగుమతి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ బోర్డు ద్వారా రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ అందిస్తామని, తద్వారా దిగుబడి, నాణ్యత పెంచేందుకు తోడ్పడతామని అమిత్ షా వివరించారు. నిజామాబాద్ పసుపునకు ప్రత్యేక గుర్తింపు కోసం ఇప్పటికే జియో ట్యాగింగ్ ప్రక్రియను కూడా ప్రారంభించామని వెల్లడించారు. భారత్ కోఆపరేటివ్ సొసైటీల ద్వారా రైతులు ఆర్థికంగా మరింత ప్రయోజనం పొందేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. పహల్గాం ఘటనకు ప్రతీకారంగా పాకిస్థాన్ మూకలకు బుద్ధి చెప్పామన్నారు. పహల్గాంలో ఉగ్రదాడితో పాకిస్థాన్ మనల్ని భయపెట్టాలని చూసిందని ఆ తర్వాత భారత్ శక్తి ఏమిటో ఆదేశానికి, ప్రపంచానికి తెలిసింది అని అమిత్‌షా పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని మాత్రమే కాకుండా దేశంలోని నక్సలిజం కూడా లేకుండా చేయాలన్నదే మోదీ లక్ష్యమని స్పష్టం చేశారు..నక్సల్‌కు వ్యతిరేకంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఆయుధాలు పట్టిన వారిని వదిలేది లేదని హెచ్చరించారు. నక్సల్స్‌కు మద్దతుగా మాట్లాడే వారు, వారి బాధిత కుటుంబాల పరిస్థితి తెలుసుకోవాలని అన్నారు.మావోయిస్టులు (నక్సలైట్లు) తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. నక్సలిజాన్ని తుదముట్టించాలా లేదా? మీరే చెప్పండని అక్కడ ఉన్న సభికుల్ని ఉద్దేశించి అమిత్‌షా అన్నారు. 2026 మార్చి 30 లోపు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. నక్సలైట్లు త్వరగా జనజీవన స్రవంతిలోకి రావాలని అమిత్‌షా పిలుపునిచ్చారు. ఇప్పటికే 10వేల మంది నక్సలైట్లు లొంగిపోయారని, వారంతా జన జీవన స్రవంతిలోకి వచ్చేసినట్లు గుర్తుచేశారు.బీఆర్ఎస్ సర్కార్ అవినీతికి పాల్పడిందా? లేదా? అని ప్రజలను అమిత్ షా ప్రశ్నించారు. ధరణి పోర్టల్, కాళేశ్వరం ఇలా అనేక అంశాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను దిల్లీకి ఏటీఎంగా మార్చేసిందని ధ్వజమెత్తారు. తెలంగాణలో బీఆర్ఎస్‌పోయింది కానీ, అవినీతి పోలేదు అని అమిత్ షా అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ఎంపీలు ధర్మపురి అర్వింద్, డాక్టర్ కె. లక్ష్మణ్, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ కేతిరెడ్డి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పూరీ రథయాత్రలో తొక్కిసలాట

>> తరఫున క్షమాపణలు చెబుతున్నట్లు మాఝి ప్రకటించారు. ఈ భద్రతా నిర్లక్ష్యం క్షమించరానిదన్న ముఖ్యమంత్రి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భద్రతా వైఫల్యంపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ప్రకటించారు. పూరీ కలెక్టర్ సిద్ధార్థ్, ఎస్పీ బినిత్ అగర్వాల్‌ను బదిలీ చేస్తున్నట్లు వెల్లడించారు. వీరితో పాటు పూరీ డీసీపీ బిష్ణు చరణ్ పాటి, పోలీస్ కమాండెంట్ అజయ్ పధిని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.మరోవైపు పూరీ తొక్కిసలాట దుర్ఘటనపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి పూర్తిగా నిర్లక్ష్యం, సరైన నిర్వహణ లేకపోవడం వల్లే జరిగిందని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన ఆయన, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి కారణాలు తెలుసుకోవాలని సూచించారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, క్షతగాత్రులకు సరైన సహాయం అందించాలని ఒడిశా ప్రభుత్వాన్ని కోరారు. ఈ తొక్కిసలాట ఘటనపై పూరీ రాజు గజపతి మహారాజ దివ్యసింగ్‌దేబ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఒడిశా ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పూరీ జగన్నాథ్ రథయాత్రకు మరిన్ని ఏర్పాట్లు చేసి ఉండాల్సిందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభిప్రాయపడ్డారు. అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే తొక్కిసలాట చోటుచేసుకుందని భక్తులు ఆరోపించారు. అంబులెన్సులు కూడా అందుబాటులో ఉంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఈసారి రథయాత్ర ప్రారంభించడంలో ఆలస్యం జరగడంపై రాజకీయ వివాదం చెలరేగింది. మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దీనిని భయంకరమైన గందరగోళంగా అభివర్ణించారు. సరైన సమయానికే రథాలు గుండీచా ఆలయానికి చేరుకున్నాయని బీజేపీ చెబుతోంది. 1977 నుంచి రథాలు ఎల్లప్పుడూ రెండో రోజునే గుండిచా ఆలయానికి చేరుకుంటాయని ఒడిశా న్యాయశాఖ మంత్రి హరిచందన్ పేర్కొన్నారు. బాధితులరక్షణకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటామని వివరించారు.

## నేటి నుంచి మూడు రోజులు వర్షాలు

**హైదరాబాద్ జూన్ 29 ప్రభాతవార్త:** రాగల మూడురోజులు తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.ఉత్తర గుజరాత్ మీదుగానున్న ఉపరితల ఆవర్తం నుంచి వాయువ్య బంగాళాఖాతం, దానికి ఆనుకొని ఉన్న పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాల్లో మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌ఘడ్, ఉత్తర ఒడిశా మీదుగా అల్పపీడన ప్రాంతంతో సంబంధం ఉన్న ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతూ.. సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొలది దక్షిణ దిశగా వంగి ఉందని తెలిపింది. తెలంగాణలో మూడురోజులు వానలు కొనసాగుతాయని చెప్పింది. సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని చెప్పింది.మంగళవారం పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండలో బలమైన ఈదురుగాలులతో కూడిన వానలు కొనసాగుతాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## తిరుమల: కీలక దశకు 'కల్తీనెయ్యి' దర్యాప్తు

**తిరుమల,జూన్ 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల వెంకన్న లడ్డూల తయారీలో కల్తీనెయ్యి పాపానికి కారకులను గుర్తించిన సిబిఐ సిట్ అధికారులు తదుపరి కీలకచర్యలకు సిద్ధమవుతోందనేది సమాచారం. ఇప్పటికే లోతుగా నకిలీనెయ్యి సరఫరాలో మూలాలు కదిలించి ప్రధాన పాత్రదారులందరినీ రిమాండ్‌కు తరలించింది. ఇప్పుడు సిబిఐ సిట్ అధికారులు అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తుచేపట్టి తయారుచేసిన నివేదికలను సుప్రీంకోర్టుకు సమర్పించారు. ఈ నివేదికల్లో అనేక సంచలన అంశాలు పొందుపరిచారు. ఈ నివేదికలను సుప్రీంకోర్టు ధర్మాసనం పరిశీలించి తదుపరి వెలువడించే ఆదేశాల మేరకు సిట్ ముందుకుకదలనుందనేది తెలుస్తోంది. నకిలీనెయ్యి పాపంలో తమిళనాడు ఏఆర్ డెయిరీ ఎండి రాజశేఖరన్, నెయ్యిసరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌లోని పరాగ్‌డెయిరీ, ప్రీమియర్ అగ్రిఫుడ్స్,అల్ఫామిల్క్‌ఫుడ్స్, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు ఆశిశ్‌అగర్వాల్, విపిన్‌జైన్, పొమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక )సిఇఒఅపూర్వ వినయ్‌కాంత్‌చావ్డా, తోబాటు టిటిడి ఉద్యోగులు, డెయిరీల సిబ్బంది మొత్తం 15మందిని సిట్ అధికారులు ప్రధాన నిందితులను అరెస్టుచేసేసింది. ఇప్పుడు అసలు టెండర్లు పిలవడం, ఆ తరువాత ఎలాంటి అర్హత లేకున్నా బోలేబాబాడెయిరీకి నెయ్యిసరఫరాకు అనుమతించడం వంటివాటిల్లో ప్రధాన సూత్రధారులు ఎవరనేది తేల్చనుంది.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G. లిమిటెడ్
ఆపరేషన్ సర్కిల్, సికిందరాబాద్
టెండర్ ప్రకటన నం. 02/2025-26
సం/-, సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, సికిందరాబాద్ సర్కిల్.
DIPR.NO. 4285-PP/CL/ADVT/1/2025-26 తేది: 28.06.2025



కల్యాణ్‌నగర్ వెంచర్-3 సంక్షేమ సంఘం పార్కులో మన్‌కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.

# అధ్యక్షుని ఎన్నిక ఏకగ్రీవం కావాలని కోరుకుంటున్నాం

## 'మన్‌కి బాత్'లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), జూన్ 29, ప్రభాతవార్త:** మోతీనగర్ ప్రాంతంలోని కల్యాణ్‌నగర్ వెంచర్ 3 సంక్షేమ సంఘం పార్కులో బీజేపి పార్టీ మంకీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. నియోజక వర్గంలోని పలు డివిజన్‌లకు చెందిన బీజేపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .ఈసందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన పలు సంక్షేమ పథకాలను నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు వివరించారు. 11ఏళ్లుగా నీతినిజాయితీతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పనిచేస్తున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్న దేశ అభివృద్ధి కోసం ప్రధాని కృషి చేస్తున్నారన్నారు. పొరుగు దేశాలు ఆర్థిక రాజకీయ ఇబ్బందులు ఉన్న బారతదేశం అన్ని రంగాలలో ప్రపంచంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. బీజేపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పోటీలో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారని రేపు నామినేషన్‌ల స్వీకరణ ఉంటుందని జులై 1న అధ్యక్షున్ని ప్రకటించడం జరగుతుందన్నారు. అయితే అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవంగా ఉండాలని అందరం కోరుకుంటున్నామన్నారు. ఈ ఎన్నిక కోసం రేపు రాష్ట్రానికి సునీల్ బన్సాల్, శోభ రానున్నారని వారి సమక్షంలోనే నామినేషన్‌ల స్వీకరణ ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని అన్నారు. ఈ రోజు పసుపు బోర్డును అమిత్‌షా ప్రారంభిస్తున్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి కోసమో, కాంగ్రెస్ కోసమో తాము పనిచేయడం లేదని తెలిపారు. నగరంలోని డిపిఆర్ గత వారమే కేంద్రానికి సమర్పించడం జరిగిందని, మెట్రో రైలు సాధ్య అసాధ్యాలపై కేంద్రం పరిశీలిస్తుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా స్థానికంగా కొందరు స్థానిక సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యమంత్రిగా గత 40 సంవత్సరాల నుంచి నటరాజ్ నగర్ నుంచి రాజీవ్‌నగర్ వరకు ఉన్న రహదారి కుచించుకు పోయిందని రహదారి వెడల్పు పనులకు అడ్డుగా ఉన్న అడ్డంకులను తొలగించాలంటూ సోషల్ వర్కర్ ఇస్మాయేల్ ఖాన్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

# రెండు, మూడు నెలల్లోనే సిఎంగా డికె శివకుమార్

## కర్ణాటక ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ సంచలనం



**బెంగళూరు, జూన్ 29:** కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మరో రెండు, మూడు నెలల్లోనే సీఎం అవుతారని ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌ఏ ఇక్బాల్ హుస్సేన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది చివరిలో కర్ణాటకలో నాయకత్వ మార్పులు చేయాలని కాంగ్రెస్ భావిస్తోందన్నప్రచారం వస్తున్న తరుణంలో డీకే శివకుమార్ సన్నిహితుడైన ఇక్బాల్ వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తాజాగా రామనగరలో ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ మాట్లా డుతూ రాష్ట్రంలో ఈ ప్రభుత్వం ఏర్పాటుకాక ముందు కాంగ్రెస్ పార్టీ బలమేంటో మీకు తెలుసు కదా అని ఎదురు ప్రశ్న వేశారు. కాంగ్రెస్ కోసం ఎవరు కష్టపడ్డారో, ఎవరు చెమట చిందించారో, గెలుపు కోసం ఎవరు పోరాటం చేశారో ప్రతీ ఒక్కరికీ తెలుసన్నారు.శివకుమార్ వ్యూహాలు, కార్యక్రమాలు గొప్ప చరిత్ర అని ఇక్బాల్ హుస్సేన్ కొనియాడారు. హైకమాండ్‌పై తనకు పూర్తి నమ్మకం ఉందని ఆయన చెప్పారు. తప్పకుండా తమ నేత శివకుమార్‌కు కాంగ్రెస్ పార్టీ అవకాశాన్ని కల్పిస్తుందని ఆశిస్తున్నట్లు ఎమ్మెల్యే ఇక్బాల్ చెప్పుకొచ్చారు. ఈ ఏడాది సెప్టెంబరు తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక పరిణామాలు జరగబోతున్నాయని రాష్ట్ర మంత్రి కేఎన్ రాజన్న సంకేతాలిచ్చిన విషయాన్ని ఇక్బాల్ గుర్తు చేశారు. రెండు, మూడు నెలల్లోనే దీనిపై కాంగ్రెస్ హైకమాండ్ ఓ నిర్ణయం తీసుకోవచ్చన్నారు.

# ఖమేనీని హత్య చేయకుండా నేనే ఆపా..!

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 29:** ఖతార్‌లో ఉన్న అమెరికా వైమానిక స్థావరంపై దాడి చేయడం ద్వారా అగ్రరాజ్యం చెంప చెల్లుమనిపించామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ చేసిన వ్యాఖ్యలను యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధంలో విజయం తమదే అన్న ఖమేనీ మాటలను ట్రంప్ కొట్టి పారేశారు. ఈ ఘర్షణలో ఇరాన్ ఘోరంగా ఓడిపోయిందన్న వాస్తవాన్ని ఒప్పుకోవాలన్నారు. అంతేకాకుండా ఖమేనీ హత్య చేయాలని ఇజ్రాయెల్ చేసిన ప్లాన్ ను అడ్డుకున్నాని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 12 రోజుల ఇజ్రాయెల్ దాడులు చేసింది. అమెరికా మూడు కీలక అణు కేంద్రాలపై జరిపిన బీ2బాంబర్లతో విరుచుపడింది. ఈ దాడి తర్వాత మీ పరిస్థితి తల్లకిందులైందన్న నిజాన్ని ఖమేనీ ఒప్పుకోకపోవడం అసాధారణం. మీరు మీ దేశంలో నమ్మకమైన వ్యక్తి. దేశంలో మీకెంతో గౌరవం ఉంది. మీరు నిజం మాట్లాడాలి. మీరు దారుణంగా ఓడిపోయారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం యుద్ధం సమయంలో ఖమేనీని హత్య చేయాలనే ప్రణాళికను రచించింది. కానీ తాను ఇజ్రాయెల్ ప్రణాళికను వీటో చేశాం. ఖమేనీని ఘోరమైన మరణం నుంచి రక్షించానని అన్నారు.

అలాగే, తాము ఉపయోగించిన బంకర్ బస్టర్ బాంబుల గురించి ట్రంప్ గర్వంగా చెప్పుకొచ్చారు. అవి ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేశాయని పేర్కొన్నారు. తద్వారా టెహ్రాన్ అణు ప్రాజెక్టు కొన్ని నెలల పాటు వెనక్కి పడిపోయిందని అమెరికా రహస్య విభాగాలు (డీఐఏ) అంచనా వేశాయని చెప్పారు. ఖిఆయన(ఖమేనీ) దేశం ధ్వంసమైంది. మూడు అణు కేంద్రాలు నేలకూలాయి. ఆయన ఎక్కడ ఉన్నాడో నాకు తెలిసి కూడా, ఇజ్రాయెల్, అమెరికా సైన్యం ఆయనను చంపనివ్వలేదు. నేను ఆయనను రక్షించాను. ఇందుకు ఆయన నాకు ధన్యవాదాలు చెప్పకున్నా ఫర్వాలేదని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ తమ అణు ప్రోగ్రామ్‌ను మళ్లీ ప్రారంభించకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ట్రంప్ మరోసారి నొక్కి చెప్పారు.

# మేకిన్ ఇండియా కాదు.. ఇన్వెంట్ ఇన్ తెలంగాణ

## అదే మా నినాదం, లక్ష్యం.. ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు

### ఐఐటిఇఎక్స్ - 2025 ముగింపు వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** మేకిన్ ఇండియా కాదు, ఇన్వెంట్ ఇన్ తెలంగాణ అన్నదే సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ నినాదం, లక్ష్యమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని, తెలంగాణను ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివారం హైటెక్స్ లో ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్ టిసిసిఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్ పో(ఐఐటిఈఎక్స్) - 2025 ముగింపు వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో తెలంగాణ ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్(ఐఐపి) కంపౌండ్ మంత్లీ గ్రోత్ రేటు(సిఎంజిఆర్) 2.9 శాతం. అదే జాతీయ సగటు 0.52 శాతం మాత్రమే. ఆరు రేట్లు తెలంగాణలో అధికంగా నమోదయి ందన్నారు. 2024-25లో ఇండస్ట్రియల్ గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్(జిఎస్ విఏ) రూ.2.77 లక్షల కోట్లకు చేరిందన్నారు. ఇంధన వినియోగంలో 15.6 శాతం, జిఎస్‌టి వసూళ్లలో 9.8 శాతం, పేరోల్ ఎన్‌రోల్ మెంట్స్‌లో 13.9 శాతం వృద్ధి రేటు నమోదయ్యిందని ఈ సందర్భంగా వివరించారు.

**ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కేంద్రంగా ప్రత్యేక జోన్లు..**

తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ కొందరూ విష ప్రచారం చేస్తున్నారు. యేడాదిన్నర కాలంలోనే రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చామని తెలిపారు. ఒక్క లైఫ్ సైన్సెస్ రంగంలోనే రూ.40వేల కోట్ల పెట్టుబడులొచ్చాయని, కొత్తగా 150 కొత్త ప్రాజెక్టులు మొదలయ్యాయి.

51వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 1.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, లైఫ్ సైన్సెస్ సిటీ, గ్రీన్ ఇండస్ట్రియల్ కారిడార్స్‌ను అభివృద్ధి చేస్తున్నాం. పారిశ్రామి కాభివృద్ధి వికేంద్రీకరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఔవుటర్ రింగ్ రోడ్డు లోపల టెక్నాలజీ, సర్వీసెస్ జోన్, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య మ్యానుఫాక్చరింగ్ జోన్, ఆర్ఆర్ఆర్ బయట వ్యవసాయ, గ్రామీణ ఇన్నోవేషన్ జోన్‌ను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నామని వివరించారు.



**మా ప్రణాళికలు భవిష్యత్తు తరాల కోసం..**

మేం అయిదేళ్ల కోసం ప్రణాళికలు రూపొందించడం లేదు. రాబోయే తరాల కోసం ఆలోచిస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ఆ దిశగానే అడుగులు వేస్తున్నామని అన్నారు.

**జిఎస్‌టిపిలో ఎంఎస్ఎంఇల వాటా 10 శాతానికి పెరిగేలా**

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచే సూక్ష్మ, చిన్న, మద్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) బలోపేతంపై మా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. గత 18నెలల్లో కొత్తగా 15వేల ఎంఎస్ ఎంఈలు ప్రారంభయ్యాయి. మన జిఎస్‌డిపిలో ఎంఎస్ఎంఈల వాటాను 10 శాతానికి పెంచేలానే సంకల్పంతో గతయేడాది ప్రత్యేక పాలసీని రూపకల్పన చేశామన్నారు.

# వివేకానంద విదేశీ విద్యాపథకం కింద అందని ఆర్థిక సాయం

## ఆందోళనలో పేద బ్రాహ్మణ విద్యార్థులు

## అప్పులపాలవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** వివేకానంద విదేశీ విద్యాపథకం కింద పలుదేశాల్లో చదువును అభ్యసిచేందుకు వెళ్ళిన బ్రాహ్మణ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ పథకం కింద సమారు 300 మంది విద్యార్థులు అమెరికా ,బ్రిటన్ , కెనడా, ఆస్ట్రేలియా తదితరదేశాలకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్ళారు.గత కొద్ది కాలం నుంచి సరైన సమయానికి ప్రభుత్వం సాయం అందక పోవడంతో వారు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా అమెరికాలాంటి దేశాల్లో వారు పడే బాధలు వర్ణనాతీతం.అమెరికా అధ్యక్షుడు తీసుకున్న కొన్ని నిర్ణయాలు వీరిపై ఆర్థికంగా మరింత భారం పడుతోంది.రెండోసారి ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాక ముందు ఎర్నింగ్ బై లెర్నింగ్ పద్ధతిలో ఇండియా నుంచి వెళ్ళినవిద్యార్థుల అక్కడ ఏదో ఒక చిన్నాచితక ఉద్యోగం చేసుకుంటూ తమపొట్ట పోషించుకుంటూ ఉన్నత విద్యలను అభ్యసించేవారు. కాని ఈ పద్ధతిపై అధ్యక్షుడు నిషేదం విధించడంతో స్టూడెంట్ వీసాపై వచ్చిన వారు అక్కడ విద్యను అభ్యసించడం మినహా ఎటువంటి మరో పని చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ఇక్కడ నుంచి చదువు నిమిత్తం అక్కడకు వెళ్ళిన వారికి ఆర్థిక స్థోమత ఉన్న వారి తల్లిదండ్రులు కొంత మొత్తాన్ని పంపుతూ ఆసరగా నిలబడగా, ఎటువంటి ఆర్థిక స్తోమత లేక కేవలం ప్రభుత్వసాయం మీద ఆధారపడే వారు మాత్రం అటు చదువు కొనసా గించలేక, ఇటు ఆర్థాకలితో అలమటిస్తున్నారు. వీరి బాధలను చూడలేక కొంత మంది తల్లిదండ్రులు ఆస్తులు అమ్మి వారికి పంపుతుంటే,మరి కొంత మంది అప్పులుచేసి వారి తమ పిల్లలకు డబ్బును సర్దుబాటు చేస్తూ అక్కడ వారు ఇబ్బంది పడుతుంటే.. డబ్బును తమ పిల్లలకు పంపి ఇక్కడ వీరు ఇబ్బంది పడుతున్నారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు ప్రస్తుత 2024-25 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించినప్పటికీ ఇంతవరకు ఒక్క పైసా విడుదల చేయలేదనే విమర్శలు వస్తున్నాయి.వీటికి కేటాయించిన సొమ్మును ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్ళించిందనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.వచ్చే 2025-26 ఆర్థిక సంవత్సరం కోసం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ రూ.350 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన రూ.50 కోట్లు విడుదల చేస్తే పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు చెల్లింపులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం ఆయా సంక్షేమ పథకాలను కొనసాగించాలని భావిస్తే అందుకు తగినట్టుగా నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తప్ప కొత్త దరఖాస్తుల ప్రక్రియ చేపట్టే వీలులేదని వారు వివరించారు. విదేశీ విద్య, బెస్ట్ తదితర పథకాల అమలుతోపాటు గోపన్‌పల్లి, సూర్యాపేట బ్రాహ్మణ సదన్‌ల పనులను పూర్తి చేసేందుకు ఈ మేరకు నిధులు అవసరమని వారు పేర్కొన్నారు.

**ఆందోళన చేస్తాం : బ్రాహ్మణ సంఘాల నాయకులు**

ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయా సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు. అవసరమైతే సిఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు కూడా వెనుకాడేదని లేదంటున్నారు.

# దమ్ముంటే కాపాడుకో..

## మరికాసేపట్లో నిన్ను లేపేస్తాం..

### ఎంపి రఘునందన్‌రావుకు మళ్లీ బెదరింపు కాల్

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** బిజెపి మెదక్ ఎంపి రఘునందన్‌రావుకు మరోసారి బెదిరింపు కాల్ వచ్చింది. మరికాసేపట్లో చంపేస్తామని, ఆపరేషన్ కగార్ ఆపాలని అందులో పేర్కొన్నారు. తమ టీమ్‌లు హైదరాబాద్లో ఉన్నాయని, దమ్ముంటే కాపాడుకోవాలని సవాల్ విసిరారు. రెండు వేర్వేరు నెంబర్ల నుంచి వ్యక్తులు ఫోన్ చేశారు. ఏపి మావోయిస్టు కమిటీ ఆదేశాల మేరకు ఐదు బృందాలు రంగంలోకి దిగాయని వారు తెలిపారు. మా ఫోన్‌లు ట్రేస్ చేసేందుకు యత్నిస్తున్నారని, తమ సమాచారం దొరకదని, ఇంటర్నెట కాల్స్ వాడుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వదలబోమని హెచ్చరించారు. రఘునందన్‌రావుకు రెండు రోజుల క్రితం హైదరాబాద్లోని యశోద ఆస్పత్రిలో కాలికి సర్జరీ చేయించుకున్నారు. అక్కడ చికిత్స పొందుతుండగా ఈ ఫోన్ కాల్ వచ్చింది. జూన్ 23న మొదటి బెదిరింపు ఫోన్ కాల్ రావడంతో తెలంగాణ డిజిపితో పాటు సంగారెడ్డి, మెదక్ ఎస్పీలకు రఘునందన్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బెదిరింపుల నేపథ్యంలో రఘునందన్‌రావుకు ఎస్కార్ట్ వాహనంతో పాటు అదనపు సిబ్బందితో రక్షణ కల్పించారు.



# మొదటిభార్యకు విడాకులు ఇవ్వకుండానే రెండోపెళ్లి

## ఉత్తరాఖండ్ బిజెపి మాజీ ఎమ్మెల్యేపై ఆరేళ్ల బహిష్కరణ వేటు

**డెహ్రాడూన్, జూన్ 29:** బీజేపీ మాజీ ఎమ్మెల్యే రెండో వివాహం చేసుకున్నారు. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే మరో మహిళను పెళ్లాడారు. దీంతో బహుభార్యత్వానికి వ్యతిరేకంగా అమలు చేసిన యూనిఫాం సివిల్ కోడ్‌ను ఆయన ఉల్లంఘించడంపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ నుంచి ఆయనను బహిష్కరించింది. బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లో ఈ సంఘటన జరిగింది. హరిద్వార్‌లోని జ్వాలాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సురేష్ రాథోడ్ రెండో పెళ్లి చేసుకున్నారు. సహరాన్‌పూర్‌కు చెందిన నటి ఊర్మిళా సనావర్‌ను తన రెండవ భార్యగా ఆయన పరిచయం చేశారు. ఈ ఏడాది జనవరిలో బహుభార్యత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడిపౌరస్మృతిని ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వం అమలు చేసింది. అయితే మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే బీజేపీ నేత సురేష్ రాథోడ్ రెండో పెళ్లి చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. 'బీజేపీ తన సొంత నాయకులపై చట్టాన్ని అమలు చేయడం లేదు. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా యూసీసీని ఒక ఆయుధంగా మాత్రమే ఉపయోగిస్తోంది' అని కాంగ్రెస్ ఆరోపించింది. మరోవైపు ఈ విమర్శలపై బీజేపీ స్పందించింది. రెండో పెళ్లి చేసుకున్న సురేష్ రాథోడ్‌కు నోటీస్ జారీ చేసింది. ఆయన వివరణతో బీజేపీ నాయకత్వం సంతృప్తి చెందలేదని తెలిపింది.

# కేంద్రం దిగుమతి సుకం తగ్గించిన ఫలితం

## 10 శాతం మేర తగ్గిన ఆయిల్‌పామ్ ధరలు రేట్లు

### ఇప్పటికే వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖ

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** కేంద్రం ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలను తగ్గించడంతో దాని ప్రభావం తెలంగాణ రైతులపై తీవ్రంగా చూపుతోంది. దిగుమతి సుంకాలను తగ్గించడంతో ఆయిల్ పామ్ గెలల ధరలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, దీనివల్ల రాష్ట్రంలో ఆయిల్ పామ్ గెలల ధరలు 10 తగ్గాయి. దీనికి తగినట్లుగా ఆయిల్ పామ్‌కు కనీస మద్దతు ధరలు లేకపోవడంతో పాటు, పెరుగు తున్న ఖర్చులు, నాసిరకం మొక్కలు మరియు లాజిస్టికల్ సమస్యలు ఉన్నందున నష్టాలతో సాగును వదిలివేయాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముడి పామాయిల్, ఇతర వంట నూనెలపై దిగుమతి సుంకాలను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత, తెలంగాణలోని ఆయిల్ పామ్ రైతులు తాజా పండ్ల గుత్తుల (ఎఫ్ఎఫ్‌బి) ధరలు బాగా తగ్గడంతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ సంవత్సరం మే 31 నుండి అమలులోకి వచ్చిన సుంకం తగ్గింపుతో ధరలలో దాదాపు 10 తగ్గుదలకు దారితీసింది. మరోపక్క రాష్ట్రంలో కనీస మద్దతు ధర లేకపోవడం కూడా ఒక క్లిష్టమైన సమస్యగా రైతులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ అస్థిరతలను తట్టుకోవడానికి రైతులు కనీస మద్దతు ధరగా టన్నుకు రూ.25,000 డిమాండ్ చేస్తున్నారు.

ప్రధానంగా సాగు ఖర్చులు భారీగా పెరగడంతో ఇప్పటికే రైతులపై భారం పెరిగింది. కూలీ ధరలు రోజుకు రూ.300 నుండి రూ.800 నుండి రూ.1,000 వరకు పెరగ్గా, ఎరువులు, పురుగుమందుల ధరలు 120 శాతం వరకు పెరిగాయి. మరోపక్క కంపెనీలు సరఫరా చేస్తున్న నర్సీల్లో 10 నుండి 50 శాతం నాణ్యత లేనివిగా ఉండటంతో నాలుగు సంవత్సరాల కాలం తర్వాత చాలా తోటలు విఫలమవుతాయి, దీనివల్ల రైతులు వాటిని తొలగించి మరోసారి తిరిగి నాటవలసి వస్తుంది, ఫలితంగా భారీ ఆర్థిక నష్టాలు సంభవిస్తాయి. కాగా దిగుమతి సుంకం పెంచడంతో ఆయిల్ పామ్ రైతులు నష్టాల పాలవుతారని, ఈ నిర్ణయానిన పునసమీక్షించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కేంద్రానికి లేఖలు కూడా రాశారు. అయినా దిగుమతి సుంకంపై తగ్గింపు నిర్ణయాన్ని ఉపసంహరించ లేదు. దీంతో తెలంగాణలో ఆయిల్ పామ్ రైతుల పరిస్థితి దయనీయంగా తయారవుతోంది.

# యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో మరో ట్విస్ట్

## పూర్ణచంద్రనాయక్‌పై చిక్కడపల్లి పిఎస్‌లో పోక్సో కేసు

### అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 29, ప్రభాతవార్త:** టీవీ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో రోజుకో మలుపు తిరుగుతోంది. పూర్ణచంద్ర నాయక్‌పై ఓ బాలిక ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఆదివారం చిక్కడపల్లి పోలీసులు పోక్సో కేసును నమోదు చేశారు. చిక్కడపల్లి ఏసీపీ ఎల్. రమేశ్‌కుమార్ ఈ కేసుకు సంబంధించి వివరాలను స్థానిక ఇన్‌స్పెక్టర్ రాజూనాయక్‌తో కలిసి మీడియా ప్రతినిధుల సమావేశంలో వెల్లడించారు. పూర్ణచంద్రనాయక్ యాంకర్ స్వేచ్ఛను ఆత్మహత్యకు ప్రేరేపించడం, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడం. ఓ బాలిక ఇచ్చిన స్టేట్‌మెంట్‌ల ఆధారంగా తాము చేసిన దర్యాప్తులో నిజాలు బయటపడడం, పెళ్లి మాట దాట వేయడం వల్ల ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణ లో వెల్లడైందని వివరిం చారు. కాగా ప్రస్తుతం స్వేచ్ఛ ఉంటున్న అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డు చేసిన పోలీసులు, అనంతరం పలు అంశాలు, వివిధ కోణాల్లో లభించిన ఆధారాలను పరిశీలించాక పూర్ణ చంద్రనాయక్‌పై బి.ఎన్.ఎస్ 69, 108 యాక్ట్‌తోపాటు ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. విచారణ అనంతరం గాంధీ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించి నాంపల్లి తొమ్మిదో మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో ప్రవేశ పెట్టగా న్యాయ స్థానం పద్నాలుగు రోజుల జ్యుడిషయల్ రిమాండ్ విధిస్తూ తీర్పు వెలువరించారు. దీంతో పూర్ణచంద్ర నా యక్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. శనివారం రాత్రి ప్రముఖ న్యాయ వాది పి శ్రావణ్ కుమార్‌తో కలిసి చిక్కడ పల్లి పోలీసుస్టేషన్‌లో పూర్ణచంద్రనాయక్ లొం గి పోయాడు. అనం తరం రాత్రి పొద్దు పోయేవరకు పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు నిర్వహిం చారు. తమకు లభించిన ఆధారాలు, ఇతర అంశాలను నిందితుడు పూర్ణచంద్రనాయక్ నుంచి రాబట్టారు. కొన్ని విషయాలపై పూర్ణచంద్ర నాయక్ పోలీసులకు సహకరించలేదని తెలి సింది. ఆదివారం పోలీసులు తమ దర్యాప్తులో భాగంగా ఒక బాలిక నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్న అనంతరం పూర్ణచంద్రనాయక్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.



నాంపల్లి కోర్టుకు పూర్ణచంద్రనాయక్‌ను తరలిస్తున్న పోలీసులు

**మీడియాతో పూర్ణచంద్రనాయక్ అడ్వకేట్ శ్రవణ్..**

మరోవైపు పూర్ణచంద్రనాయక్ అడ్వకేట్ శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ పూర్ణచంద్ర నాయక్‌ను కలిసేందుకు వచ్చాను. పోలీసులు అనుమ తించలేదు. ఎఫ్ఐఆర్ కాపీ అందితే బెయిల్ పిటిషన్ వేస్తామన్నారు. పూర్ణచంద్రనాయక్‌ను పోలీసులు రిమాండ్ చేయడం, బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన అంశాలపై ఫోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. స్వేచ్ఛ తల్లిదండ్రులు ఆరోపించిన దాని ప్రకారంగా ఈ కేసులో హత్యకోణం ఏమిలేదని పూర్ణచంద్ర నాయక్‌పై ఏ సెక్షన్ల కింద కేసు నమోదయిందో దాని ఆధారంగా కోర్టులోనే పోరాడతామని తెలిపారు.

# ఆర్బీఐ 'పసిడి కోశాగారం'

## ఓ డాక్యుమెంటరీ కోసం తొలిసారి ప్రదర్శించిన రిజర్వ్‌బ్యాంక్

**ముంబయి, జూన్ 29:** రిజర్వుబ్యాంకు చరిత్రలోనే మొట్టమొదటిసారిగా తనవద్ద ఉన్న బంగారునిల్వలను ప్రదర్శించింది. పారదర్శకతను చాటిచెపుతున్న ఈనిల్వలను ప్రదర్శించడం వెనుక కూడా మరో కీలకమైన లక్ష్యం ఉంది. త్వరలోనే భారత రిజర్వుబ్యాంకుపై తీసిన డాక్యుమెంటరీ ఒకటి ఒటిటిల్లో ప్రసారానికి రానున్నది. ఆర్‌బిఐ అన్‌లాక్డ్ బియాండ్‌ది రూపీ అనేశీర్షికతో ఈ డాక్యుమెంటరీ జియో హాట్‌స్టార్‌లోప్రసారానికి రానున్నది. ఐదుభాగాలుగా ఉన్న ఈ డాక్యుమెంటరీ రిజర్వుబ్యాంకు సంక్లిష్టమైన విభాగాలతోపాటు పనితీరును కూడా వివరిస్తుంది. రిజర్వుబ్యాంకు 90వ వార్షికోత్సవం సందర్భంగా ఈ డాక్యుమెంటరీని ప్రదర్శించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆర్‌బిఐ ముందు తనవద్ద ఉన్న పసిడి ఖజానాను ప్రదర్శనకు పెట్టింది. ఒక్కొక్కటి 12.5 కిలోల బరువున్న బంగారు ఇటుకలను కూడా ప్రదర్శనలో ఉంచింది. ఒక్కొక్కటి కోట్లాదిరూపాయల విలువ ఉంటుందని అంచనా. మొత్తం రిజర్వుబ్యాంకు వద్ద ఇప్పటివరకూ 870 టన్నుల బంగారునిల్వలున్నట్లు తేలింది. దేశాలు ఆర్థికంగా పతనం అయినపుడు లేదా వృద్ధిలోకి వస్తున్నపుడు, అలాగే ఆర్థిక వ్యవస్థల్లో హెచ్చుతగ్గులున్నపుడు కూడా బగారం విలువల్లో మాత్రం ఎలాంటి మార్పులుండవు. చెల్లింపుల సమతుల్యత సందర్భంగా 1991లో భారత్‌లో సంక్షోభం ఎదురయినపుడు తనవద్ద ఉన్న బంగారం నిల్వల్లో కొంతమొత్తం విదేశాల్లో తాకట్టుపెట్టింది. అప్పటినుంచి భారత్ ఆర్థిక వ్యవస్థల్లో సమస్యలు,సంక్షోభాలు ఎదురయినపుడు వినియోగించేందుకు వీలుగా బంగారం నిల్వలనున పెంచుకుంటూ వచ్చింది. తాజా గణాంకాలప్రకారం రిజర్వుబ్యాంకు వద్ద ఉన్న బంగారం నిల్వలు 850 కోట్ల డాలర్ల విలువైనవని తేలింది. ఇన్వెస్టర్ల నమ్మకాన్ని పరిరక్షించడానికి, విదేశీ కరెన్సీ స్థిరత్వంకోసం ఈ నిల్వలు ప్రయోజనకారి అవుతాయని ఆర్‌బిఐ చెపుతోంది. ఇక డాక్యుమెంటరీపరంగాచూస్తే చిత్రాన్ని చాక్‌బోర్డ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించింది. ఆర్‌బిఐ 90 ఏళ్ల ప్రయాణంపై పూర్తి వివరణాత్మకంగా ఉంటుందని అంచనా.

# అమెరికాలో భారత్ మహిళ అదృశ్యం



**వాషింగ్టన్, జూన్ 29:** పెద్దలు కుదిర్చిన పెళ్లి కోసం అమెరికా వెళ్లిన భారతీయ మహిళ అదృశ్యమైంది. దీంతో అమెరికా పోలీసులు ఆమె కోసం వెతుకుతున్నారు. భారత్‌లోని ఆ మహిళ కుటుంబ సభ్యులను సంప్రదిం చేందుకు ప్రయత్నిస్తున్నారు. భారత్‌కు చెందిన 24 ఏళ్ల సిమ్రాన్ జూన్ 20న అమెరికా చేరుకున్నది. పెద్దలు కుదిర్చిన వివాహం కోసం ఆ దేశానికి వచ్చినట్లు అమెరికా అధికారులకు తెలియజేసింది. కాగా, అమెరికా వచ్చిన కొన్ని రోజులకే సిమ్రాన్ అదృశ్యమైనట్లు న్యూజెర్సీ అధికారులు తెలిపారు. జూన్ 25న ఆమె చివరిసారి కనిపించిన ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించినట్లు చెప్పారు. మొబైల్ ఫోన్ చూస్తున్న ఆమెలో ఎలాంటి ఆందోళన కనిపించలేదని అన్నారు. మరోవైపు కుదిర్చిన పెళ్లి కోసం కాకుండా ఫ్రీగా ట్రావెల్ చేసేందుకు సిమ్రాన్ అమెరికా వచ్చి ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. సిమ్రాన్ ఇంగ్లీష్ మాట్లాడలేదని, అమెరికాలో ఆమెకు బంధువులు ఎవరూ లేరని తెలిపారు. భారత్‌లోని ఆమె బంధువులను సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదన్నారు. సిమ్రాన్ రూపురేఖలు, మిస్సింగ్‌కు ముందు ఆమె ధరించిన దుస్తులు, ఇతర వివరాలను వెల్లడించారు. ఆమె ఆచూకీ గురించి ఎవరికైనా తెలిస్తే సమాచారం ఇవ్వాలని లిండెన్‌వోల్డ్ పోలీస్ డిటెక్టివ్ జో టోమసెట్టి కోరారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G. లిమిటెడ్
ఆపరేషన్ సర్కిల్, సికింద్రాబాద్
టెండర్ ప్రకటన నం. 02/2025-26
... 500 KVA CMD ... SEC 573 (11KV) ... SEC 585 (11KV) ... CMD 350 KVA ... E/M ... IN Gym Sec SEC 536 ... CMD 500 KVA ... RMUS ... www.tgsouthernpower.org ...
సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, సికింద్రాబాద్ సర్కిల్.
DIPR.NO. 4285-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 28.06.2025

వార్త

కసరత్తు శరీరానికి పటుత్వం కలిగిస్తుంది, చదవడం మనస్సును పదును పెడుతుంది.

-ఆర్.స్టీల్


# 'కట్టు' తప్పుతున్న యువత

దేశ కాలమాన పరిస్థితులు మారుతున్నాయి. సమాజం వికృత పోకడలు పోతోంది. పెడ ధోరణులు పెరుగుతున్నాయి. కట్టుబాట్లు కట్టలు తెంచుకుంటున్నాయి. ఎవరూ చట్టాన్ని లెక్క చేయడం లేదు. అయితే ఏమవుతుందిలే అనే ధోరణిలో ఆలోచిస్తున్నారు. చిన్ననాడు అమ్మ ఉగ్గుపాలతో నేర్పాల్సినవి నేర్పలేదనా, అమ్మమ్మ చెప్పే పేదరాశి పెద్దమ్మ కథలు వినిపించలేదనా..ఇవన్నీ కావు. రామాయణం, మహాభారతాల వంటి ఇతిహాసాల బోధనా వారికి బోధపడలేదనుకుందామా! ఎక్కడో 'గతి' తప్పుతోంది. దానికి కారణం కొత్తగా దశాబ్దకాలంగా చిట్టి చిట్టి చేతుల్లో వీర విజృంభణ చేస్తున్న స్మార్ట్‌ఫోన్‌లు చెడుగాడుతున్నాయనుకోవాలో అర్థంకాని పరిస్థితి. ఇక ఎక్కడ పడతే అక్కడ వారి వావి వరసలు, వయోబేధాలు లేని అసహజ కామోద్వేగాలు కూడా వినటానికే జుగుప్సాకరంగా ఉన్నాయి. ఇష్టం లేని పెళ్లిళ్ల కష్టంగా కాపురాలు.. ఆపై విడాకులు. ఇప్పుడా పరిస్థితిదాటి పోయిందని నిన్నమొన్నటి మేఘాలయలో ఇష్టం లేని పెళ్లి చేసుకుని ప్రియుడి ద్వారా సుపారీ గ్యాంగ్‌తో భర్తను చంపించిన వీరోచిత కార్యంగా భావించిన భార్య ఉదంతం విన్నాం. అక్రమ సంబంధాన్ని వారిస్తున్నా, పరాయి మగాడితో ఫోనులో పరాచిక సంభాషణ చేస్తున్నందుకు మందలించిన భర్తను ప్రియుడితో కలిసి హత్య చేయించిన భార్య నిర్వాకాన్ని తెలుసుకున్నాం. పిల్లలున్నా, భర్తతో కొన్నేళ్ల కాపురం చేసినా ఎందుకో కొందరిలో భర్తలంటే భార్యలకు ఏవగింపు కలుగుతోందని అర్థం చేసుకోవాలా? అనురాగానికి అర్థం తెలుసుకోలేకపోతున్నారనుకోవాలా? తెలియని పరిస్థితి. వివాహమర్యాదలు, కట్టుబాట్లు మరచి వివాహేతర సంబంధాలతో కాపురాలు కూల్చుకునేవారిని చూశాం. తాజాగా ప్రియుడి మోజులో వివాహితలే భర్తను ముట్టుపెట్టే వ్యూహాలు, కుట్రలు, కూహకాలు పన్నుతున్నారు. ఇన్‌స్టాగ్రాం, పరిచయాలు, వాట్సాప్ సంభాషణలుయువతలో అధికమ య్యాయి. ముక్కుమొహం తెలియని వారితో ప్రేమాయణాలు మంచివి కాదని చెప్పేతల్లుల్నే ద్వేషిస్తున్న యువ తుల్ని చూస్తున్నాం. నిన్నగాక మొన్న ప్రేమకు అడ్డొస్తోం దని తల్లిపై పగపెంచుకున్న ఓ కూతురు తల్లిని అన్యా యంగా చంపేసింది. ఇటీవల జరిగిన ఎన్నో ఉదంతాలు తీరుతెన్నులు చూస్తే ఇలాకూడా ఉంటాయా అనిపిస్తుంది. తల్లిని చిన్ననాటి నుంచే ద్వేషించి చివరకు తన ప్రియుడితో చంపించిన ఈ కేసులో చెల్లెలు దిక్కులేనిదయ్యింది. రెండు కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. ఆ కుటుంబాల్లో చిన్నవాళ్లే బయట మిగిలారు. నేరస్థులు జువెనైల్ హోమ్‌కు. ఇదేదో సినిమాలో చూసినట్లుందే అనే సంఘటనలు సమాజ వైపరీత్యాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. నవమాసాలు కనిపెంచి పోషించిన కన్నతల్లిని ఇంటి నుంచి బయటకు పంపేసిన కొడుకులు తల్లి ఆగ్రహాన్ని చవిచూస్తారు. వృద్ధాప్య జీవితంలో ఇలాంటి పరిస్థితి తలెత్తిన తల్లిదండ్రుల కోసం వచ్చిన కొత్త చట్టం కాస్త మేలు చేస్తోంది. కథలా బయటకు వస్తున్నాయి. తండ్రి ఆస్తి పంచలేదని అతని అంత్యక్రియలకు ససేమిరా అన్న ఆపిన కొడుకు ఘాతుక నిర్ణయం వెల్లడైంది. కూతుర్ల ప్రవర్తన నచ్చలేదని కోట్లాది రూపాయల ఆస్తిని ఆలయానికి దస్తావేజులో అందచేసిన తండ్రి వ్యధ కూడా బయటకొచ్చింది. ఏనాడో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలని తత్వవేత్త అరిస్టాటిల్ చెప్పిన విషయాలు ఇప్పుడు నిజమేననిపిస్తోంది. కనిపెంచి పోషించిన తల్లిదండ్రులను చెత్తకుప్పల పాలుచేయడం సభ్య సమాజం హర్షించదు. కానీ ఎందుచేతనో ఇలాంటి ఉదంతాలు ఎక్కువగానే ఉన్నాయంటే రక్తసంబంధాల్లో ప్రేమాప్యాయతలు, ఆదరాభిమానాల విషయమై ఎంతో మార్పు వస్తోందన్నమాట. పెళ్లిళ్ల సమయంలో ఎంతో ఆనందంగా కనపడిన ఓ నవ వధువు తీరా శోభనం గదిలోకెళ్ళాక, తాను వేరొకరిని ప్రేమిస్తున్నానని తనను తాకితే 35 ముక్కలవుతావని తొలిరాత్రి భర్తకు భార్యవార్నింగ్ ఇచ్చిన వైనం మరీ అనైతికం. ఈ ఉదంతం ప్రయాగరాజ్‌లో జరిగినా యువతులు, వారి ప్రేమలు ఇష్టం లేని పెళ్లిళ్ల ఎంతవరకు దిగజారుతాయో అర్థమౌతుంది. ఈఉదంతాన్ని పరకాయిస్తే ఐదు దశాబ్దాల నాడు ఒక భావకవి రచించిన 'నేలతో నీడ అన్నది నను తాకరాదని..నేడుభర్తనే తాకరాదని ఒకభార్య అన్నది' అన్న పాటలో పల్లవి గుర్తొస్తోంది. అంటే దాదాపుయాభై ఏళ్లనాడే ఇలాంటి పట్టింపుల గురించి ఊహించారని దానర్థం. ఇవన్నీ ఇలా ఉంటే కొత్తగా చాన్నాళ్లు కాపురం చేసి భార్యకోరిక మన్నించి ఆమెకు తన ప్రియునితో వివాహబంధాలు వేయించి త్యాగజీవులగా మారిపోతున్న భర్తలూ ఉంటారని ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. కాన్పూర్ సమీపంలోని భగ్గనివాడ గ్రామంలో పదిహేనేళ్ల కాపురం చేసిన తన భార్యకు వేరొకరికతో వివాహేతర సంబంధం ఉందని తెలిసి ఆమె ఇష్టానుసారం ఆ ప్రియుడితోనే వివాహం జరిపించాడో భర్త..ఇలా యువతీ యువకుల్లో కొత్త తరహా ఆలోచనలు పుట్టుకు రావడాన్ని కాల మహిమ అనుకుందామా! కలిగయుగమంటే ఇంతేమరి అని సరిపెట్టుకుందామా? తేల్చుకోలేని పరిస్థితి, సంస్కృతి సంప్రదాయాలంటూ కట్టుబాట్లను పట్టుకుని వేళ్లాడే భారతీయులకు ఎంతకష్టమొచ్చిందో! కాలానుగతిన ఎన్ని మార్పులు వస్తాయో ఎవరికీ తెలియదు. ఇప్పుడు వింటున్నదీ కంటున్నదీ అరుదైన ఉదంతాలుగా చెప్పుకుంటున్నా నేరాలకు పాల్పడే ఆత్మీయ సంబంధాలను వదిలిపెట్టేసి సమాజపు కట్టుబాటులను పక్కన బెడుతున్న సంఘటనలు, సందర్భాలు ఉదంతాలు జరగకుండా చిన్న వయసులోనే యువతీయువకులకు మానసిక విశ్లేషణ చేయించి ముందస్తు కౌన్సిలింగ్ చేయించడం అవసరమే మరి.



శారీరక సౌందర్యం ఎంత ఉన్నా, హృదయ సౌందర్యం లేకపోతే అదంతా వ్యర్థమే!

వివేకానందుడు



ఇంద్రియపరమైన విషయాలతో ఎంతగా మనిషి తెగతెంపులు చేసుకుంటాడో, అంతగా అతడు భగవంతుని పట్ల ఆకర్షితుడవుతాడు.

రమణ మహర్షి

# యుద్ధాలతో నలిగిపోతున్నది సామాన్య జనాలే!

ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రజల్లో అణు యుద్ధం భయం లేకపోలేదు. కనిపించని కరోనా వైరస్ ప్రపంచాన్ని కుదిపి వేసినప్పటికీ అంతకంటే ఘోరంగా మతోన్మాదం పేరిట సర్వసాధనమైన మనుషులను పొట్టన పెట్టుకుంటున్నటువంటి యుద్ధాలు ఎవరికి ప్రయోజనం లేదు. గతంలో రాజ్య విస్తరణ కోసం అనేక యుద్ధాలు జరిగిన సంఘటనలు విధితమే కానీ నేటి ఆధునిక యుగంలో మతవాదం అనే ఒక అంశంపై యుద్ధనీతికీ అజ్ఞానపు మతహింసకు అశాంతి అలజడుకు ఆజ్యం పోస్తున్నట్లు గోచరిస్తుంది. ఏదేమైనాప్పటికీ మతం అనేది మనిషి మనుగడ కొరకు శాంతి జీవనాలకు ఆదర్శవంతమైన మానవతా విలువలకు ప్రతిబింబంవలే ఉంటుందే తప్ప ప్రపంచంలో ఎక్కడా కూడా మతహింసకు తావిచ్చే విధంగా ఏ మత గ్రంథం రచింపబడలేదని అందరూ గ్రహించాలి.

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దక్షిణాసియా ఖండంలో ఇజ్రాయిల్ పాలస్తినాలోని హమాస్ మధ్య జరిగిన అంతర్గత యుద్ధంలో ప్రాణ నష్టం అధికంగా జరిగినప్పటికీ, ఇజ్రాయిల్ అక్కడితో ఆగిపోకుండా హమాస్ ఉగ్రవాద సంస్థగా పరిగణించి దానికి ఇరాన్ దేశ ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని భావించి ఇజ్రాయిల్ ఇరాన్ సైనిక స్థావరాలపై దాడులు చేసింది. అంతేకాకుండా తమకు ఇరాన్ దేశంతో అణు ముప్పు ఉన్నదన్న సమాచారంతో ఏకంగా ఇరాన్‌లో అణు స్థావరాలని చెప్పుతున్న ప్రాంతంలో దాడులు కొనసాగించింది. ఇంకేముంది ఇరాన్ మాత్రం తామేం తక్కువ కాదని ఇజ్రాయిల్‌పై ప్రతిదాడికి దిగింది. కానీ ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే యుద్ధంలో వాడే హానికరమైన ఆయుధాలతో ఆయా దేశాల్లోని మామూలు జనాల దైనందిన జీవితాలు అస్తవ్యస్తమై, బ్రతికిన చోట ఉండలేక ప్రాణం గుప్పిట్లో పెట్టుకుని వేరే ప్రాంతానికి వలసలుగా వెళ్లిపోతుండడం బాధాకరం. మతోన్మాద యుద్ధాలలో చేతుల్లో బలి అయిపోతుండడం శోచనీయం. సాధారణంగా ఏ దేశంలోని ప్రజలైన యుద్ధాన్ని ఆకాంక్షించరు. మతోన్మాదానికి దాదాపుగా ఎవరు మక్కువ చూపరు వత్తాసు పలకరు. మితిమీరిన మతోన్మాద ప్రభుత్వాలు ఉన్నటువంటి దేశాల్లో మతం కొరకు మారణ హోమాన్ని సృష్టించుట ఎంతవరకు సమంజసం అనే వాదనలు వినిపిస్తున్నాయి. చరిత్రలో రాజ్య విస్తరణకు రాజ్యాల మధ్య జరిగిన యుద్ధ సంఘటనలను గురించి విన్నాం, కానీ మతోన్మాదంతో పెనవేసుకుపోయిన ఉగ్రవాద జాడలనువారి వల్ల బలైపోతున్న జనాలను చూస్తుంటే మనసు తరుక్కుపోతుంటుంది. మితిమీరిన మతాభిమానంతో జరిగిన నష్టాలను ఆధునిక ప్రపంచంలో దేశాలు గ్రహిస్తున్న ఇలాంటి కొన్ని దేశాలు దేశంలోని జీవన విధానాలపై ప్రజల శ్రేయస్సుకొరకు ఆలోచించకుండా మతమే ముఖ్యమైనది అన్నట్లు ఇలాంటి యుద్ధాలకు కొంతమంది పాలకులు ఆజ్యం పోస్తుంటారా అనే సందేహాలు కలుగక మానవు. మతాలేవీ మతాధిపత్యం గురించి మతం గురించి కొట్లాడుకోమని ఎక్కడాచెప్పలేదు. మతాలను గౌరవించుకొని భిన్న సంస్కృతుల్లో మానవ జీవ మనుగడ శాంతియుతంగా జరగాలని ఏ మతమైనా నొక్కి వక్కాణిస్తుంది. అలాంటి వాటిని వదిలేసి నేటి ఆధునిక యుగంలో మితిమీరిన మతాభి మానంతో మతోన్మాదం వృద్ధి చెంది ఉగ్రవాదంగా మారిపోవడం ప్రస్తుత ప్రపంచ దేశాల్లో జరుగుతున్న యుద్ధాలను చూస్తే సందేహాలు కలుగక మానవు. ఆధునిక యుగంలో అధునాతన ఆయుధ సంపత్తి కలిగిన అగ్ర దేశమైన అమెరికా కూడా పెద్దతరహా లేకుండా మతోన్మాదంతో యుద్ధాలు చేసుకుంటున్న దేశాల మధ్య శాంతి మార్గాన్ని సూచించాల్సింది పోయి ఏకంగా మత యుద్ధాలను ప్రేరేపించే విధంగా ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్ అణు స్థావరా



లపై దాడి చేయడం ముస్లింలు, యూదుల, అరబ్బుల మధ్య ఇంకా ఎక్కువ తీవ్ర ఘర్షణలకు తావిచ్చేటట్లు ఉంటున్నాయి అనే అనుమానాలు కలగక మానవు. ఆయుధాలను కేవలం తమ ఆత్మరక్షణ విషయాల్లో అవసరమైతేనే ఉపయోగించే తీరుండాలి. అలాంటి అధునాతన ఆయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి చేరిపోతే ఇంకేముంటుంది ప్రపంచ వినాశనం తప్ప. ముఖ్యంగా దక్షిణ ఆసియా అశాంతికి నిలయంగా మారాలన్న కుట్రలు కనీ కనబడనట్టు గోచరిస్తూనే ఉంది. అమెరికా లాంటి యూరప్ దేశాలు యూరప్ ఖండాన్ని శాంతియుతంగా ఉండాలని ఆసియా ఖండంలో వీలైనప్పుడల్లా దేశాల మధ్య అస్థిరత పరచాలన్నది నైజాం కావచ్చు అనే భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ముందుంటున్నామన్న దురహంకారంతో అమెరికా లాంటి దేశం తనకు అనుకూలంగా లేని దేశాలను సామవేద దండోపాయంతో బెదిరించడం ప్రపంచ దేశాలు గమనించాల్సందే అనే భిన్న వాదనలు ఉన్నాయి. పాకిస్థాన్ ఉగ్రవాదుల విషయంలో భారత్ తీసుకున్న నిర్ణయాల విషయంలోనూ అమెరికా తల దూర్చింది. కానీ సంధి కుదిరిచినట్టు ప్రగల్బాలు పలికింది. ఏకంగా అమెరికా అధ్యక్షుడు ప్రపంచ శాంతి దూతగా ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న దేశాలతోనే నోబుల్ శాంతి బహుమతి కొరకు మద్దతు కూడగట్టుకోవడం హాస్యాస్పదంగా అనిపించక మానదు. ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య జరుగుతున్న పరస్పర మతాల సార్వభౌమత్వానికి జరుగుతున్న దాడుల్లో ఏకంగా అగ్రరాజ్యమే యుద్ధానికి దిగి బెదిరింపు ధోరణితో ఇరాన్ దేశాన్ని తన గుప్పిట్లో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న అగ్రరాజ్యం దక్షిణాసియా ప్రాంతాల్లో సుస్థిరత లేకుండా కుటిల నీతిని ప్రదర్శిస్తుందా అనే సంశయం లేకపోలేదు. శాంతియుత మార్గంలో ప్రపంచ శాంతి మానవ మనగడే ధ్యేయంగా ఉండవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని యుద్ధాన్ని ఆకాంక్షించే వారికి అర్థంకావలసి ఉంది. ఆధునిక ప్రపంచంలో మూర్ఖంగా అజ్ఞాన విహీనులైనట్లు కేవలం మతాధిపత్యం కొరకు ఏకంగా అణు ఆయుధాలతో యుద్ధం చేస్తామనడం ఏ దేశానికి సరైన విధానం కాదు. మత యుద్ధాలకు తావిచ్చే సందర్భంలో మతోన్మాద శత్రు చేతిలో అణుఆయుధాలు అత్యంత ప్రమాదకరమైనవి. ఆధునిక యుగంలో మితిమీరిన మతాభిమానంతో వికృత చేష్టలతో, అణుబాంబులతో విరుచుకుపడుతామనడం సరైన విధానం కాదని ప్రజల శ్రేయస్సును కోరేపాలకులు గ్రహించాలి. అణు సంపత్తిని సమకూర్చుకున్న అనేక దేశాలుఅణు బాంబులు తమ దేశప్రయోజనాల కోసం అంటున్న ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రజల్లో అణు యుద్ధం భయం లేకపోలేదు. కనిపించని కరోనా వైరస్ ప్రపంచాన్ని కుదిపి వేసినప్పటికీ అంతకంటే ఘోరంగా మతోన్మాదం పేరిట సర్వసాధనమైన మనుషులను పొట్టన పెట్టుకుంటున్నటువంటి యుద్ధాలు ఎవరికి ప్రయోజనం లేదు. గతంలో రాజ్య విస్తరణ కోసం అనేక యుద్ధాలు జరిగిన సంఘటనలు విధితమే కానీ నేటి ఆధునిక యుగంలో మతవాదం అనే ఒక అంశంపై యుద్ధ నీతికీ అజ్ఞానపు మతహింసకు అశాంతి అలజడుకు ఆజ్యం పోస్తున్నట్లు గోచరిస్తుంది. ఏదేమైనాప్పటికీ మతం అనేది మనిషి మనుగడ కొరకు శాంతి జీవనాలకు ఆదర్శవంతమైన మానవతా విలువలకు ప్రతిబింబంవలే ఉంటుందేతప్పప్రపంచంలో ఎక్కడా కూడా మత హింసకు తావిచ్చే విధంగా ఏ మత గ్రంథం రచింపబడలేదని అందరూ గ్రహించాలి. ●

# అన్నదాతలను ఆదుకునేవారే లేరా?

మేకిరి దామోదర్

రైతు లేనిదే రాజ్యం లేదు, అన్నదాతలే దేశానికి వెన్నెముక. జై కిసాన్ అంటూ జేజేలు పలుకుతూ పల్లకి మోతలే, 'మాటలు కోటలు దాటుతున్నాయిచేతలు తంగేళ్ల దాటడం లేదు' అన్నట్లుగా ఉంది. నిజానికి రైతు శ్రమకు తగ్గ గుర్తింపు, గౌరవం ఇస్తున్నామా! అంటే లేదని చెప్పాల్సి వస్తుంది. ఎందుకంటే? మన దేశానికిస్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంది. కానీ పారిశ్రామిక, సాంకేతిక, సేవారంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. జాతీయ స్థూల విలువ జోడింపు (జీవిఎ)లో వ్యవసాయం దాని అనుబంధ రంగాల వాటా తగ్గుతోంది. కృత్రిమ మేధ (ఏఐ)అన్ని రంగాల్లోనూ ప్రవేశించి ప్రగతి పరుగులు పెట్టిస్తుంటే!. వ్యవసాయరంగం "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే"అన్న చందంగా కునారిల్లుతుంది. రైతు ఆత్మహత్యలను ఆపలేకపోవడం పాలకుల లోపమా?, రైతుల శాపమా!. ఏది ఏమైనా బలిపీఠంపై ఉన్న సాగును బాగుపడేలా చేస్తూ, రైతును రాజును చేసే సంగతేమో కాని కనీసం ఆత్మహత్యలను నివారించాల్సి ఉందనేది కాదనలేని నిజం. అప్పుడే నేటి తరం యువత ఆ రంగంలోకి రాగలరు. ఈమధ్య రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కల్పించడం అభినందనీయమే. కానీ మన దేశంలో ఎక్కువ మందికి జీవనోపాధి కల్పించే సాగును, దాన్నే నమ్ముకున్న రైతాంగం బాగుపడ్డ రోజే వారి జీవితాల్లో నిజమైన ఆనందం. ఈ సంవత్సరం వర్షాలు జోరుగా కురుస్తాయని, రుతుపవనాలు ముందే వస్తాయని వాతావరణశాఖ చెప్పింది. అలానే జూన్ మొదట్లో రుతుపవనాలు వచ్చి తొలకరి కురిసి మురిపించింది. ఆ తర్వాత జూన్ నెల చివరకు వస్తున్నా ఆకాశం మేఘావృతమై ఉంటుందే కానీ వర్షాలు పడడం లేదు. తొలకరి వానలకు నాటిన పత్తి తదితర పంటల కోసం రైతులు నొసటిన చేయి పెట్టి ఆకాశం వైపు ఎదురుచూస్తున్న పరిస్థితులు ఇన్నేళ్లైనా మారనేలేదు. మన దేశంలో అన్నదాతలకు ఎంతో ముఖ్యమైన కాలమిది. జాతికి మెతుకునిచ్చి, బతుకు నిలిపే రైతన్న పుడమినే పుత్తడి (పులకింప)చేసి పూతలు పూయించి కాతలు కాయిస్తు, బురదను మలిచి బువ్వను చేసే పుణ్య పురుషుడు అన్నదాత.



తొలకరి వానలకు ముందుగా నాలుగు సార్లు దుక్కి దున్ని విత్తనాలు నాటుతారు. మొక్క మొలకెత్తింది మొదలు దానిని పసి బిడ్డను చూసినట్లు అపురూపంగా చూసుకుంటాడు. కలుపుతీస్తాడు, మందులు వేస్తాడు పంట చేతికందే సరికి అనావృష్టో లేదా అతివృష్టి వలనో ఆ పైరు ఎండిపోవడమో, కొట్టుకపోవడమో జరుగుతుంది. విత్తనాల ఖర్చులు కూడా తిరిగిరాని దయనీయస్థితి. వ్యవసాయం అంటే పండినా, పండకపోయినా రైతు నిరాశ చెందకుండా ముందుకే సాగుతాడు. ఈ పరిస్థితి ఈనాటిది కాదు? తరతరాలుగా తాత ముత్తాతల నుంచి చూస్తున్నారు. మన దేశంలో సాగు రంగంలో దండు! పండుగ రెండూ ఉంటాయి. ఈ రంగంలో ఒక ఏడు పండితే? మరో ఏడు పండదు. అయినా పండలేదని రైతు కాడిమేడి వదిలేస్తే!. అందరికీ ఆహారం ఎలా?. ప్రకృతి విపత్తులకు తోడు పాలకుల ఉదాసీనత, వ్యాపా(దళా)రుల దోపిడీ నాసిరకం విత్తనాలు, నకిలీ పురుగుమందులు, నాణ్యతలేని ఎరువులు ఇలా అనేక విధాలుగా అష్టకష్టాలైనా అనుభవిస్తూ, అధిగమిస్తూ పంట పండిస్తాడు. చివరకు పండిన పంట అమ్ముకునే నాటికి గిట్టుబాటు (మద్దతు) ధర ఉండదు. అలా అని రైతు నిరాశకు, నిస్పృహకులోనైతే మనం బతికేదెలా! రైతులను ప్రకృతి, పాలకులు, వ్యాపారులు దగా చేస్తున్నా వ్యవసాయాన్ని వదులుకోడు. కాడిదించే ప్రసక్తే లేదు. రేయింబవళ్లు ఎండా వానా ఏదైనా సరేనిత్యం పుడమి తల్లిని, వ్యవసాయాన్ని నమ్ముకొని అదే పని చేస్తుంటాడు. వారి శ్రమ వెలకట్టలేనిది. "సూర్యుడైనా మబ్బుల చాటుకెళ్ళి కాసేపు విశ్రాంతి తీసుకుంటాడేమో' కానీ రైతు మాత్రం అవిశ్రాంతంగా దేశానికి పట్టెడు అన్నం పెట్టడం కోసం ఫలితం మీద ధ్యాస లేకుండా పోరాడుతూనే ఉంటాడు. దళా(వ్యాపా)రుల దోపిడీ నుంచి విముక్తి కలిగించి, పంటకు గిట్టుబాటు(మద్దతు)ధర కల్పించిన నాడే ఈ తరం యువత వ్యవసాయం వైపు మళ్లుతారు. పట్టణాలకు వలస నివారించబడుతోంది. దేశసౌభాగ్యానికి పునాది రాళ్లయిన అన్నదాతలు చల్లగా ఉంటేనే మన కడుపు చల్లగా ఉంటుంది. ఈ దేశంలో సాగు రంగాన్ని తరతరాలుగా పట్టిపీడిస్తున్న ఆత్మహత్యల సామాజిక రుగ్మతను తరిమి వేయాల్సిన బాధ్యత ముమ్మాటికి ప్రభుత్వాలదే. ఇదంతా రైతుకు చేయాల్సిన అందరి కనీస బాధ్యత. పాలకులు, పాలితులు ఏమిచ్చినా రైతు రుణం తీర్చుకోలేరు. సాగునే నమ్ముకున్న అన్నదాతల ఆత్మహత్యలు నివారించబడి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన రోజే నిజమైన పండుగ. ●

# ప్రజావాక్కు



## అంతరిక్ష చరిత్రలో మరో మైలురాయి

భారతఅంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా అంతరిక్ష సంస్థ(నాసా), ఐరోపాఅంతరిక్ష సంస్థలు భాగస్వామ్యం వహించగా, వేర్వేరు కారణాల వల్ల అనేక సార్లు వాయిదా పడి ఎట్టకేలకు భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసీ యాత్రకు బయల్దేరారు. 41 సంవత్సరాల తర్వాత రాకేష్ శర్మ తర్వాత అంతరిక్షంలో అడుగుపెట్టనున్న రెండో భారతీయుడుగా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడుగా శుభాంశు శుక్లా రికార్డుల కెక్కనున్నారు. అంతరిక్షయాత్ర కేవలంఒక సాహసం మాత్రమేకాదు, ఇది శాస్త్ర, సాంకేతికరంగాల్లో ముందడుగు వేసే ఒక గొప్ప ప్రయోగం. భూమికి వెలుపల జీవనం సాధ్యమా? అనే ప్రశ్నకు సమాధానం వెతికే ప్రయత్నం కూడా అంతరిక్ష ప్రయాణంలో భాగమే.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## భద్రతను బలోపేతం చేయాలి

ఒడిషా గోపాలపురం బీచ్‌లోఇటీవల చోటుచేసుకున్న హేయమైన సామూహిక లైంగిక దాడి ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో కలవరపెట్టింది. ఈ నేపథ్యంలో ఒడిషా ప్రభుత్వం ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో భద్రతను బలోపేతం చేయాలని తీసుకున్న నిర్ణయం సమయోచితమైనది, అవసరమైనదిగా పేర్కొనాలి. పర్యాటక ప్రాంతాలు విదేశీ పర్యాటకులు, కుటుంబాలు, ఒంటరిగా ప్రయాణించే మహిళలు వంటి వేలాది మందిని ఆకర్షిస్తాయి. వీరి భద్రత కేవలం శాంతిభద్రతల సమస్య మాత్రమే కాకుండా, దేశ పర్యాటక రంగ ప్రతిష్ఠకు సంబంధించిన అంశం కూడా. గోపాలపురం లాంటి సంఘటనలు పర్యాటకులలో భయం, అనుమానాలను కలిగించి, దేశ పర్యాటక సామర్థ్యాన్ని తీవ్రమైనంగా దెబ్బతీస్తాయి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## చట్టాల అమలుపై దృష్టి పెట్టాలి

దేశంలోనిమూలవాసులు ఇవ్వాళ అస్తిత్వపరీక్షను ఎదురుకొంటున్నారు. తూర్పు మధ్య భారతాల్లో విస్తరించిన ఆదివాసులకు తమ వనరుల కోసం తమ జీవిక కోసం కూడా పోరాటం చేయవలసివస్తుంది. ఇది ఎంతమాత్రం ఆమోదనీయంకాదు. ఆదివాసుల కాళ్ళకింద ఉన్నకోట్ల విలువైన నిక్షేపాలపైనమాత్రమే ప్రభుత్వాలు దృష్టిపెడుతున్నాయి .

- భారత అవినాష్, ముత్తారాం

## ఉపాధ్యాయులపై ఒత్తిడి వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి విపరీతమైన ఒత్తిడి పెరిగిపోయింది. గతవారం రోజులుగా అటెండెన్స్‌లో గ్రేస్ పీరియడ్ కూడా తీసివేసినట్లుగా సమాచారం. ఉదయం 9గంటలు దాటిన తర్వాత ఫెసియల్ అటెండెన్స్ ఉపాధ్యాయులు వేసినప్పటికీ మండలవిద్యాశాఖ అధికారులు కార్యాలయాల నుంచి ఆబ్సెంట్ అని మెసేజ్‌లు వస్తుండటంతో ఉపాధ్యాయులు బెంబేలెత్తిపోతున్నారు. విద్యాశాఖ అధికారులు మానిటరింగ్ చేస్తూ ఉపాధ్యాయుల ఫేషియల్ అటెండెన్స్ ఉదయం9గంటలలోపు వేయాలని ఉపాధ్యాయులపై తీసుకొచ్చిన ఈ అసమంజస అమానుష ఒత్తిడి తగ్గించాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉపాధ్యాయులు పని చేసుకునే అవకాశం కల్పించాలి. ఈవిధంగా ఉపాధ్యాయులను తీవ్రఒత్తిడి, ఒడిదుడుకులకు గురి చేయకుండా విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం వాతావరణంలో పని చేసుకునే అవకాశం కల్పించాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## పైచేయి కాదు శాంతే ముఖ్యం

విజయంఎవరిదైనా గొప్పలుపోరాదు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఆహ్వానించదగినదే. ఇరాన్ సుప్రీం నేత ఖోమేని వ్యాఖ్య నించడం అతని స్థాయికి తగ్గట్లు లేదు. మేము అమెరికా పై విజయం సాధించామని చెప్పడం, మా దెబ్బకు అమెరికానే ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ చేయించింది. ఈ సందర్భంగాఖోమేని ఇజ్రాయెల్‌పై మేమువిజయం సాధించాం. ఇజ్రాయెల్‌మాదాడితో తీవ్రంగా నష్టపోయినందువల్లే అమెరికా ఇజ్రాయెల్‌కు నచ్చ జెప్పింది అనే భోగట్టా. నెతన్యాహూకు మా బలం ఏమిటో తెలిసివచ్చింది. అందుకే అమెరికా మెత్తబడింది. అమెరికా ను కూడా మేము నష్ట పరిచాం అని చెప్పడం, పశ్చిమ ఆసియాలో అమెరికాకు తీవ్ర నష్టం కలిగించాం.

- కనుమ ఎల్లారెడ్డి, హైదరాబాద్

## రీడర్ అలవెన్సు పెంచాలి

అంధలెక్చరర్స్, టీచర్స్ గురుకులాలలో, ప్రభుత్వ విద్యాసంసలలో విద్యార్థులకు బోధన చేయడంలో, సహాయకుల అవసరతఎక్కువగా ఉంటుంది. సూక్ష్మఅక్షరాలు, కంప్యూటర్ క్లాసులు, టీచింగ్ డైరీ రాయడం, హౌస్‌మాస్టర్ డ్యూటీలు, నైట్ స్టడీలు చేయడం ఇబ్బందికరంగా ఉంటుంది. సహాయకులకు ఇచ్చే ఆర్థిక సహాయం రీడర్ అలవెన్స్.

-రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇ- పాస్‌పోర్ట్‌తో ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ సులభతరం

యేచన్ చంద్రశేఖర్

భారత ఉపఖండంలో, ప్రయాణ పత్రాల ప్రస్తావన మౌర్యుల కాలంలో ఉన్నప్పటికీ అది నేటి విధానానికి భిన్నంగా ఉండేది. ఆ రోజుల్లో పాస్‌పోర్ట్‌ల స్థానంలో అధికారిక పత్రాలు, సురక్షిత ప్రవర్తన లేఖలు ఉపయోగించబడ్డాయి. మొదటి ప్రపంచ యుద్ధానంతరం బ్రిటిష్ ఇండియాలో పాస్‌పోర్ట్‌లను ప్రవేశపెట్టారు. 1920లో అమలులోకి వచ్చిన ఇండియన్ పాస్‌పోర్ట్ చట్టం, విదేశీయానం చేసే భారతీయులు భారతదేశం సందర్శించే విదేశీయులకు పాస్‌పోర్ట్‌లను తప్పనిసరి చేసింది. బ్రిటిష్ ఇండియన్ పాస్‌పోర్ట్ 1920 లీగ్ ఆఫ్‌నేషన్స్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ పాస్‌పోర్ట్స్ ఆమోదిత నమూనా ఆధారంగా రూపొందించబడింది. ప్రారంభంలో పాస్‌పోర్ట్‌లు బ్రిటిష్ సామ్రాజ్యం ఇతర నిర్దిష్ట ప్రాంతాలలో ప్రయాణించేలా పరిమిత వినియోగాన్ని కలిగి ఉండేవి. అప్పట్లో, పాస్‌పోర్ట్‌లు అక్షరాస్యత పరీక్ష ఆధారంగా గౌరవనీయమైన వ్యక్తులకు మాత్రమే మంజూరు చేయబడేవి. అంతేకాదు, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా సభ్యులకు పాస్‌పోర్ట్‌లు నిరాకరించబడేవి. భారత రాజ్యాంగం ప్రకారం పాస్‌పోర్ట్ జారీ కేంద్ర అంశం" అయినప్పటికీ, 1954 వరకు ఈ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించబడింది. మొదటి ఐదు ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాలు ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, నాగ్‌పూర్‌లలో స్థాపించబడ్డాయి. 1959లో సెంట్రల్ పాస్‌పోర్ట్ ఎమిగ్రేషన్ ఆర్గనైజేషన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధీన కార్యాలయంగా ఏర్పాటు కాగా, 1967లో పార్లమెంట్ పాస్‌పోర్ట్‌ల చట్టాన్ని అమలు చేసింది. భారతదేశంలో 2001లో యంత్రం చదవగలిగే (మెషిన్ రీడబుల్) పాస్‌పోర్ట్‌లనుప్రవేశపెట్టే వరకు కూడా చేతితో రాసిన పాస్‌పోర్ట్‌లు జారీ చేయబడేవి. భారతదేశంలో 37 ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాలు 93 పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలతోపాటు 424 పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలున్నాయి. ఇవి కాకుండా విదేశాలలో 197 భారతీయ మిషన్లు పోస్టుల నెట్‌వర్క్ ద్వారా భారతీయ పౌరులకు పాస్‌పోర్ట్‌లను జారీ చేయడానికి విదేశాంగ మంత్రిత్వశాఖ బాధ్యత వహిస్తుంది. భారతీయులకు అంతర్జాతీయ ప్రయాణానుభవాన్ని సులభతరం చేయడం, జాతీయ భద్రతను బలోపేతం చేయడంతోపాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం పాస్‌పోర్ట్ సేవా కార్యక్రమం వెర్షన్ 2.0లో భాగంగా ఏప్రిల్ 1, 2024న భారతదేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా ఈపాస్‌పోర్ట్‌ల జారీకి శ్రీకారం చుట్టింది. ఈపాస్‌పోర్ట్ కాగితం ఎలక్ట్రానిక్ పాస్‌పోర్ట్‌ల సమ్మిళితం. సాంప్రదాయ పాస్‌పోర్ట్‌లకు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడి) చిప్ యాంటెన్నా పొందుపరచడం ద్వారా ఈపాస్‌పోర్ట్ రూపొందించబడింది. ఇది పాస్‌పోర్ట్‌దారు వేలిముద్రలు, ముఖచిత్రాలు వంటి బయోమెట్రిక్ సమాచారం, ఇతర వ్యక్తిగత వివరాలను నిల్వచేసి, మెరుగైన భద్రత క్రమబద్ధమైన వలసలకు ఆస్కారం కల్పిస్తుంది. పబ్లిక్ కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (పికెఐ) ఈపాస్‌పోర్ట్‌లోని సున్నితమైన సమాచారాన్ని రక్షించడంలో సహాయపడుతుంది. ప్రామాణీకరణ కోసం ఈ పాస్‌పోర్ట్‌లలో పాస్‌పోర్ట్‌దారు సమాచారం భౌతిక రూపంలో బుక్‌లెట్‌పై ముద్రించబడడమే కాకుండా ఎలక్ట్రానిక్ చిప్‌లో డిజిటల్ రూపంలో కూడా అందుబాటు



లో ఉంటుంది. దీనివలన నకిలీ పాస్‌పోర్ట్‌ల బెడదతోపాటు పాస్‌పోర్ట్‌లోని వివరాలను మార్పులు చేర్పులు చేసే అవకాశం పూర్తిగా సమసిపోతుంది. ఈపాస్‌పోర్ట్‌ను ముఖచిత్రం కింద ముద్రించిన చిన్న, బంగారు రంగు చిహ్నం ద్వారా సులభంగా గుర్తించవచ్చు. మొట్టమొదటగా నాగ్‌పూర్, భువనేశ్వర్, జమ్మూ, గోవా, సిమ్లా, రాయ్‌పూర్, అమృత్‌సర్, జైపూర్, చెన్నై, హైదరాబాద్, సూరత్, రాంచీ వంటి ఎంపిక చేసిన నగరాల్లో ప్రారంభమైన ఈపాస్‌పోర్ట్ జారీ ప్రక్రియ దశలవారీగా దేశవ్యాప్తంగా అమలు చేయబడుతోంది. 2025 మధ్యనాటికి దేశవ్యాప్తంగా ఈపాస్‌పోర్ట్‌లను అమలు చేయాలని విదేశాంగ మంత్రిత్వశాఖ యోచిస్తోంది. ఇక మీదట పాస్‌పోర్ట్ కోసం కొత్తగా వచ్చే దరఖాస్తులతో వాటితో పాటు రెన్యువల్ కోసం వచ్చే వారికి ఈపాస్‌పోర్ట్‌లను మాత్రమే జారీ చేయాలనీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇపాస్‌పోర్ట్ లేదా ఎలక్ట్రానిక్ పాస్‌పోర్ట్‌లో ఆటోమేటెడ్ గుర్తింపు ధృవీకరణ సౌలభ్యం ఉండడంతో ఇమ్మిగ్రేషన్ తనిఖీ ప్రక్రియ వేగవంతంగా జరపడానికి అవకాశం ఏర్పడుతుంది. అంతేకాదు, వేలిముద్రలు ముఖ గుర్తింపు వంటి బయోమెట్రిక్ సమాచారంతో సహా వ్యక్తిగత వివరాలు కలిగి ఉండడంతో మోసపూరిత ప్రయత్నాలను అరికడుతుంది. ఎలక్ట్రానిక్ పాస్‌పోర్ట్‌లో చిప్ పాస్‌పోర్ట్ ప్రామాణీకరణను తారుమారు చేస్తే అది పూర్తిగా విఫలమవుతుంది. సాధారణ పాస్‌పోర్ట్ లాగా కాకుండా ఇపాస్‌పోర్ట్ గల ప్రయాణీకులను అత్యంత వేగవంతంగా కేవలం కొన్ని సెకన్లలో స్కాన్ చేసే వెసులుబాటు ఉండడంతో తక్కువ సమయంలో ఎక్కువ మంది ప్రయాణీకుల ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను చేపట్టవచ్చు. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసిఏఒ) ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించబడడం ఇపాస్‌పోర్ట్ అతి ముఖ్యమైన సానుకులాంశం. దరఖాస్తుదారులు పాస్‌పోర్ట్ సేవా వెబ్‌సైట్ ద్వారా ప్రస్తుత ఆన్‌లైన్ విధానాన్ని అనుసరించవచ్చు. దరఖాస్తుదారులు ఈపాస్‌పోర్ట్‌లు అందుబాటులో ఉన్న నగరంలో కొత్త పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్నా లేదా పాత పాస్‌పోర్ట్‌ను రెన్యువల్ చేసుకోవాలనుకున్నా, వారు అప్‌గ్రేడ్ చేసిన వెర్షన్‌ను అందుకుంటారు. దేశవ్యాప్తంగా ఈపాస్‌పోర్ట్‌ల జారీ కోసం మౌలిక సదుపాయాలను విస్తరించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. సాంప్రదాయ పాస్‌పోర్ట్‌లు వాటి గడువు తేదీ వరకు చెల్లుబాటులో ఉంటాయి కనుక ఇప్పటికే సాంప్రదాయ పాస్‌పోర్ట్ కలిగి కాలపరిమితి ఉన్న వారు వెంటనే ఈపాస్‌పోర్ట్‌కి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. అయితే, కొత్త దరఖాస్తుదారులు ఈపాస్‌పోర్ట్ అమలులో ఉన్న నగరాల్లో పునరుద్ధరణల కోసం దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తు ప్రక్రియలో భాగంగా ఈపాస్‌పోర్ట్‌లను పొందవచ్చు. పాస్‌పోర్ట్‌దారు గోప్యతను పెంచడానికి ఈపాస్‌పోర్ట్‌లలో ఇకపై పాస్‌పోర్ట్ చివరి పేజీలో నివాస చిరునామా ముద్రించబడదు కానీ చిరునామా సమాచారాన్ని డిజిటల్ రూపంలో (బార్‌కోడ్) నిల్వ చేయబడుతుంది. కేవలం అధీకృత వ్యక్తులు మాత్రమే ఈపాస్‌పోర్ట్‌లోని బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సమాచారాన్ని పొందగలుగుతారు. సాంప్రదాయ పాస్‌పోర్ట్‌లో ఉన్నట్లు ఈపాస్‌పోర్ట్‌లో తల్లిదండ్రులు లేదా చట్టపరమైన సంరక్షకుల పేర్లు ఇకపై చేర్చబడవు. భారతదేశం జారీ చేసే పాస్‌పోర్ట్‌లు ప్రధానంగా వాటి కవర్లరంగు ద్వారా వర్గీకరించబడతాయి. భారతదేశంలో అన్ని రకాల పాస్‌పోర్ట్‌లు 10సం।। కాలపరిమితితో జారీ చేయబడతాయి. 15 సం।। కంటే తక్కువవయస్సు ఉన్న మైనర్లకు జారీచేయబడే పాస్‌పోర్ట్‌లు 5 సం।। లేదా వారు 18సం।। నిండేవరకు మాత్రమే చెల్లుతాయి. 15-18సం।। మధ్య వయస్సు గలమైనర్లు, 10 సంవత్సరాలు లేదా 18సం।। నిండేవరకు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ●

# భారత్‌పై మరోసారి నోరుపారేసుకున్న పాకిస్థాన్

## ఆత్మాహుతి దాడికి భారతే కారణం: ఆర్మీ

**న్యూఢిల్లీ,జూన్ 29:** పాకిస్థాన్‌లోని వజీరిస్థాన్‌లో జరిగిన ఆత్మాహుతి కారు బాంబు దాడిపై దాయాది కారు కూతలు కూసింది. ఈ దాడికి ఘటనకు భారత్ కారణమంటూ ఆ దేశ ఆర్మీ నోరు పారేసుకుంది. అయితే ఈ ఆరోపణలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ ఆర్మీ చేసిన నిరాధారమైన ఆరోపణలు అని స్పష్టం చేసింది. వజీరిస్థాన్ దాడికి భారత్‌ను నిందించే పాకిస్థాన్ ఆర్మీ చేసిన ప్రకటనను మేం గమనించాం. అలాంటి నిరాధారమైన ఆరోపణలను మేం తీవ్రంగా ఖండిస్తున్నామని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ ఆత్మాహుతి దాడిలో మొత్తం 16 మంది పాకిస్థాన్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. పేలుడు పదార్థాలున్న వాహనంతో ఉగ్రవాది ఉదయం సైనిక కాన్వాయ్ పైకి దూసుకెళ్లడం వల్ల భారీ పేలుడు సంంభవించింది. ఈ ఘటనలో 13మందిసైనికులు అక్కడికక్కడే మరణించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా




చికిత్స పొందుతూ, మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిలో పౌరులు, ప్రభుత్వ అధికారులు సహా 24 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు తీవ్రతకు పక్కనే ఉన్న రెండు ఇళ్ల పైకప్పులు కూలిపోవడంతో ఆరుగురు పిల్లలు గాయపడినట్లు అధికారులు పేర్కొన్నారు. దాడిలో దాదాపు 800 కిలోల పేలుడు పదార్థాలు ఉపయోగించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. ఈ పేలుడు సైనిక కాన్వాయ్ లక్ష్యంగా జరగడం గమనార్హం. దాడి సమయంలో ఆ ప్రాంతంలో కర్ఫ్యూ అమలులో ఉన్నప్పటికీ ఈ ఘటన జరిగింది. మరోవైపు పాకిస్థాన్‌లోని తాలిబన్ హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూపునకు చెందిన ఉసూద్‌అల్‌హర్బ్ ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది. ఇది తహ్రీక్‌ఎ తాలిబాన్ పాకిస్థాన్‌లో ఒక విభాగం. ఈ గ్రూపు ఇప్పటికే పలు మార్లు పాకిస్థాన్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. టీటీపీ అనేది పలు ఇస్లామిక్ మిలిటెంట్ గ్రూపుల సమాహారం. పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కూలదోసి, తాము నమ్మే శరియత్ పాలనను స్థాపించడమే టీటీపీ లక్ష్యం. గతంలో పలు ప్రాణాంతక దాడులకు ఈ గ్రూపు బాధ్యత వహించింది. వజీరిస్థాన్ ప్రాంతమైన ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో పలు నిషేధిత ఉగ్రవాద గ్రూపులు పనిచేస్తున్నాయి. ఈ గ్రూపులకు అఫ్గానిస్తాన్ ఆశ్రయం కల్పిస్తోందని పాక్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. అయితే కాబూల్ మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తోంది. ఇది 2019లో భారత్‌లో జరిగిన పుల్వామా దాడి మాదిరిగానే ఉంది. జైష్ మహ్మద్‌కు చెందిన ఆత్మాహుతి దాడిలో 40 మంది భారత జవాన్లు వీరమరణం పొందారు. ఇప్పుడు అదే పాకిస్థాన్ తమ స్వదేశంలో ఆ విధానంలోనే దాడికి గురైంది. దాదాపు అదే పద్ధతిలో పాకిస్థాన్ సైన్యంపై దాడి జరగడం గమనార్హం. మరోవైపు భారత్ అకారణంగా రెండు సార్లు పాకిస్థాన్‌పై దాడికి పాల్పడిందని ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిం మునీర్ నోరుపారేసుకున్నారు. న్యూఢిల్లీకి వ్యూహాత్మక ముందుచూపు కొరవడిందన్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. మళ్లీ తమపై దాడికి పాల్పడితే నిర్ణయాత్మకంగా ప్రతిస్పందిస్తామని మునీర్ హెచ్చరించారు. కరాచీలోని నేవల్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మునీర్, ప్రాంతీయ స్థిరత్వాన్ని పాకిస్థాన్ కాపడుతోందన్నారు. భారత్ దుందుడుకు తనానికి పాల్పడితే తమ దేశం ప్రాంతీయశాంతిని దృష్టిలో పెట్టుకొని పరిపక్వంగా వ్యవహరించిందన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేసే స్థితిలో పాక్ ఉంటే భారత్ ఉద్రిక్తతలు సృష్టిస్తోందని వ్యాఖ్యానించారు. అంతకుముందు మునీర్ ఇలాంటి నిరాధార వ్యాఖ్యలే చేశారు. ఆర్మీ ఆఫీసర్స్ కామన్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న ఆయన, భారత్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందని వింత వ్యాఖ్యలు చేశారు. న్యూఢిల్లీ నెట్‌వర్క్‌కు అఫ్గానిస్థాన్ వేదికగా మారిందనీ, అఫ్గాన్ వాసులతో కలిసి పాక్‌లో దాడులు చేస్తోందని ఆరోపించారు. భారత్ పోషిస్తున్న ఉగ్రవాదులకు అఫ్గానిస్థాన్ వేదిక ఇవ్వకూడదని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## హమాస్‌తో ఒప్పందం చేసుకోండి

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 29:** గాజాలో జరుగుతున్న యుద్ధాన్ని వేగంగా ముగించి.. సంధి కుదుర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు పెట్టారు. 'గాజాలో ఒప్పందం చేసుకోండి. బందీలను వెనక్కి తీసుకురండి' అని పేర్కొన్నారు. ఆయన గతంలో ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఆమోదించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై ఒత్తిడి తెచ్చినట్లయింది. గాజాలో వచ్చే వారం సంధి కుదురుతుందని ప్రకటించిన కొన్ని గంటల్లోనే మరోసారి సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం గమనార్హం. నెతన్యాహుపై కేసులను వదిలేయాలని ఇజ్రాయెల్ ప్రాసిక్యూటర్లను అభ్యర్థించిన కొన్ని గంటల్లోనే ఈ పోస్టు పెట్టడం విశేషం. ఇజ్రాయెల్ ప్రధాని ప్రస్తుతం హమాస్‌తో చర్చలు జరుపుతున్నారని.. ఆ ఒప్పందం కుదిరితే బందీలు వెనక్కి వస్తారని ట్రంప్ పేర్కొన్నారు. గత బుధవారం ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ ఇజ్రాయెల్ ప్రధానిపై కేసులు కేవలం వేధింపులు అనే అర్థం వచ్చేట్లు పోస్టు పెట్టారు. ఇరాన్‌పై యుద్ధ సమయంలో అమెరికా అధ్యక్షుడి మద్దతుకు నెతన్యాహు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల కాలంలో ఇజ్రాయెల్‌కు సహాయాన్ని కూడా అగ్రరాజ్యం గణనీయంగా పెంచింది. వాషింగ్టన్ నుంచి ప్రపంచంలో మరే దేశానికి అంత స్థాయిలో ఆర్థిక సాయం అందలేదు. అక్టోబరు 7వతేదీ హమాస్ ఇజ్రా యెల్‌పై దాడి చేసివందల మందిని హత్య చేసింది. 251 మందిని బందీలుగా పట్టుకు పోయింది. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోగా 49 మంది ఇప్పటికీ హమాస్ చెరలోనే ఉన్నట్లు భావిస్తున్నారు.

## హమాస్ సహ వ్యవస్థాపకుడు మఖమ్ మహ్మద్ ఇస్సా అల్ ఇస్సా హతం



**జెరూసలెం,జూన్ 29:** హమాస్, హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూపులపై వరుసబెట్టి దాడులు సాగిస్తూ వస్తోన్న ఇజ్రాయెల్ మరో పురోగతిని సాధించింది. హమాస్ సహ వ్యవస్థాపకుడు మఖమ్ మహ్మద్ ఇస్సా అల్ ఇస్సాను మట్టుబెట్టింది. గాజాపై నిర్వహించిన వైమానిక దాడుల్లో ఆయన మరణించినట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ అధికారికంగా ప్రకటించింది. హమాస్ శిబిరాలపై నిర్వహించిన మిస్సైళ్ల దాడుల సందర్భంగా మహ్మద్ హతమైనట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో హతమైంది మఖమ్ మహ్మదేనని నిర్ధారించుకున్నట్లు వివవరించింది. గాజా శివార్లలోని సబ్రాలో గల హమాస్ స్థావరాలపై వైమానిక దాడులను నిర్వహించింది ఇజ్రాయెల్. ఐడీఎఫ్ ఇజ్రాయెల్ సెక్యూరిటీ ఏజెన్సీ సంయుక్తంగా వీటిని చేపట్టాయి. హమాస్ స్థావరాలపై బాంబుల వర్షాన్ని కురిపించాయి. ఈ సందర్భంగా మిలిటెంట్ గ్రూప్ హమాస్ సహ వ్యవస్థాపకుడు మఖమ్ మహ్మద్ మరణించాడు. 2023 అక్టోబర్ 7వ తేదీన తమ దేశంపై హమాస్ నిర్వహించిన భయానక దాడులకు అతనే ప్రధాన సూత్రధారిని ఇజ్రాయెల్ ప్రకటించింది. అప్పటిదాడుల్లో 1,200 మందికి పైగా ఇజ్రాయెల్ పౌరులు మరణించారు. 250 మంది సరిహద్దు ప్రాంతాల ప్రజలను హమాస్ మిలిటెంట్లు కిడ్నాప్ చేశారు. ఇప్పటికీ 50 మందికి పైగా ఇజ్రాయెలీలు వారి చెరలో బందీలుగా ఉన్నారు. బందీల్లో 28 మంది మరణించి ఉండొచ్చని భావిస్తున్నారు. అలాంటి దాడికి మాస్టర్ మైండ్ మహ్మద్ ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. మహ్మద్‌ను హమాస్ లో మిగిలి ఉన్న సీనియర్ మోస్ట్ లీడర్లల్లో ఒకడిగా పరిగణిస్తోంది ఏడాదిన్నర కాలంలో గాజాపై సాగించిన దాడుల్లో హమాస్ కు చెందిన పలువురు సీనియర్ నాయకులను మట్టుబెట్టింది ఇజ్రాయెల్. యాహ్యా సిన్వర్, ఆయన తమ్ముడు మహ్మద్ సిన్వర్, హసన్ నస్రల్లా, ఇస్మాయిల్ హనియె, సమీ తాలెబ్ అబ్దల్లా, ఫతా షరీఫ్, మర్వాన్ ఇసా, ఇబ్రహిం వకీల్, అహ్మద్ వహ్బా.. వంటి సీనియర్ నాయకులు, కమాండర్లు హతం అయ్యారు. హాషెమ్ షఫియొద్దీన్, హుస్సేన్ అలీ హాజీమాను మట్టుపెట్టింది ఇజ్రాయెల్.


## కుట్రకోణంలో కూడా దర్యాప్తు జరుగుతోంది

### కేంద్ర విమానయానశాఖ సహాయ మంత్రి మురళీధరన్

**పూణె,జూన్ 29:** అహ్మదాబాద్ లో ఎయిర్‌ఇండియా దుర్ఘటనలో కుట్రకోణంనుంచి కూడా దర్యాప్తుచేస్తున్నట్లు కేంద్ర మంత్రి మురళీధరన్ చెప్పారు. ఈ ఉదంతంలో కుట్ర కోణంపై కూడా దృష్టి సారించినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తును ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) చేపట్టిందని, అన్ని కోణాల్లోనూ విచారణ జరుపుతోందని ఆయన స్పష్టం చేశారు. పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. విమానం నుంచి స్వాధీనం చేసుకున్న బ్లాక్‌బాక్స్‌ను విశ్లేషణ కోసం విదేశాలకు పంపుతున్నారంటూ వస్తున్న ఊహాగానాలను మంత్రి మురళీధర్ పూర్తిగా ఖండించారు. "బ్లాక్‌బాక్స్ మన దేశంలోనే, దర్యాప్తు సంస్థల వద్దే సురక్షితంగా ఉంది. దానిని ఎక్కడికీ పంపే ప్రసక్తే లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. ఇది చాలా విషాదకరమైన ఘటన అని, ఏఏఐబీ దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించిందని తెలిపారు. సీసీటీవీ ఫుటేజీని విశ్లేషించడంతో పాటు పలు ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. రెండు ఇంజిన్లు ఒకేసారి విఫలం కావడం అనేది అత్యంత అరుదైన విషయమని మంత్రి పేర్కొన్నారు. "ఇది చాలా ప్రత్యేకమైన కేసు. అసలు రెండు ఇంజిన్లు విఫలమయ్యాయా లేక ఇంధన సరఫరాలో ఏమైనా సమస్య తలెత్తిందా అనేది దర్యాప్తు నివేదికతోనే స్పష్టత వస్తుందని అన్నారు. బ్లాక్‌బాక్స్‌లోని కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో పైలట్ల సంభాషణలు నిక్షిప్తమై ఉంటాయని, దర్యాప్తులో అది కీలకం కానుందని తెలిపారు. మరో మూడు నెలల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని, కాబట్టి ఇప్పుడే దీనిపై ఏమీ మాట్లాడటం తొందరపాటు అవుతుందని మురళీధర్ అభిప్రాయపడ్డారు.

# ఉగ్రవాదం మా చట్టబద్ధమైన పోరాటం

### పాక్ మిలిటరీ-చీఫ్ ఆసిమ్ మునీర్



**కరాచి,జూన్ 29:** టెర్రరిజంను చట్టబద్ధమైన పోరాటంగా పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అభివర్ణించారు. పాకిస్థాన్ పై భారత్ దాడులకు పాల్పడుతోందని మరోసారి నోరు పారేసుకున్నారు. ఇలానే కొనసాగితే భారత్ ను విడిచిపెట్టేది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు. భారత్ ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందని, పాకిస్థాన్ మాత్రం ప్రాంతీయ స్థిరత్వాన్ని కాపాడుతోందని విమర్శలు చేశారు. అంతేకాక భారత్ చేతిలో హతం అయిన టెర్రరిస్టులను అమరవీరులుగా అభివర్ణించారు మునీర్. ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పెంచి పోషిస్తుందన్న పచ్చి నిజం మరోసారి బట్టబయలు అయింది. కరాచీలోని నేవల్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఉగ్రవాదంపై కీలక వ్యాఖ్యలు చేశారు. టెర్రరిజంను చట్టబద్ధమైన పోరాటంగా అభివర్ణించారు. భారత్ చేతిలో హతం అయిన టెర్రరిస్టులను అమరవీరులుగా అభివర్ణించారు మునీర్. ఆయన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈనెల 28 వతేదీ వజీరిస్థాన్‌లో జరిగిన ఆత్మాహుతి దాడి వెనక భారత్ హస్తం ఉందని అసిమ్ మునీర్ నోరు పారేసుకున్నారు. భారత్ ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొడుతుందని పాకిస్థాన్ మాత్రం ప్రాంతీయ స్థిరత్వాన్ని కాపాడుతోందని నోటికొచ్చింది మాట్లాడారు. అయితే పాకిస్థాన్ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అవన్నీ తప్పుడు, నిరాధారమైన ఆరోపణలని తేల్చేసింది. ఎలాంటి హెచ్చరికలు చేయకుండానే నాలుగు సార్లు భారత్ దాడులకు పాల్పడిందని పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ కనుక మరోసారి పాక్‌పై దాడి చేస్తే తమ ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని వివరించారు. భారత్ ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందన్నారు. అయితే పాకిస్థాన్ మాత్రం ప్రాంతీయ స్థిరత్వాన్ని కాపాడుతోందని అన్నారు. వజీరిస్థాన్‌లో జరిగిన ఆత్మాహుతి దాడికి భారత్ కారణం అంటూ అసిమ్ మునీర్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ సూసైడ్ ఎటాక్ వెనుక భారత్ హస్తం ఉందన్నారు. అయితే మునీర్ ఆరోపణలను భారత్ తిప్పికొట్టింది. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పాకిస్థాన్ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈనెల 28న దాదాపు 800 కిలోలు ఉన్న భారీ పేలుడు పదార్థాలతో ఓ వాహనం వజీరిస్థాన్ లోని ఓఉగ్రవాది సైనిక కాన్వాయ్‌ను ఢీ కొట్టింది. ఈ దాడిలో 13 మంది పాక్ సైనికులు మృతి చెందారు. మరో 24 మందికి తీవ్రగాయాలయ్యాయి.

## పూరీ రథయాత్ర దుర్ఘటన.. సర్కారుపై మాజీ సిఎం విమర్శలు



**భువనేశ్వర్, జూన్, 29:** పూరీలో జరిగిన జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర బిజెపి ప్రభుత్వంపై ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ దుర్ఘటనలో ముగ్గురు భక్తులు మరణించగా, 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటన గుండిచా ఆలయం సమీపంలో జరిగింది. ఇది ప్రధాన జగన్నాథ ఆలయం నుంచి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఘటనపై బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం, నవీన్ పట్నాయక్ బిజెడి పార్టీ మధ్య ప్రస్తుతం వాడీవేడీ చర్చ కొనసాగుతోంది.

**పట్నాయక్ ఏమన్నారంటే..** ఈ సందర్భంగా నవీన్ పట్నాయక్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేసి స్పందించారు. ఈ ఘటనను ప్రభుత్వ అసమర్థతగా అభివర్ణించారు. రథయాత్రలో జన సమూహం నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ దుర్ఘటన భక్తులకు శాంతియుత పండుగను అందించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టం చేస్తుందన్నారు. రథయాత్ర రోజు నందీఘోష రథాన్ని లాగడంలో జాప్యం జరిగిందని, దీనిని ప్రభుత్వం మహాప్రభు ఇచ్ఛ అని సమర్థించుకుందని నవీన్ పట్నాయక్ ఆరోపించారు. ఈజాప్యం ప్రభుత్వం బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తుం దన్నారు.

**సిబ్బంది కూడా లేరని..** దీంతోపాటు ఈ ఘటన సమయంలో భారీ జన సమూహాన్ని నియంత్రించడానికి ప్రభుత్వ సిబ్బంది కూడా అక్కడ లేరని ఆయన విమర్శించారు. దీంతోపాటు రథయాత్రలో భాగంగా కీలక ఆచారాలైన అడప బిజె, బహుదా, సునాబేషా వంటివి సజావుగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో మరణించిన భక్తుల కుటుంబాలకు నవీన్‌పట్నాయక్ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

**బిజెపి స్పందన..** ఒడిశా న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, నవీన్ పట్నాయక్ పేరును ప్రస్తావించకుండా, బిజెడి పార్టీపై ప్రతివిమర్శలు చేశారు. గతంలో బిజెడి ప్రభుత్వం రథయాత్ర నిర్వహణలో తప్పిదాలు చేసిందన్నారు. జగన్నాథస్వామిని అవమానించిందని ఆయన ఆరోపించారు. 1977 నుంచి రథాలు ఎల్లప్పుడూ రెండో రోజున గుండిచా ఆలయానికి చేరుకుంటాయని హరిచందన్ అన్నారు. బిజెడి పచ్చకామెర్లతో రాజకీయ వ్యాఖ్యలు చేస్తోందన్నారు. పండుగ సమయంలో రాజకీయాలు చేసవారు ఈరోజు కాకపోతే రేపు ఫలితాలను ఎదుర్కొంటారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపిస్తామని హరిచందన్ హామీ ఇచ్చారు.

## సిబిడిటి ఛైర్మన్‌గా రవిఅగర్వాల్ పునర్నియామకం



**న్యూఢిల్లీ,జూన్ 29:** కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను శాఖ పరిధిలోని కేంద్ర ప్రత్యక్షపన్నుల బోర్డు ఛైర్మన్‌గా ఇప్పటివరకూ కొనసాగుతున్న ఛైర్మన్ రవి అగర్వాల్‌నే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆదాయపు పన్ను విభాగంలో సిబిడిటి అత్యున్నత స్థాయి నిర్ణయాత్మక సంస్థగా కొనసాగుతోంది. కేబినెట్ నియామకాల కమిటీ కూడా రవి అగర్వాల్ నియామకాన్ని ధృవీకరించింది. ఏడాదికాలం పాటు ఆయన పదవిలో ఉంటారు. 2026 జూన్30 వరకూ కొనసాగుతారని ఉత్తర్వుల్లో వెల్లడించారు.

# ఎమర్జెన్సీ విధించినవారు ఓడిపోయారు..

### భద్రాద్రి మహిళల మిల్లెట్ మ్యాజిక్ బిస్కెట్లపై ప్రశంసలు

### ప్రపంచవ్యాప్తంగా యోగాడే అభ్యాసాలు సంతోషకరం

### భారత్‌కు ట్రకోమా నుంచి విముక్తి

### మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ, జూన్ 29:** దేశంలో ఎమర్జెన్సీ విధించిన వారు రాజ్యాంగాన్ని హత్య చేసి, న్యాయ విభాగాన్ని బానిసగా మార్చుకోవాలనుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. నాడు జార్జిఫెర్నాండెజ్‌ను సంకెళ్లతో బంధించారని గుర్తు చేశారు. కానీ, భారత ప్రజలు శక్తిమంతమైన వారు కావడంతో ఎమర్జెన్సీ తొలగిపోయిందని, అత్యయిక స్థితి విధించినవారు ఓడిపోయారని గుర్తు చేశారు. దేశంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తవడాన్ని మన్‌కీబాత్‌లో ప్రస్తావించిన ప్రధాని, ఎమర్జెన్సీపై పోరాడిన మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్ రామ్ వంటి నేతల ప్రసంగాలను మోదీ ప్రస్తావించారు. ఎమర్జెన్సీపై పోరాడిన వారిని కచ్చితంగా స్మరించుకోవాలనీ అది రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మనల్ని ప్రేరేపిస్తుందన్నారు. భారత జనాభాలో 64 శాతం కన్నా ఎక్కువ మంది దాదాపు 95 కోట్లమంది ఏదో ఒక సామాజిక రక్షణ పథకంతో లబ్ధి పొందుతున్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ తెలిపిందని ప్రధాని నరేంద్రమోదీ వివరించారు. 2015లో సామాజిక రక్షణ ఫలాలు కేవలం 25 కోట్ల మందికి అందేవని , శాశ్వత అంధత్వానికి దారితీసే ట్రాకోమా వ్యాధి నుంచి భారత్ పూర్తిగా విముక్తి పొందినట్లు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ డబ్ల్యుహెచ్‌ఒ నిర్ధారించిందని 123వ మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో మోదీ తెలిపారు. ఇటీవలి అంతర్జాతీయ యోగా డేను యావత్ ప్రపంచం జరుపుకుందనీ, అందరి జీవితాల్లో యోగా భాగమవుతోందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. 21న జరిగిన యోగా డే కార్యక్రమాల్లో దేశ, ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది పాల్గొన్నారని గుర్తు చేశారు. దాదాపు 10 ఏళ్ల క్రితం మొదలైన ఈ కార్యక్రమం ఏటేటా మరింత విస్తరిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. చాలాకాలం తర్వాత అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైందన్న మోదీ, యాత్రికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భద్రాచలం ప్రాంతంలో మహిళలు మిల్లెట్లతో బిస్కెట్లు తయారు చేస్తున్నారనీ అవి లండన్‌కు కూడా ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. ఆదివాసి మహిళలు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరిట బిస్కెట్లు తయారు చేస్తు వాటిని హైదరాబాద్ నుంచి లండన్‌కు కూడా ఎగుమతి చేస్తున్నారని ప్రధాని వెల్లడించారు. వాళ్లే పర్యావరణహితమైన గిరి శానిటరీ ప్యాడ్స్‌ను ఉత్పత్తి చేస్తున్నారనీ, 3నెలల్లోనే 40వేల ప్యాడ్స్‌ను తయారుచేశారని మోదీ ప్రశంసించారు. ఫుట్‌బాల్ ఆటగాళ్లకు కేంద్రంగా బోడోల్యాండ్ మారిందని ప్రధాని మోదీ అభినందించారు. పరిమిత వనరులతోనే సాధన చేసి అద్భుతంగా రాణిస్తున్నారని, దేశంలోని చిన్నారులకు వీరు ఆదర్శంగా మారారని కొనియాడారు. ఫిట్‌నెస్, ఊబకాయం తగ్గించుకోవడానికి ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాలని సలహా ఇచ్చారు. మేఘాలయ ఎరీసిల్క్‌కు జీఐ ట్యాగ్ లభించిందని ప్రశంసించారు. పురుగులను చంపకుండా వస్త్రాన్ని తయారు చేయడం దీని ప్రత్యేకతని తెలిపారు.

## హెచ్1బి వీసాల్లో బ్యాంకింగ్, బీమా కంపెనీల్లోనే ప్లేస్‌మెంట్లు ఎక్కువ!

**వాషింగ్టన్,జూన్ 29:** హెచ్ 1బీ వీసాల జారీ అనగానే అమెరికన్ టెక్ కంపెనీలే గుర్తుకొ స్తాయి. ఎందుకంటే ఆ వీసాల ద్వారా ఏటా భారీగా రిక్రూట్‌మెంట్‌లు చేసుకునేది సిలికాన్ వ్యాలీ దిగ్గజ సంస్థలే. 2020 మే నుంచి 2024 మే మధ్యకాలంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది.



హెచ్ 1బీ వీసా ఉద్యోగుల భర్తీలో బ్యాంకింగ్, టెలికాం రంగ సంస్థల్లోనే ఎక్కువ ప్లేస్‌మెంట్‌జరిగింది. సిటీ గ్రూప్, క్యాపిటల్ వన్, ఏటీ అండ్ టీ, వాల్‌మార్ట్, యూఎస్‌ఏఏ, వెరిజాన్ లాంటి కంపెనీలు హెచ్1బీ వీసాలతో దూకుడుగా నిపుణులను భర్తీ చేసుకున్నాయి. దీంతో ఉద్యోగాల భర్తీలో సిలికాన్ వ్యాలీలోని దిగ్గజ టెక్ కంపెనీలు వెనుకంజలో ఉండిపోయాయి. అసలు హెచ్1బీ వీసా వ్యవస్థను అమెరికా ప్రభుత్వం అందు బాటులోకి తెచ్చిందే టెక్ దిగ్గజ కంపెనీల కోసం. భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా సహా వివిధ దేశాల్లోని టెక్ నిపుణులకు అమెరికా కంపెనీలు రెడ్ కార్పెట్ పరిచేందుకు ఊతమివ్వ డమే ఈ వీసా వ్యవస్థ లక్ష్యం. ఈ వీసాలను వినియోగించుకునే విషయంలో టెక్ కంపెనీలను టెలికాం, బ్యాంకింగ్ కంపెనీలు దాటేశాయి. 2020 మే నుంచి 2024 మే మధ్యకాలంలో బ్యాంకింగ్ సేవల సంస్థ సిటీ గ్రూప్ 3వేల మందికిపైగా హెచ్1బీ వర్కర్లను రిక్రూట్ చేసుకుంది.

## ఆస్కార్ కమిటీలో కమల్, ఖురానా: మొత్తం 19 విభాగాల్లో 11,120 మంది సభ్యులు



**లాస్‌ఏంజెల్స్,జూన్ 29:** ఆస్కార్ అవార్డుల కమిటీలో భారతీయ నటులకు సభ్యత్వం లభించింది. బహుభాషా నటుడు, నిర్మాత కమల్‌హాసన్‌తోపాటు, బాలివుడ్‌నటుడు ఆయుష్మాన్ ఖురానాలను ఈసారి ఆస్కార్‌పరిధిలోని అకాడమీ ఆఫ్‌మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విభాగం కమిటీలోకి ఆహ్వానించింది. ఈ కమిటీలో ప్రముఖ హాలివుడ్ బాలివుడ్‌నటుల తోపాటు టెక్నీషియన్లు, వివిధ విభాగాల్లో అత్యున్నతస్తాయి ప్రమాణాలు పాటించిన ప్రముఖులను ఆస్కార్ నామినేట్‌చేస్తుంది. ఈవిభాగంలో ఇప్పటివరకూ 534 మంది సభ్యులుగా ఉన్నారు. వీరితోపాటే ఆరియానా గ్రాండే, సెబాస్టియన్‌స్టాన్, జెరెమీ స్ట్రాంగ్ వంటివారిని కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఆస్కార్ అకాడమీ ఆహ్వానించింది. ఇప్పటికే ఆస్కార్‌లోని వివిధ విభాగాల్లో భారత్‌నుంచి డైరెక్టర్ కరన్ మాల్లీ, సినిమాటోగ్రాఫర్ రణ్‌బీర్ దాస్, కాస్ట్యూమ్ డిజైనర్ మాగ్జిమా బసు, డాక్యుమెంటరీ నిర్మాత స్మృతి ముంద్రా, నిర్మాత పాయల్‌కపాడియాలు కూడా ఉన్నారు. ఆస్కార్‌కు నామినేట్ అయిన అన్ని చిత్రాలను వీక్షించి వారు వోటింగ్ ఇస్తారు. వీరితోపాటే హాలివుడ్‌నుంచి డేవ్ బాటిస్టా, జాసన్ మమోవా, ఆబ్రే ప్లాజా, డేనియల్లీ డెడ్‌వైలర్, ఆండ్రూ స్కాట్‌తదితరులున్నారు. గిలియన్ ఆండర్సన్‌న నావోమి ఆకీ, మోనికా బార్బరో, ఓడీ కామర్ వంటి వారు కూడా సభ్యులుగా ఉన్నారు. ఆస్కార్ విన్నర్ మైకీ మ్యాడిసన్, ఆడ్రియానా పాజ్, సెబాస్టియన్ స్టాన్‌లు కూడా ఆస్కార్ ఆకాడమిలో సభ్యులే. కొత్తగా నామినేట్ అయినవారితో కలిపి ఇపుడున్న ఆస్కార్ కమిటీల సభ్యత్వాలు 10,143 నుంచి 11,120కి పెరిగింది. మొత్తం 19 విభాగాల్లో వీరంతా కొనసాగుతారు.



## ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద గగనతల దాడి

### 477 డ్రోన్లు, 60 క్షిపణులు ప్రయోగించిన రష్యా

**కీవ్, జూన్ 29:** యుద్ధం మొదలైన నాటి నుంచి అతి పెద్ద గగనతల దాడి ఉక్రెయిన్‌పై శనివారం రాత్రి జరిగింది. రష్యా మొత్తం 537 ఆయుధాలను ప్రయోగించింది. వీటిల్లో 477 డ్రోన్లు, 60 క్షిపణులు ఉన్నాయని ఉక్రెయిన్ వాయుసేన వెల్లడించింది. వీటిల్లో 249ని కూల్చేశామని.. మరో 226 ఎలక్ట్రానిక్ జామింగ్ వ్యవస్థల ప్రభావంతో కూలిపోయాయని తెలిపింది. ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ కమ్యూనికేషన్ కమాండర్ యూరీ ఇహ్‌నాట్ మాట్లాడుతూ గత రాత్రి అతిపెద్ద దాడి జరిగిందని వెల్లడించారు. ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని రష్యా ఆయుధాలను ప్రయోగించినట్లు చెప్పారు. పోలాండ్ గగనతల రక్షణ కోసం మిత్రదేశాల యుద్ధ విమానాలు రంగంలోకి దిగినట్లు పేర్కొన్నారు. ఖెర్సాన్ ప్రావిన్స్‌లో జరిగిన దాడుల్లో ఒకరు మరణించినట్లు అక్కడి గవర్నర్ వెల్లడించారు. ఈదాడిలో ఉక్రెయిన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానం కూలిపోయి అందులోని పైలట్ ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి మిలిటరీతెలిపింది. ఇప్పటివరకూ ఈ యుద్ధంలో మూడు ఎఫ్-16లను రష్యా కూల్చివేసింది.

ఇక ఉక్రెయిన్ తీరప్రాంత నగరమైన ఒడెసాలోని ఓ అపార్ట్‌మెంట్‌పై రష్యా శుక్రవారం రాత్రి చేసిన డ్రోన్ దాడిలో భార్యాభర్తలు మరణించారు. ఈ దాడిలో 17 మంది తీవ్రంగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. అపార్ట్‌మెంట్‌లోని మూడు అంతస్తులు దెబ్బతిన్నాయి. మరోవైపు పశ్చిమ రష్యా, క్రిమియాపై ఉక్రెయిన్ ప్రయోగించిన 40 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది.

రష్యాలో వేర్పాటువాదాన్ని పశ్చిమ దేశాలు ప్రోత్సహిస్తున్నాయని, ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధంలో జోక్యం చేసుకుంటున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు. బెలారస్ రాజధాని మిన్స్క్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 'రష్యాకు వ్యతిరేకంగా ఇస్లామిక్ స్టేట్ పనిచేస్తున్నంత కాలం ఎవరూ దానిపై దృష్టి సారించరు. మాస్కోలో పేలుళ్లు నేటికీ జరుగుతున్నాయి. మా దేశంలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించి, మాపై పోరాటానికి ఉగ్రవాదాన్ని సాధనంగా ఎంచుకున్న పశ్చిమ దేశాల విషయంలో కూడ ఇదే జరిగింది. నాటో విస్తరణ, ఉక్రెయిన్‌తో వివాదాన్ని పరిష్కరించడం వంటి వాగ్దానాలు ఇచ్చి వాటిని నిలబెట్టుకోకుండా పశ్చిమ దేశాలు రష్యాను పదేపదే మోసం చేస్తున్నాయి' అని పుతిన్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

## ఉత్తరకాశీలో వరదల బీభత్సం

### కుప్పకూలిన టూరిస్టు హోటల్, ఇద్దరు మృతి, మరో ఏడుగురు గల్లంతు

### చార్‌ధామ్ యాత్ర 24 గంటలపాటునిలిపివేత



**డెహ్రాడూన్,జూన్ 29:** ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీ జిల్లాలో సంభవించిన అకస్మిక వరదల కారణంగా ఓ హోటల్ కుప్పకూలింది. దీంతో అక్కడే పనిచేస్తున్న 9మంది కార్మికులు గల్లంతయ్యారు. వారిలో ఇద్దరి మృతదేహాలు వెలికితీయగా, మరో ఏడుగురి కోసం ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు భారీ వర్షాలు కారణంగా చార్ ధామ్ యాత్రను 24 గంటల పాటు నిలిపివేశారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, శనివారం బార్‌కోట్‌యమునోత్రి మార్గంలోని సిలాయ్ బాండ్‌లో భారీ వర్షాలు కురిశాయి. ఆకస్మిక వరదలు కూడా సంభవించాయి. దీంతో నిర్మాణంలో ఉన్న ఓ హోటల్ ధ్వంసం కావడం వల్ల అక్కడే పనిచేస్తున్న 9మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వారిలో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ఉన్నాయి. గల్లంతైన కార్మికులు నేపాల్ పౌరులుగా గుర్తించారు. ప్రమాద సమయంలో కార్మికులు గుడారాల్లో ఉన్నారని అధికారులు తెలిపారు. హోటల్ నిర్మాణం కోసం వచ్చిన కార్మికులకు యజమాని సమీపంలోనే క్యాంపును ఏర్పాటు చేశారని వెల్లడించారు. డెహ్రాడూన్, తెహ్రీ, పౌరి, హరిద్వార్, చంపావత్, నైనిటాల్, ఉధమ్ సింగ్ నగర్‌లోని కొన్ని ప్రదేశాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనావేసింది. చమోలి, పౌరి, డెహ్రాడూన్, రుద్రప్రయాగ్, ఇతర జిల్లాలతో సహా అనేక జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. నదులు ప్రమాదకరంగా ఒడ్డున ఉప్పొంగుతున్నది. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన కార్మికుల కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, సంబంధిత అధికారులతో తాను నిరంతరం సంప్రదిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



## బేగంపేట ఎయిర్‌పోర్టులో అమిత్‌షాకు బిజెపి నేతల ఘన స్వాగతం

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్ర పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాకు బేగంపేట విమానాశ్రయంలో బిజెపి నేతలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, డికె అరుణ, రాజా సింగ్‌తోపాటు పలువురు నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనం తరం కిషన్‌రెడ్డితో కలిసి హెలికాప్టర్‌లో నిజామాబాద్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డును జాతికి అంకితం చేసి, అనంతరం కంఠేశ్వర్ బైపాస్‌కు చేరుకుని మాజీమంత్రి డి శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

## ఉద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్న ప్రతిపక్షం

### సొంత రాష్ట్రాన్ని శత్రుదేశంగా పరిగణిస్తూ నష్టపరుస్తున్న బిఆర్ఎస్: మంత్రి పొన్నం

**హైదరాబాద్, జూన్ 29,ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల,ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేస్తూ ప్రజల అభివృద్ధి సంక్షేమాన్ని ముందుకు తీసుకుపోతుంటే ప్రతిపక్షం ఉద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు చేశారు.గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ గత పదేళ్ళ బిఆర్ఎస్ నిరంకుశ ప్రభుత్వానికి చరమ గీతం పాడి ప్రజల ఆశీస్సులతో తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే ఈ ప్రభుత్వం పడి పోతుం దని శాపనార్థాలు పెడుతూ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర ప్రతిపక్ష నేతలు చేశారని విమర్శించారు. ఎన్‌జివోలు విజులు ప్రజాస్వామ్యంలో వాళ్ళు పిల్లర్స్ 75 సంవత్సరాల చరిత్ర ఉన్న మీకు గత ప్రభుత్వం ఆశలెన్నో చూపెట్టి ఆచరణలో ఏం ఇవ్వలేకపోయారని గుర్తుచేశారు. ఈరోజు ఆర్థిక సంక్షోభం ఉన్న మా ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం ఆచరణలో చూపెడుతుందని వివరించారు.మీరు మేము వేరు కాదని మేము తీసుకున్న నిర్ణయాలు మీరు అమలు చేస్తారని అన్నారు. అదే విధంగా మీరు సూచించే అంశాలు మేము అమలు చేస్తున్నామని తెలిపారు.ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనుగుణంగా ముందుకు పోతుందని, గత పాలకులు నిరంకుశత్వంగా పరిపాలించి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు. ప్రతిపక్ష బాధ్యతలు వదిలి శత్రుదేశంగా సొంత రాష్ట్రానికి నష్టం కలిగేలా చేస్తున్నారనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు..పక్క రాష్ట్రంలో రాష్ట్రానికి ఏమైనా సమస్య వస్తె అన్నిపార్టీలు కలిసి వస్తాయి అని ఆయన ఉదరహరించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రతిపక్షం కలిసి రావాలనిహితవు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కలిసి రాకున్నా ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీలాగా బిజెపితో బిఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని అన్నారు.తెలంగాణ ప్రయోజనాల కోసం బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ఏం చేశారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ బాధ్యత రహితంగా మీరు వ్యవహరిం చినందుకు మీకు సున్నా సీట్లు ఇచ్చారు.రాబోయే కాలంలో మిమ్మల్ని ప్రజలు కనుమరుగు చేస్తారని బిఆర్ఎస్‌ను హెచ్చరిస్తూ మంత్రిపొన్నం జోస్యం చెప్పారు.. పొన్నం ప్రభాకర్ చిట్‌చాట్‌లో మాట్లాడుతూ కొడుకుల కారణంగా డిఎస్ ఆత్మక్షోభిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో ముఖేష్‌గౌడ్ విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. బిఆర్ఎస్ ఓర్వలేక ప్రభుత్వకార్యక్రమాలపై బురద జల్లుతోందని ఆరోపించారు.

## బిసి గురుకుల పాఠశాలలు అదనంగా 119 మంజూరు చేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** బిసి గురుకుల పాఠశాలలకు పెద్దఎత్తున డిమాండ్ ఉన్న దృష్ట్యా ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున అదనంగా 119 బిసి గురుకులాల మంజూరు చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పాత గురు కులాల్లో వసతి సౌకర్యమున్నచోట 5 నుంచి 8 తరగతి వరకు అదనపు సెక్షన్లు ప్రారంభించాలని, దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి గురుకుల సీట్లు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

'ప్రస్తుతం బిసి గురుకుల పాఠశాల అడ్మిషన్లకు లక్షల సంఖ్యలో దరఖాస్తులు రాగా వేల మందికే సీట్లు ఇచ్చారు. ఇంకా లక్షల సంఖ్యలో విద్యార్థులు సీట్లు లభించక ఇబ్బంది పడుతున్నారన్నారు. బిసి జనాభా రాష్ట్రంలో 56 శాతానికిపైగా ఉన్నారని, అదనంగా 119 బిసి గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలి' అని ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి గురు కుల పాఠశాలలో సీట్లు ఇవ్వాలని, ముందుకు వచ్చిన వారిని ప్రోత్సహిం చాలన్నారు. బ్రోకర్లను, పైరవీ కార్లను అరికట్టడానికి పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## గోదావరి-బనకచర్లపై జూలై 1న పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్

### ముఖ్యఅతిథులుగా ముఖ్యమంత్రి, డిప్యూటీ హాజరు

### హాజరుకానున్న రాష్ట్ర మంత్రివర్గం

### మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణ

**హైదరాబాద్, జూన్ 29,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తల పెట్టిన గోదావరి బనకచర్ల అంశంపై జూలై 1 న రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రతినిధులందరికి నిజ నిజాలు తెలిపే విదంగా ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

అందుకు అనుగుణంగా ఆయన నీటిపారుదల రంగ అధికారులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు ఏ రకంగా దెబ్బ తింటున్నాయాన్నది సమగ్రంగా వివరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జులై 1 మంగళవారం రోజున డాక్టర్ జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కు ముఖ్య అతిధులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క లతో సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం హాజరు కానున్నారు.

అంతే గాకుండా తెలంగాణా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ,లోకసభ సభ్యులు,శాసన మండలి,శాసనసభ్యులతో పాటు కార్పొరేషన్ చైర్మన్ లు డైరెక్టర్ లు వివిధ విభాగాలకు చెందిన కమిషన్ల చైర్మన్ లు,సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు

# భూమిలేని వ్యవసాయ కూలీలకు శుభవార్త

### త్వరలో 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'కు నిధుల విడుదల

### ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు

**హైదరాబాద్ జూన్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీలకు జూలై మొదటి వారంలో నిధులు విడుదల చేయనుంది. 4,45,304 మంది అర్హులకు రూ.261 కోట్ల ఆర్థిక సహాయం నేరుగా వారి ఖాతాల్లో జమ కానుంది.ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి, కనీసం 20 రోజులు పనిచేసిన కూలీలు ఈ పథకానికి అర్హులు. ఇది పేద వ్యవసాయ కూలీలకు ఆర్థిక భరోసాను ఇస్తుంది. గతంలో రైతుభరోసా నిధులు కూడా విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని వ్యవసాయ కూలీలకు శుభవార్త. పెండింగ్‌లో ఉన్న నిధులను జూలై తొలి వారంలో విడుదల చే యాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈ పథకం కింద, రాష్ట్రంలోని భూమి లేని వ్యవ సాయ శ్రామికులకు ఏటా2 విడతలుగా మొత్తం రూ.12 వేలు ఆర్థికసాయం అందిస్తుంది. ఇప్పటికే.. తొలి విడతలో 83,887 మంది లబ్ధిదారులకు రూ.6వేల చొప్పున నిధులు జమ అయ్యాయి.ప్రస్తుతం..మిగిలిన 4,45,304 మంది అర్హులకు సంబంధించిన సుమారు రూ.261 కోట్ల నిధులను విడుదల చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.ఈ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంక్‌ఖాతాలకు జమస్తారు. ఈ పథకానికి అర్హులు కావాలంటే.. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉండటంతో పాటు, కనీసం 20 పని దినాలు పూర్తి చేసి ఉండాలి.ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం.భూమి లేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడం, వారి జీవితాల్లో ఒక భరోసాను నింపడం. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ పనులు లేని సమయంలో ఈ ఆర్థిక సహాయం వారికి ఎంతో ఆసరాగా నిలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారిని పేదరికం నుంచి బయటపడేయడం ద్వారా సామాజిక న్యాయాన్ని అందించడమే ఈ పథకం లక్ష్యం.ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ.. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోస్త్రా పథకం కింద నిధుల విడుదలతో, లక్షలాది మంది వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఉపశమనం లభిస్తుంది.ఇప్పటికే రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన విషయం తెలిసిందే.గతంలో ఎన్నడూ లేని విధంగా 9 రోజుల్లో రైతులకు ఎకరాలతో సంబంధం లేకుండా డబ్బులను జమ చేశారు. ఇది ఒక రికార్డుగా మంత్రి భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నట్లు పేర్కొన్నారు.

## రాజకీయాలపై రమణ వ్యంగ్యాస్త్రాలు నవ్వులతో గుచ్చుకుంటాయి

### ఎపి శాసనసభ ఉపసభాపతి రామకృష్ణంరాజు

### తెలుగు వాకిట ముత్యాలముగ్గు బాపు బొమ్మ, రమణ రాత: ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు



బాపు రమణల కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణంరాజు, రాఘవేంద్రరావు, అల్లు అరవింద్, మల్లెమాల, జిత్‌మోహన్, సుబ్బరాజు, వర తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 29, ప్రభాతవార్త :** ప్రముఖ దర్శక రచయి తల మిత్రద్వయం బాపు రమణలు నిర్మించిన సినిమా ముత్యాలముగ్గు 50 యేళ్ల పండుగ, ముళ్లపూడి రమణ 94వ జయంతి వేడుకలను పుర స్కరించుకొని శ్రీవర ముళ్లపూడి సౌజన్యం, బాపు రమణల అకాడమీ నిర్వహణలో పలువురు సినీప్రముఖుల మధ్య ఘనంగా జరిగిన కార్యక్ర మంలో ఎపి శాసనసభ ఉపసభాపతి రామకృష్ణంరాజు మాట్లా డుతూ రమణ రాజకీయాలపై వ్యంగ్యా స్త్రాలు నవ్వులతో గుచ్చుకునే విధంగా ఉన్నాయని తెలిపారు. ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ తెలుగువాకిట ముత్యాలముగ్గు బాపు బొమ్మ, రమణ చేవ్రాత అని చమత్కరించారు. బాపు రమణలు సూర్య చంద్రుల వంటివారని వారి వెలుగులు ఎల్లవేళలా విశ్వవ్యాప్తంగా వ్యాపించే ఉంటాయని, తెలుగు లోగిళ్లలో ఎన్నటికీ చెరగని ముగ్గు ముత్యాలముగ్గు అని స్పష్టం చేశారు. నిర్మాత అల్లు అరవింద్ నటుల నుండి ప్రతిభను వెలికితీయడంలో బాపు మాటలను కత్తిలా వ్రాయడంలో రమణ తనకుతానే సాటన్నారు. తన తండ్రి అల్లు రామలింగయ్య కోతిలా నటించి మెప్పించడం అందుకు నిదర్శనమని గుర్తుచేశారు. నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి బాపు రమణల స్నేహం అందరికీ ఆదర్శనీయం, స్మరణీయన్నారు. ముత్యాలముగ్గు సినిమాలో నటించిన జిత్‌మోహన్‌మిత్రా, సుబ్రహ్మణ్యవర్మ, రావు రమేష్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని సంస్థ కార్యదర్శి సుబ్బరాజు, ముళ్ళపూడి వర పర్యవేక్షించారు.

## పిసిసి ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు పని విభజన

### పార్లమెంట్ ఇన్‌చార్జీలుగా 17 మంది ఉపాధ్యక్షులు, 51 మంది కార్యదర్శులు

### పార్టీ అనుబంధ సంస్థల ఇన్‌చార్జీలుగా 22 విపిలు, 10 కార్యదర్శులు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల వేళ పార్టీని మరింత ప్రభావవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు సంస్థాగతంగా పటిష్టరించేందుకు కసరత్తు ప్రారంభించింది. టిపిసిసి కొత్తగా నియామకం చేసిన ఉపాధ్యక్షులకు ,కార్యదర్శులకు పనివిభజన చేసి రానున్న ఎన్నికలలో మెరుగైన ఫలితాలు పొందేందుకు అవసరమైన చర్యలు తీసు కొంటున్నది.

పార్లమెంట్ నియోజకవర్గాలకు కొంత మందిని, పార్టీ అనుబంధ సంస్థలకు కొంతమందిని కేటాయించి పనివిభజన చేశారు. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక వైస్ ప్రెసిడెంట్, ముగ్గురు జనరల్ సెక్రటరీలను నియమించారు టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అందులోభాగంగా పార్లమెంట్ ఇంచార్జీలుగా 17 మంది ఉపాధ్యక్షులను 51 మంది జనరల్ సెక్రటరీలను నియామకం చేశారు. ఒక్కో పార్లమెంట్‌కు ఒక ఉపాధ్యక్షుడితోపాటు ముగ్గురు జనరల్ సెక్రటరీలు ఇంచార్జీలుగా ఉండి పార్టీని బూతుస్థాయి కార్యకర్తతో సమన్వయం చేసుకుంటు ముందుకుపోవాలనే ఉద్దేశ్యంతో ఈ విధమైన కూర్పును టిపిసిసి అధ్యక్షుడు చేసినట్లు జాబితాను చూస్తే అర్థం అవుతోంది.

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంకు ఎంపీ రఘువీర్ రెడ్డి ఆయనతోపాటు ముగ్గురు జనరల్ సెక్రటరీలు ఉంటారు. పెద్దపల్లి - గాలి అనిల్ కుమార్ ఆయనతోపాటు ముగ్గురు జనరల్ సెక్రటరీలు పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షణ చేస్తారు. కరీంనగర్ - ఎమ్మెల్యే నాయిని రాజేందర్ నాయకత్వంలో ముగ్గురు జనరల్ సెక్రటరీలు ఉంటారు. నిజామాబాద్ ఎమ్మెల్సీ -బాల్మూర్ వెంకట్ తోపాటు ముగ్గురు కార్యదర్శులు, జహీరాబాద్- బండి రమేష్, మెదక్ - నవాబ్ ముజాహిదీన్ ఆలం ఖాన్, మల్కాజ్ గిరి ఎమ్మెల్సీ- బసవరాజు సారయ్య, సికింద్రాబాద్- ఝాన్సీ రెడ్డి,హైదరాబాద్ -సంగమేశ్వర్, చేవెళ్ల - బొంతు రామ్మోహన్,నాగర్ కర్నూల్ - కొండేటి మల్లయ్య, నల్గొండ- మామిండ్ల శ్రీనివాస్, భువనగిరి కోటింరెడ్డి -వినయ్ రెడ్డి వరంగల్- సత్య నారాయణ, మహబూబాబాద్- నాగేశ్వర్ రావు, ఖమ్మం - శ్రవణ్ కుమార్ రెడ్డి మహబూబ్ నగర్ -వేణు గౌడ్‌లు వారితోపాటు ముగ్గురేసి కార్యదర్శులు ఉంటారు.

ఇక పార్టీ అనుబంధ సంఘాల ఇంచార్జీలుగా 22 విపిలను, 10 మంది కార్యదర్శులను నియమించారు.

## పార్టీ సిద్ధాంతాలను నిబద్ధతతో ఆచరించిన గాంధేయవాది డిఎస్

### మంత్రి పొన్నం ప్రభాకర్

### రాజకీయ ఓనమాలు నేర్పిన గురువు డిఎస్: పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్

### గాంధీభవన్‌లో శ్రీనివాస్‌కు మొదటి వర్థంతి నివాళులు



ఆదివారం మాజీ పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ ప్రథమ వర్థంతి గాంధీభవన్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 29,ప్రభాతవార్త:** కాంగ్రెస్ సిద్ధాంతాలను నిబద్ధతతో ఆచరించిన గాంధేయ వాది డి.శ్రీనివాస్‌ని, 2004లో కేంద్రంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యుపిఏ-1 ఆయన నాయ కత్వంలోనే ఎన్నికల్లో వెళ్లి అధికారంలోకి వచ్చా మని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం మాజీ పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ ప్రథమ వర్థంతి గాంధీభవన్‌లో ఘనంగా జరి గింది. డి శ్రీనివాస్ చిత్ర పటానికి మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హను మంతరావు. పిసి సి అధ్యక్షుడు మహేష్ కుమార్‌లు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ డి.శ్రీనివాస్ మాజీ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షు డిగా, మాజీ పిసిసి అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలు అందించారని కొనియా డారు. ఆయన గత సంవత్సరం అనా రోగ్యంతో మన నుండి దూరం అయ్యారనీడి శ్రీనివాస్ లేకపోవడం పార్టీకి తీరనిలోటని వాపోయారు. టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ మాట్లా డుతూ శ్రీనివాస్ జీవితాంతం కాంగ్రెస్ పార్టీ ఊపిరిగా జీవించారని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిచొరవతో నేడు నిజామాబాద్‌లో విగ్రహ విష్కరణ జరుగుతున్నా కాంగ్రెస్ నేతలకు ఆహ్వానం లేకపోవడం బాధాకరమని వాపోయారు. నా రాజకీయ గురువు మాజీ పిసిసి అధ్యక్షులు డి.శ్రీనివాస్ వద్దే నేను రాజకీయ ఓనమాలు నేర్చుకున్నా అని గుర్తుచేసుకున్నారు.

మాజీ పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసిన ఎంపీలు, మాజీ ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, టిపిసిసి ఉపాధ్యక్షులు, కార్యదర్శులు నివాళులు అర్పించారు.

## గతంలో దాడులు జరగలేదా.. అప్పుడెందుకు స్పందించలేదు?

### ఫోన్ ట్యాపింగ్‌పై సిబిఐ విచారణ చేపట్టండి

### మీడియా సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 29, ప్రభాతవార్త:** గతంలో మీడియా సంస్థల మీద దాడులు జరగలేదా..ఫోన్ ట్యాపింగ్ పై విచారణ జరుగుతుంది.. ఇంకా అవసరమైతే కేంద్ర బృందాలతో విచారణ చేయండి.. అంతేకానీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం.. వార్తా కథనాలు అల్లడం సరికాదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మీడియా వాళ్ల కుటుంబ సభ్యులపై ఇలాగే కథనాలు రాస్తే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. వ్యక్తుల మీద దాడులు చేయలేదని, నాయకుల మీద అభిమానంతో దాడులు చేశారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలను కించపరిచే వ్యాఖ్యానాలు చేసిన.. ఇబ్బందులకు గురిచేసిన ఆ మహిళల కుటుంబ సభ్యులు భరించారు.. ఎంతకైనా తెగిస్తారు అని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ జరిగింది అంటూ విచారణలు చేస్తున్నారు.. అవసరమైతే కేంద్ర బృందాలతోనూ విచారణ జరిపించండి. పరవాలేదు.. కానీ కేటీఆర్ పై అభాండాలు వేస్తూ సొంత కథనాలు.. ప్రసారం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు చేయడంతో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేసే క్రమంలో జరిగిన చిన్న గొడవను కొంతమంది రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ఆ మీడియా సంస్థ కార్యాలయం అద్దం పగలవచ్చు.. కానీ మా నాయకులు.. కార్యకర్తల గుండెలు పగిలేలా కథనాలు, ఇంటర్వ్యూలు ప్రసారం చేయడం ఎంతవరకు న్యాయం అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. గతంలో అనేక పత్రిక కార్యాలయాలు.. జర్నలిస్టులపై ప్రస్తుత అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు చేయలేదా..!? అని ప్రశ్నించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు మా హయాంలో ఇండ్లు ఇచ్చాం. ఇంకా కొందరు మిగిలిపోయారు. ఆ ఇండ్లపై విచారణ జరుపుతున్నారు. మిగిలిన వారందరికీ కూడా ఇవ్వవలసింది పోయి ఇండ్లు వచ్చిన వారిపై విచారణ జరుపుతున్నారు.ఇది ఎక్కడి న్యాయం అని మాజీ మంత్రి ప్రశ్నించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



## జూలై 4న జై బాపు, జై భీమ్, జై సంవిధానం బహిరంగసభ

### ఎఐసిసి చీఫ్ మల్లికార్జునఖర్గే రాక

### ఎల్‌బి స్టేడియంలో తెలంగాణ గ్రామస్థాయి అధ్యక్షుల సమ్మేళనం: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్, జూన్29,ప్రభాతవార్త:** రాజ్యాంగ పరిరక్షణ కోసం జైబాపు,జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంతో గ్రామస్థాయిలో ప్రజలకు చైతన్యం కలిగిచడానికి జూలై4 ఎల్‌బిస్టేడియంలో గ్రామస్థాయి కాంగ్రెస్ అధ్యక్షులతో బహిరంగసభ పెడుతున్నామని దీనికి ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతారని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ అన్నారు. గాంధీ భవన్ లో ఆదివాకం హైదరాబాద్ జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన కాంగ్రెస్ నేతల సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా టిపిసిసిచీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగహాజరైనారు.

ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్‌లో పర్యటిస్తున్న సందర్భంగా లాల్ బహదూర్ స్టేడియంలో తెలంగాణ గ్రామ స్థాయి అధ్యక్షుల సమ్మేళనం జరుగుతోందని అన్నారు. జై బాపు, జై భీమ్,జై సంవిధానం కార్యక్రమం తెలంగాణ గ్రామ స్థాయిలో బాగా జరుగుతోందని ఏఐసిసి గుర్తించిందని ఆయన తెలిపారు. కేంద్రంలోని భారతీయ జనతాపార్టీ రాజ్యాంగలోని అనేక అంశాలను మార్పుచేసి మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే పనిలో ఉందని గ్రామీణులకు ఈ అంశంపై మరింత చైతన్యం కల్పించి అప్రమత్తంగా ఉంచాల్సినబాధ్యత లౌకికశక్తులపై ఉందని ఆయన అన్నారు. మల్లికార్జునఖర్గే సమావేశంకు స్వచ్ఛందంగా అనేక మంది ఎల్‌బి స్టేడియంకు హాజరు అయ్యేలా చూడాలని అన్నారు. గాంధీ భవన్ లో జూలై 4 న పొలిటికల్ అఫైర్ సమావేశం కూడా ఉంటుందని.అనంతరం టిపిసిసి విస్తృత స్థాయి కూడా ఉంటుందని. సాయంత్రం ఎల్బీ స్టేడియం లో గ్రామస్థాయి నేతలతో బహిరంగసభ ఉంటుందని ఆయన వివరించారు.జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కమిటీ మీటింగ్ లో బాగంగా ఈ సభ నిర్వహణ..జూబ్లిహిల్స్ లో ఎన్నిక ఎప్పుడు జరిగినా మేము గెలుస్తాం. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన ప్రతి వారిని గుర్తిస్తామని ఆయన అన్నారు

**జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ విజేత :**

**మంత్రి పొన్నం ఆశాభావం**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.జూలై 4 వ తేదీన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ లో పర్యటిస్తున్న సందర్భంగా సభ ను విజయవంతం చేయాలని హైదరాబాదీ కాంగ్రెస్ శ్రేణులకు ప్రభాకర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ లో ఉన్న అన్ని నియోజకవర్గాల నుండి ముఖ్య నేతలు సభలో పాల్గొనాలని కోరారు. .హైదరాబాద్ నాయకత్వం సభ ఏర్పాట్ల పై ఆక్టివ్ గా పాల్గొనాలి,. హైదరాబాద్ లో పార్టీకి సంబంధించిన ఇష్యూ నా దృష్టికి తీసుకొచ్చాయని ఆయన తెలిపారు. దేవాలయ కమిటీ లు ,కళ్యాణ లక్ష్మి ,షాది ముబారక్ చెక్కులు పంపిణీ ,బోనాల చెక్కుల పంపిణీ తదితర ప్రోటోకాల్ ఇష్యూస్ ఏమైనా పొరపాట్లు మళ్ళీపునరావృతం కాకుండా చూసుకోవాలని ఆయన హితవు చెప్పారు. క్షేత్ర స్థాయిలో పార్టీ కోసం కష్టపడుతున్న వారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తామని తెలిపారు.జిహెచ్ఎంసి ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలను కోరారు. ఉప ఎన్నికలలో జూబ్లిలో సత్తా చూపాలని దాని కోసం ఇప్పటి నుండి సన్నద్ధం కావాలని అన్నారు. జీహెచ్ ఎంసీ మేయర్ స్థానం కాంగ్రెస్ కైవసం చేసుకోవాలని కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పై ఇప్పటి నుండి గ్రౌండ్ లెవెల్ లో ప్రణాళిక ద్వారా ముందుకు పోవాలని అన్నారు.

# బ్లాక్‌స్పాట్స్‌పై ప్రజలను అప్రమత్తం చేయండి

### తెలంగాణకు రోడ్డు ప్రమాద మరణాల్లో 9వ ర్యాంకు

### రాష్ట్ర పోలీసులకు కేంద్రం లేఖ

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నానాటికీ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్లపై ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు వాటిని సరిచేయడానికి ఆర్అండ్‌బి, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని కేంద్రప్రభుత్వం హెచ్చరించింది. జాతీయ రహదారులపై అత్యంత ప్రమా దాలు తరుచూ జరిగే ప్రాంతాలను ఆర్అండ్‌బి,నేషనల్‌హైవే ఇంజనీర్ల సహాయంతో గుర్తించాలంటూ రాష్ట్ర పోలీసు విభాగానికి కేంద్ర ఉపరితల రవాణా శాఖ లేఖ రాసింది.రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లే కాదు, రోడ్లపై ఉండే పరిస్థితులూ కారణమవుతు న్నాయి. రోడ్లు ఇరుగ్గా ఉండటం, జంక్షన్ల వద్ద వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం, వాహనాల పరిమాణానికి, వేగానికి తగ్గట్టు రోడ్లు నిర్మించకపోవడం ముఖ్యంగా మలుపులు, వంపులు తిరిగి ఉండటంతో ప్రమాదాలు తలెత్తుతున్నాయి.

ఇలాంటి ప్రమాదకరమైన ప్రదేశాలను పోలీస్‌స్టేషన్ల వారీగా వివరాలు సేకరించే పని ప్రారంభమైంది. దీనిలో భాగంగా హైవేలపై అత్యధిక ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తిస్తారు. ప్రమాదాలకు కారణాలను విశ్లేషిస్తారు. తెలంగాణలో జాతీయ రహదారులపై 930 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ఈ వివరాలను కేంద్రానికి పంపుతారు. సిగ్నల్ వ్యవస్థ నెలకొల్పడం, సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు వెడల్పు, వాహనాల వేగ నియంత్రణ వంటి చర్యలు చేపట్టనున్నారు. ఆయా ప్రాంతాలకు తగ్గట్టుగా చర్యలు చేపట్టేందుకు కేంద్రం నిధులు మంజూరు చేస్తుంది. దేశంలోనే అత్యధిక రోడ్డు ప్రమాదాలు, మరణాలు జరిగే రాష్ట్రాల జాబితాలో తెలంగాణ కూడా ఉంది.

అత్యధిక ప్రమాదాల్లో 8వ స్థానంలో, మరణాల్లో 9వ స్థానంలో తెలంగాణ ఉంది. పెరుగుతున్న వాహనాలకు అనుగణంగా రహదారుల విస్తరణ లేకపోవడం రద్దీకారణంగా ప్రమాదాలు జరుగుతు న్నాయి. ఒక్క విజయవాడ-హైదరాబాద్ హైవేలోనే ఏకంగా గంటకు వెయ్యికి పైగా వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఈ రద్దీ ప్రతి సంవత్సరానికీ కనీసం ఐదు శాతం చొప్పున పెరిగిపోతోంది.

రాష్ట్రంలోని హైవేలు అన్నింటిలోనూ ఇదే పరిస్థితి. పండగలు, ఇతర సెలవుల్లో అయితే సాధారణ ట్రాఫిక్‌కు కనీసం 10 రెట్లు ఎక్కువ నమోద వుతుంటుంది. ట్రాఫిక్ పెరుగుతున్న కొద్దీ ప్రమాదాల తీవ్రత కూడా పెరుగుతుంటుంది.

మన రాష్ట్రంలో గత సంవత్సరం 25,934 ప్రమాదాలు జరిగాయి. వాటిలో 7,281 మంది మరణించారు. రాష్ట్రంలో హైవేలపై జరిగే ప్రమాదాల్లో మరణాల సంఖ్య ఎక్కువ. అందుకే ఈ ప్రమాదాల నివారణపై కేంద్రం దృష్టి సారించింది.



# ఇక 8 గంటలు ముందే రిజర్వేషన్ చార్టులు

## రైల్వేబోర్డు కీలక ప్రతిపాదనలు

**న్యూఢిల్లీ, జూన్ 29:** టికెట్ల రిజర్వేషన్లలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేం దుకు భారతీయ రైల్వేలు కీలకనిర్ణయాలు తీసుకుంటోంది. రైళ్ల బయలుదేరడానికి ఎనిమిదిగంటల ముందే రిజర్వేషన్ చార్టులను సిద్ధం చేయాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. అంటే మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరే రైలు రిజర్వేషన్ చార్టులు ముందు రోజు రాత్రి 9గంటలకు సిద్ధం చేయబోతున్నది. టికెట్ బుకింగ్‌ను సులభతరం చేయడానికి రైల్వేలు అనేక చర్యలు చేపడుతుందని పేర్కొంది. ప్రస్తుతం రిజర్వేషన్ చార్ట్ రైలు బయలుదేరడానికి నాలుగు గంటల ముందు తయారవుతున్నది. దాంతో ప్రయాణికుల్లో అనిశ్చితి నెలకొంటున్నది. రైలు టికెట్ కన్ఫామ్ అవుతుందా లేదా అన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికుల్లో అనిశ్చితిని తొలగించేందుకు రైలు బయలుదేరే ఎనిమిది గంటల ముందే రిజర్వేషన్ చార్ట్‌ను సిద్ధం చేయాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. ఎలాంటి అంతరాయం కలుగకుండా దశలవారీగా దీన్ని అమలు చేయాలని బోర్డుకు సూచించారు. ఈ నిర్ణయంతో వెయిట్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికులపై కొంత వరకు అనిశ్చితి తగ్గుతుంది. వెయిటింగ్ లిస్ట్ స్టేటస్ మరింత ముందుగానే తెలియడంతో దూర ప్రాంతాలు.. శివారు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉంటుందని రైల్వే భావిస్తున్నది. వెయిట్‌లిస్ట్ నిర్ధారించబడకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేందుకు మరింత సమయం ఉండనున్నది. కొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పిఆర్ఎస్) ద్వారా ఇప్పుడు నిమిషానికి 1.5 లక్షలకు పైగా టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని రైల్వే బోర్డు తెలిపింది. దాంతో పాటు, జులై ఒకటి నుంచి ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ నుంచి తత్కాల్ టికెట్ బుకింగ్‌కు సంబంధించి మార్పులు ఉంటాయి. ఇకపై అథెంటికేషన్ యూజర్స్ మాత్రమే తత్కాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు అనుమతి ఉంటుంది. దాంతో పాటు జులై చివరి నుంచి తత్కాల్ టికెట్ బుకింగ్ కోసం వన్ టైమ్ పిన్ (వీగిశి) ఆధారిత వెరిఫికేషన్ జరుగనున్నది. ఈ ఆన్‌లైన్ అథంటికేషన్ ప్రక్రియలో యూజర్లు డిజి లాకర్ అకౌంట్ సహాయం తీసుకోవచ్చు. డిజిలాకర్, ఏదైనా ఇతర ప్రభుత్వ ఐడీలో సేవ్ చేయబడిన ఆధార్ కార్డ్ డేటాను ధృవీకరణ కోసం ఉపయోగించవచ్చని రైల్వేశాఖ పేర్కొంది.

# రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలకు డిమాండ్

## భారీగా పెరిగిన రేట్లు.. వ్యాపారుల దోపిడీ

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** వానాకాలం సాగు పనుల్లో రైతులు నిమమగ్నమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పత్తి, సోయా, మిరప వంటి పంటల సాగు చేయడం ప్రారంభించారు. ఇందుకు గాను అవసరమైన విత్తనాల కోసం దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. దీంతో విత్తనాలకు డిమాండ్ ఏర్పడింది. ఇదే అదునుగా భావించిన ప్రయివేట్ విత్తన వ్యాపారులు పలువురు రైతుల్ని నిలువు దోపిడీ చేస్తున్నారు. ఏ కంపెనీకి చెందిన హైబ్రీడ్ విత్తన ప్యాకెట్ అయినా రూ.901కు విక్రయించాలని కేంద్రం నిర్దేశించింది. అయితే క్షేత్ర స్థాయిలో మాత్రం అదనంగా రూ.200 నుండి రూ.350 వరకూ అవసరం, అవకాశం బట్టి దుకాణదారులు వసూలు చేస్తున్నారు. సోయాబీన్ విత్తనాల ధర రూ.2,400 ఉండగా రైతుల నుంచి రూ.2,600కు పైగా తీసుకుంటున్నారు. నగదు రూపంలో అదనంగా డబ్బులు తీసుకుంటున్న వ్యాపారులు రసీదులో మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధరల్ని మాత్రమే రాస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే విత్తనాల కొరత ఉందనే సాకు చెబుతున్నారు. నాలుగెకరాల భూమిలో పత్తి, సోయాబీన్, మిరప పంటలు సాగు చేసేందుకు నాలుగు పత్తి విత్తన ప్యాకెట్లు (ఒక్కటి 475 గ్రాములు), ఒక సోయాబీన్ సీడ్ సంచి (30 కిలోలు), మిరప విత్తనాలు కావాలని అడిగాడు. సదరు వ్యాపారి పత్తి ప్యాకెట్ ధర రూ.900 చొప్పున నాలుగు ప్యాకెట్లకు రూ.3,600, సోయాకు రూ.2,400, ఇతర విత్తనాలకు రూ.900 బిల్లు వేస్తున్నారు. అయితే నగదుగా మాత్రం రూ.800 వరకూ అదనంగా తీసుకున్నట్లు పలువురు రైతులు వాపోతున్నారు. రసీదులో వేసిన ధరల కంటే ఎక్కువ ఎలా తీసుకుంటారు అని రైతులు ప్రశ్నిస్తే పత్తి విత్తనాలపై ప్యాకెట్‌కు రూ.200 అదనంగా ఇవ్వాల్సిందేనని వ్యాపారులు స్పష్టంగా చెబుతున్నట్లు రైతులు అంటున్నారు. అలాగే మరో ఎరువుల దుకాణంలో సోయాబీన్ విత్తన సంచి ఇవ్వమని అడిగితే ఎంఆర్‌పీ ధర రూ.2,400 ఉండగా, రూ.2,500 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు రైతులు వెల్లడిస్తున్నారు. పత్తి ప్యాకెట్ ధర రూ.901 ధర వేస్తున్న వ్యాపారులు సోయాబీన్‌కు మాత్రం రూ.2,600 ధర చెప్పాడు. ఇలా రైతుల అమాయకత్వాన్ని బట్టి వ్యాపారులు ఒక్కొక్కరు ఒక్కో రీతిగా విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తూ రైతుల్ని నిలువు దోపిడీ చేస్తున్న పరిస్థితి. కాగా తక్కువ పత్తి విత్తనాలకు సంబంధించి బ్రాండెడ్ హైబ్రీడ్ విత్తనాలు బీటీ1, బీటీ2 రకాల కొరత ఉందని చెప్పి ఎంఆర్‌పీ ధర రూ.901గా ఉంటే అదనంగా రూ.200 వసూలు చేస్తున్నారు. హైబ్రీడ్ విత్తనాల గురించి రైతులకు శాస్త్రీయమైన అవగాహన లేకపోవడంతో వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. మరి కొందరేమో నిషేధించబడిన బీటీ3 పత్తి విత్తనాలను తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. బీటీ2 కంటే బీటీ 3 విత్తనాలు సాగు చేస్తే 30 శాతం అధిక దిగుబడి వస్తుందని, దోమపోటు అస్సలు రాదని చెప్పి ఐదారు వందల రూపాయలకే ప్యాకెట్ విత్తనాలను విడిగా విక్రయిస్తున్నారు.

# రాగాల రిసార్ట్స్‌లో ఇద్దరు ఆత్మహత్య

**బీబీనగర్, జూన్ 29, ప్రభాతవార్త:** తమ కుటుంబ సభ్యులు తమపై అనుమానాలు వ్యక్తం చేయడం వల్ల మనస్థాపానికి గురై ఓ వివాహిత జంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని రాగాల రిసార్ట్స్ లో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన బంధబాల బాల సుధాకర్ (39), పసాలా సుష్మిల (35) ఇరువురి కుటుంబాలు హైదరాబాద్ లోని రామంతపూర్ కెసిఆర్ నగర్ లోని కెసిఆర్ నగర్ లో నివాసం ఉంటున్నారు.

శుక్రవారం వీరిద్దరూ కలిసి టీఎస్08 ఎఫ్ జెడ్ 9805 కారులో రాగల రిసార్ట్‌కు వచ్చి గది ఒకటి తీసుకుని ఉంటున్నారు. ఆదివారం పురుగుల మందు తాగి జంటగా ఆత్మహత్య చేసుకున్నారు. కాగా ఇరు కుటుంబాలు సభ్యులు వీరిపై అనుమానాలు, అపోహలు ఆరోపించడం వల్ల మనస్థాపానికి, మానసిక క్షోభకు గురై సూసైడ్ లెటర్ రాసి, సెల్ఫ్ విడియోలు చిత్రీకరించి వారి కుటుంబ సభ్యులకు పంపారు. ఆదివారం మధ్యాహ్నం బయటకు వెళ్లి పురుగులమందు తీసుకొని వచ్చి కూల్ డ్రింక్స్‌లో పురుగుల మందు కలుపుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతదేహాలను భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఇరు కుటుంబాలకు చెందిన బంధువులు భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని వారి మృతదేహాల వద్ద బోరున విలపించారు. ఇరువురు వేరువేరుగా ప్రేమ వివాహాలు చేసుకొని కాపురాలు చేసుకుంటున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. బాల సుధాకర్ హైదరాబాదులో ప్రైవేట్‌జాబ్ చేస్తున్నారు. సుష్మిల సిఎంఎస్ కళాశాలలో అకౌంటెంట్గా ఉద్యోగం చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు.

# పసుపు ధరల్లో స్థిరీకరణ

## వ్యవసాయ్న వర్సిటీలో పరిశోధన కేంద్రం ఏర్పాటు

## కేంద్రానికి పలు సూచనలు చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** పసుపు రైతులు తమ పంటను కనీస మద్దతు ధరకు అమ్ముకునే విధంగా ధరలలో స్థిరీకరణ తేవాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. అందుకోసం పసుపు పంటకు కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు. పసుపు బోర్డు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి అమిత్ షాకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన ఒక లేఖను సమర్పించారు. అందులో పసుపు రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలన్నారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ వంటి సంస్థల ద్వారా నేరుగా కొనుగోళ్లను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పసుపు ప్రధానంగా పండే ప్రాంతాలలో డ్రైయింగ్ ప్లాట్‌ఫార్ములు నిర్మాణానికి కేంద్ర నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రైతుల వద్దనే పసుపు పాలిషింగ్, గ్రేడింగ్ యంత్రాలను అందుబాటులోకి తేవడం ద్వారా మార్కెట్ విలువ పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అధిక కర్క్యుమిన్ శాతం, వ్యాధి నిరోధకత, ఎగుమతులకు అనుకూలత కలిగిన విత్తన రకాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తూ, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక పసుపు పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పసుపు సాగు యాంత్రీకరణ, విలువ ఆధారిత గొలుసు అభివృద్ధిపై ఐసీఏఆర్, యుజిసి మద్దతుతో పరిశోధనలకు తోడ్పాటు కల్పించాలని తెలిపారు. భౌగోళిక సూచిక ఆధారంగా తెలంగాణ పసుపును అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రాండ్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. పసుపు పంటను ఇతర దేశాలకు ఎగుమతి చేసే విధంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు డాక్యుమెంటేషన్‌ను సరళీకరించడం, అంతర్జాతీయ వాణిజ్య డెలిగేషన్లు, ఎగ్జిబిషన్లలో రైతుల పాల్గొనడాన్ని ప్రోత్సహించాలన్నారు. అలాగే పసుపు రైతులకు వారి స్థానిక భాషల్లో సలహాలు అందించే విధంగా మొబైల్ యాప్‌లు అభివృద్ధి చేయాలని, విలువ ఆధారిత, సేంద్రియ సాగు, అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలపై రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, పసుపు సాగులో కార్మిక వ్యయాన్ని తగ్గించేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకంతో సమన్వయం చేయాలన్నారు. పసుపు రంగ అభివృద్ధి కార్యక్రమాల అమలును పర్యవేక్షి ంచేందుకు వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ పసుపు బోర్డు మరియు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రస్తుత పసుపు సాగు పరిస్థితులపై బేస్‌లైన్ సర్వేను చేపట్టి, వచ్చే ఐదు సంవత్సరాల కోసం ప్రణాళికను రూపొందించాలని సూచించారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని చెప్పారు. ఏపి పునర్విభజన చట్టం 2014 లో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో కలిసిన భద్రాచలం చుట్టుపక్క గ్రామాలైన యాటపాక, కన్నాయిగూడం, పిచుకలపాడు, పురుషోత్తపట్నంలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కేంద్రమంత్రిని లేఖ ద్వారా కోరారు.

# క్రమశిక్షణ, సమయపాలనకు మారుపేరు పివి

## మాజీ ప్రధాని 104వ జయంతి వేడుకలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

## ముఖ్యమంత్రి, ప్రధానిగా వివిధ పదవుల్లో రాణించిన పివి : డా. కె.వి.రమణాచారి



పి.వి. స్మారక ప్రసంగం చేసిన శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వాణీదేవి, రమణాచారి, ప్రభాకర్‌రావు, ఉదయవర్లు తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 29, ప్రభాతవార్త :** క్రమశిక్షణ, సమయపాలనకు మారుపేరు పి.వి.నరసింహారావు అని, ఈరెండు సలక్షణాలుంటే సాధించలేనిది ఏదీలేదని, అత్యున్నత స్థాయికి అధిగమించవచ్చని పి.వి.నరసింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. పిల్లలు అనాదిగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలు, వసుదైక కుటుంబం, ఆహారం తదితర నియమాలను తు.చ తప్పకుండా పాటించాలన్నారు. ఏవిషయంలోనూ విదేశీ పాశ్చాత్య పోకడలు ఆచార వ్యవహారాలు, మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు, దేశ, సంఘవిద్రోహక కార్యాలకు దూరంగా ఉండాలని ఉద్బోధించారు. పి.వి గురించి ఎంత చదివినా తక్కువేనని, విద్యార్థులు మంచిగా చదువుకోవాలని, అందుకు నిదర్శనమైన పి.వి స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్తేనే పి.వి.కి మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. పి.వి.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ పి.వి.నరసింహారావు స్థితప్రజ్ఞుడన్నారు. రోజులో 14గంటలు పని చేసే వారని, పనిలో చిత్తశుద్ధి అనితర సాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రమేర్పడిన తర్వాత పి.వి వివిధ రంగాలలో సాధించిన విజయాలు, వ్యక్తిత్వం, జీవితం, ప్రధానమంత్రిగా దేశానికి ఆయన సేవలు తదితర ఎన్నో విషయాల గురించి 35 పుస్తకాలు వచ్చాయన్నారు. అనం తరం తన తండ్రి ప్రతిభ పాటవాలను వివరిం చారు. డా. కె.వి.రమణా చారి అధ్యక్షో పన్యాసంలో పి.వి.నరసింహారావు ధీశాలి, బహుభాషా కోవిదుడు, అన్నింటికీమించి తెలుగు బిడ్డ తెలుగుజాతికే గర్వ కారణం అన్నారు. భారత ప్రధానిగా దేశానికి ప్రపంచంలో మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చిన్న భారతరత్న అని శ్లాఘించారు. రాష్ట్ర మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి, భారతదేశ ప్రధానిగా ఎన్నో అత్యున్నత పదవులో గొప్పగా రాణించి ప్రజా, దేశప్రయోజితంగా అత్యుత్తమ వివిధ సంస్కరణ తీసుకొచ్చిన రాజకీయ దురంధరుడని, ప్రజామనిషి అని కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం ఆధ్వర్యంలో జరిగిన పి.వి.నరసింహారావు జయంతి, పి.వి.నరసింహారావు వ్యక్తిత్వంపై డా. కె.శ్రీనివాస్ స్మారక ప్రసంగ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ శాసనమండలి సభ్యురాలు, పి.వి. కుమార్తె సురభి వాణీదేవి ఆత్మీయ అతిథులు పి.వి కుమారుడు పి.వి.ప్రభాకర్‌రావు, భాషానిలయం ఉపాధ్యక్షుడు డా. కె.చంద్రప్రకాశరావు, గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు తదితరులతో కలిసి పి.వి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించి స్మారక ప్రసంగకర్త కె.శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం సీనియర్ పాత్రికేయుడు డా. కె.శ్రీనివాస్ పి.వి. నరసింహారావు వ్యక్తిత్వంపై కూలంకషంగా స్మారక ప్రసంగం చేశారు. చివరిగా పాఠశాల స్థాయి విదార్థుల వ్యాసరచన పోటీలలో విజేతలకు అతిథుల చేతులమీదుగా బహుమతులు ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు.

# రెండో క్వార్టర్‌లో రూ.12 వేల కోట్ల రుణం

## రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ఇండెంట్

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో జూలై నుండి సెప్టెంబర్‌కు సంబంధించి రెండో త్రైమాసికంలో రూ.12 వేల కోట్ల మేర రుణాలను సమీకరించాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఇందుకు గాను రాష్ట్ర ఆర్థిక శాఖ రిజర్వు బ్యాంకుకు ఇండెంట్ పంపించింది. ఈ రుణాల సేకరణలో భాగంగా జూలైలో 4 దఫాలుగా మొత్తం రూ.4,500 కోట్లు, ఆగస్టులో 3 విడతలుగా రూ.3,500 కోట్లు, సెప్టెంబర్‌లో 4 దఫాలుగా రూ.4 వేల కోట్ల రుణం తీసుకునేందుకు ఇండెంట్ పెట్టినట్టు ఆర్థిక శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో జూలై 1వ తేదీన నిర్వహించే సెక్యూరిటీ బాండ్ల వేలంలో రూ.1,500 కోట్ల అప్పు తీసుకుంటామని రిజర్వ్ బ్యాంకు సమర్పించిన ఇండెంట్‌లో తెలిపింది. ఇందులో 24 ఏండ్ల కాలపరిమితితో రూ.800 కోట్లు, 30 ఏండ్ల కాలపరిమితితో మరో రూ.700 కోట్ల తీసుకుంటామని పేర్కొంది. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి జూన్ వరకూ తొలి క్వార్టర్ లో రూ.14 వేల కోట్ల రూపాయల రుణం కోసం రిజర్వ్ బ్యాంక్‌కు ప్రతిపాదనలు పంపించింది. కానీ, ఈ ప్రతిపాదనలో పేర్కొన్న మొత్తం కంటే అదనంగా రూ.3,400 కోట్లు చొప్పున రూ.17,400 కోట్ల రుణం సమీకరించింది. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో బహిరంగ మార్కెట్ ద్వారా మొత్తం రూ.64,539 కోట్ల మేర రుణాలు సేకరిస్తామని వార్షిక అంచనా బడ్జెట్‌లో వెల్లడించింది.

# మాకు పదవులు ముఖ్యం కాదు

## మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్ జూన్ 29, ప్రభాతవార్త:** తమకు మంత్రి పదవులు ముఖ్యం కాదు ప్రజాసేవే ముఖ్యమని మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. కాకా ఫ్యామిలికి 3 సీట్లు ఇచ్చారని విమర్శలు చేయడం సరికాదని, తమకు ప్రజాదరణ ఉంది కాబట్టే 3 సీట్లు గెలిచామన్నారు. హైదరాబాద్‌లో బీం సైనిక్ ఫౌండేషన్ సమ్మేళనంలో మంత్రి వివేక్‌కు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకా వెంకట స్వామి పేదల కోసం ఎప్పుడూ ఆలోచించేవారని ఆయన ఆ రోజుల్లోనే అన్న పూర్ణ క్యాంటిన్లు పెట్టించారని గుర్తు చేశారు. 27వేల మంది కార్మికులకేఉ ఇంటి స్థలాలు ఇప్పించారన్నారు. ప్రైవేట్ సెక్టార్‌లో పెన్షన్లు తీసుకు వచ్చింది ఆయనే అన్నారు.

# మాకు కొన్ని పులులను ఇవ్వండి

## మహారాష్ట్రకు తెలంగాణ రిక్వెస్ట్

## తెలంగాణ విజ్ఞప్తికి అంగీకారం

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** తెలంగాణలోని కవ్వాల్ ప్రాంతంలో ఉన్న పెద్ద పులుల అభయారణ్యం (టైగర్ రిజర్వు ఫారెస్ట్)లో ప్రస్తుతం ఒక్క పులి కూడా లేకపోవడంతో మహారాష్ట్రలోని తాడోబా అభయారణ్యం నుంచి పులులను కవ్వాల్‌కు తీసుకు రానున్నారు. ప్రాజెక్ట్ టైగర్ పేరుతో రాష్ట్ర అటవీ శాఖ చేపట్టే ఈ ప్రాజెక్టుకు సహకరించేందుకు మహారాష్ట్ర అంగీకారం తెలిపింది. దీనిపై క్షేత్ర పరిశీలన కోసం నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టిసిఎ)అధికారులు జులై తొలి వారంలో కవ్వాల్‌కు రానున్నారు. కవ్వాల్‌లో దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. 13 ఏళ్ల కిందట ఇక్కడ అభయారణ్యం ఏర్పాటు చేశారు. పులులు వేటాడి తినేందుకు జింకలు, సాంబర్, నీల్గాయి వంటి జంతువులు అక్కడ ఉన్నాయి. అడపాదడపా మహారాష్ట్రనుంచి కవ్వాల్‌కు ఒకటిరెండు పెద్దపులులు వస్తున్నా, ఒంటరితనంతో తిరిగి వెళ్లిపోతున్నాయి. దీనికి భిన్నంగా మహారాష్ట్రలో భారీసంఖ్యలో పులులున్నాయి. ఆసిఫాబాద్‌కు సరిహద్దులో ఉన్న తాడోబా టైగర్ రిజర్వులో 40కి పైగా, ఆదిలాబాద్ పక్కనే ఉన్న ఇంద్రావతి నేషనల్ పార్కులో20కి పైగా ఉన్నాయి. ఈ నేపథ్యంతో అక్కడున్న పెద్ద పులులను ఇక్కడికి తరలించాలని తెలంగాణ అటవీశాఖ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏలూసింగ్ మేరు, మహారాష్ట్ర చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌ను ఇటీవల కోరగా సుముఖత తెలిపారు. తదుపరి అనుమతుల కోసం రాష్ట్ర అటవీ శాఖ ఎన్టీసీఏకు లేఖ రాసింది. మహారాష్ట్ర నుంచి కనీసం ఒక మగ పులి, రెండుఆడ పులులు సహా గరిష్ఠంగా5పులులు కావాలని రాష్ట్ర అటవీ శాఖ కోరినట్లు సమాచారం. రెండేళ్ల పైబడిన పులులు స్వతంత్రంగా సంచరిస్తాయి. అలాంటివే తమకు కావాలని మహారాష్ట్రను తెలంగాణ కోరింది. పెద్దపులులకు ఆవాసం కోసం కవ్వాల్ కోర్ ఏరి యా నుంచి మైసంపేట, రాంపూర్ ఊర్ల ప్రజలను 20 కి.మీ. దూరంలోని ప్రాంతానికి తరలించారు. ప్రజలు ఖాళీ చేసిన పాత గ్రామాల ప్రాంతానికి పెద్ద పులుల్ని తరలించనున్నా రు. ఒక అడవిలో ఎక్కువగా ఉండే పులుల్ని, వాటి సంఖ్య లేని మరో అరణ్యంలోకి తీసుకెళ్లడాన్ని టైగర్‌రీ లొకేషన్ అంటారు. గతంలో మధ్యప్రదేశ్‌లోని పన్నా టైగర్ రిజర్వులో ఇలాగే చేశారు. అక్కడ 2009 నాటికి ఒక్క పెద్దపులి కూడా లేదు. దీంతో అదే రాష్ట్రంలోని అడవుల నుంచి 4 పులులను పన్నా రిజర్వుకు తరలించగా, ప్రస్తుతం పన్నాలో పెద్ద పులుల సంఖ్య 50 దాటింది. అయితే కవ్వాల్ రిజర్వ్ ఫారెస్టు విస్తీర్ణం : 2015.39 చ.కిమీ. కాగా ఏర్పాటు 2012లో మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌లకు విస్తరించింది.

# సబర్బన్‌రైల్ ప్రమాదాల్లో 29వేల మంది మృతి



**ముంబయి, జూన్ 29:** ముంబయి సబర్బన్ రైళ్లలో గడచిన 11 ఏళ్లలో జరిగిన ప్రమాదాల్లో 29 వేల మంది మరణించారు. ఇందులో ఇంకా ఎనిమిదివేల మంది శవాలను గుర్తించనేలేదని రైల్వే గణాంకాలు చెబుతున్నాయి. దేశ ఆర్థిక రాజధానికి జీవనాడిగా పిలిచే ముంబయిలో సబర్బన్ రైలు చాలా కీలకం. ఇది నిత్యం రద్దీగానే ఉంటుంది. ఈ రైల్లో ప్రతి రోజూ సుమారు 65 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. కేవలం సెంట్రల్ రైల్వేలోనే నిత్యం 30 లక్షల మందికి పైగా ప్రయాణిస్తుంటారు. అదే పశ్చిమ రైల్వే, సెంట్రల్ రైల్వేలో రెండింటిని కలిపి లెక్కిస్తే ప్రతి రోజు సుమారు 65 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలోనే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ మెయిన్ లైన్, హార్బర్‌లైన్, ట్రాన్స్ హార్బర్‌లైన్లలో మూడు వేల రైళ్లను నడుపుతుంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని లోకల్ ఏసీ రైళ్లను కూడా నడుపుతున్నారు.

ఉదయం, సాయంత్రం వేళ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే పీక్ అవర్‌లో జనం పుట్‌బోర్డ్‌పై వేలాడుతూ ఉంటారు. ఇలా రైళ్ల రద్దీ కారణంగా మైన ప్రమాదకం ప్రయాణం చేయడం వల్ల గడిచిన పదకొండు సంవత్సరాల్లో 6500 మంది ప్రయాణి కులు మరణిం చారు. మరోవైపు రైలు ప్రమాదాల నివారణపై సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వప్నిల్ నీలా కీలక సూచనలు చేశారు. ప్రజలు సురక్షిత ప్రయాణం చేయాలని కోరిన ఆయన, ఇంకా స్టేషన్లలో ప్రకటనల ద్వారా ప్రయాణికులకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

ముఖ్యంగా కదులుతున్న రైలు నుంచి ఎక్కడం, దిగడం, వంతెనలు ఉపయోగించకుండా పట్టాలు దాటడం వంటివి మానుకోవాలని సూచించారు. దాదాపు 15 వేలకు మందికి పైగా పౌరులు పట్టాలు దాటుతుండగా ప్రాణాలు కోల్పోయారని రైల్వే శాఖ చెబుతోంది. ఈ ప్రమాదాల్లో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా మారిపోవడం వల్ల రైల్వే పోలీసులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొంది. అలాంటి సందర్భాల్లో మృతుల వద్ద ఉన్న గుర్తింపు కార్డు, వారు ధరించిన దుస్తులు, మొబైల్ ఫోన్ ఆధారంగా వారిని గుర్తిస్తున్నారని చెప్పింది.

# రాష్ట్రంలో రైతు ఉత్పత్తి సంఘాలుగా 311 పిఏసిఎస్‌లు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** రాష్ట్రాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను (పీఏసీఎస్‌లు) రైతు ఉత్పత్తి సహకార సంఘాలుగా మార్చాలని కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా తెలంగాణలోని పలు వ్యవసాయ సహకార పరపతి సంఘాలను రైతు ఉత్పత్తి సంఘాలుగా మార్చనున్నారు.

రాష్ట్రంలో 908 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ఉండగా, మొదటి విడతలో 311 సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా మార్చుతున్నారు. ఒక్కో సంఘంలో దాదాపు 300 మందికి రైతులు సభ్యులుగా చేరి వాటా ధనం చెల్లించి కార్యకలాపాలను కొన సాగిస్తున్నాయి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహ కార సంఘాలు అధికంగా ఉండడంతో వాటిని మొత్తం రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా మార్చా లని నిర్ణయించింది. ఈ సంఘాలు రైతులకు పంట రుణాలు ఇవ్వడంతోపాటు వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ యంత్రాల కొనుగోలు కోసం దీర్ఘకాలిక రుణాలు ఇస్తుంది. అంతేగాకుండా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నది. ఎరువులు, విత్తనాల విక్ర యాలు చేపడుతున్నది. ఇవేగాకుండా పెట్రోల్ బంక్‌లు, రైసుమిల్లులు, ఇతర వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుండడంతో వాటిని రైతు ఉత్పత్తి దారుల సంస్థల పరిధిలోకి తీసుకువస్తున్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

# జై తెలంగాణ కావాలా.. నై తెలంగాణ సర్కారు కావాలా?

## మాజీమంత్రి హరీశ్‌రావు

## అమరచింతలో సాయిచంద్ విగ్రహావిష్కరణ

## పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జై తెలంగాణ నినాదంతో పనిచేసే ప్రభుత్వం కావాలా.. నై తెలంగాణ నినాదంతో పనిచేసే ప్రభుత్వం కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజలకు కోరారు. ఆదివారం వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు మండలంలోని అమరచింత పట్టణంలో జరిగిన రాష్ట్ర మాజీ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్, దివంగత సాయిచంద్ వర్ధంతి సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సాయిచంద్ బీఆర్ఎస్‌లో ఓ కుటుంబ సభ్యుడిగా ఉన్నాడన్నారు. సాయిచంద్ లేడంటే ఈరోజు నమ్మలేని పరిస్థితి ఉందన్నారు. రాతిబొమ్మల్లోనే కొలువైన శివుడా అనే పాట విన్నప్పుడల్లా కండ్లల్లో నీళ్లు వచ్చేవన్నారు. సాయిచంద్ మూడు సార్లు జైలుకు వెల్లాడని గుర్తుచేశారు. తనకు ఓ తమ్ముడిలా ఉండేవాడని చెప్పారు. జై తెలంగాణ అనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి సీఎం అయ్యాడని సాయిచంద్ ఉండి ఉంటే నిజంగా బాధపడేవాడని అన్నారు. ఒక్కనాడైనా జై తెలంగాణ అని రేవంత్‌రెడ్డి ఇవాలా కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటున్నాడని, కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడమంటే తెలంగాణ ఆనవాళ్లు లేకుండా చేయడమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం గోదావరి నీటిని ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన్నుకుపోతుండగా గుడ్లప్పగించి చూస్తుందే కానీ నీటిని అడ్డుకునే ప్రయత్నం చేయకపోగా తెలంగాణ ప్రాంత రైతాంగానికి తీరని అన్యాయం చేసేందుకు కుయుక్తులు పన్నుతుందని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల సొమ్మును ఢిల్లీ పాలకులకు పంపిస్తూ రాష్ట్రాన్ని దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఆదివారం జరిగిన బిజెపి సమావేశంలో సైతం కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఏటీఎంలో మారిందని చెప్పిన ఉదాహరణలను ఆయన సమావేశంలో ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సాయిచంద్ వర్ధంతి సభకు హాజరు కావడం తనకు ఎంతో బాధ కలిగిస్తుందని సాయి చందు లేని లోటును తెలంగాణ కళాకారులు గుర్తించి సాయి చందు ఆశయాలను సాధించేందుకు తమ వంతు కృషి చేయాలని ఆయన సూచించారు. సమావేశానికి రాష్ట్ర మాజీ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రజిని సాయిచంద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతోంది. ఇటీవల వర్షాలతో కరెంటు వినియోగం తగ్గగా, నైరుతి రుతుపవనాలు బలహీనం అయి వర్షాలు లేక, ఎండలు మండుతుండటంతో విద్యుత్ వినియోగంలో పెరుగుదల చోటు చేసుకుంటోంది.

రాష్ట్రంలో ఈ నెల రెండో వారం నాటికి విద్యుత్ డిమాండ్ నాలుగు అంకెల మీద ఉండగా, తర్వాత అది ఐదంకెలకు చేరింది. ఈ నెల 15వ తేదీన రాష్ట్రంలో కరెంటు వినియోగం 9244 మెగావాట్లు ఉండగా, అది క్రమేపీ పెరుగుతూ ఇప్పుడు 11808 మెగావాట్లకు పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీన రాష్ట్రంలో 9920 మెగావాట్ల మేర డిమాండ్ నమోదు కాగా, 17న 10100 మెగావాట్లు, 18న 10767 మెగావాట్లు, 19న 10936 మెగావాట్లు, 20న 11145 మెగావాట్లు, 21న 10999 మెగావాట్లు, 22న 10813 మెగావాట్లు, 23న 11477 మెగావాట్లు, 24న 11432 మెగావాట్లు, 25న 11439 మెగావాట్లు, 26న 10581 మెగావాట్లు, 27న 11492 మెగావాట్లు, 28న 11808 మెగావాట్ల మేర విద్యుత్ వినియోగం పెరిగింది.

# 'కన్నప్ప' చిత్రానికి అద్భుత విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు: థాంక్స్ మీట్‌లో మోహన్‌బాబు



**విష్ణు మంచు** డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' ప్రస్తుతం పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ చిత్రానికి మంచి స్పందన లభించింది. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద డా. ఎం. మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి భారీ తారాగణం నటించిన ఈ చిత్రం ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఈ మేరకు చిత్రయూనిట్ థాంక్స్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో డా. ఎం. మోహన్‌బాబు మాట్లాడుతూ,ఆ భగవంతుడు ఆశీస్సులతోనే 'కన్నప్ప' చిత్రానికి ఇంత గొప్ప విజయం దక్కింది. మా టైంలో ఓ సినిమాకు ఇన్ని సభలు పెట్టేవాళ్లం కాదు. నటుడిగా 50 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నా అభిమానులు నా వెన్నంటే ఉండి నన్ను ముందుకు నడిపిస్తున్నారు. వారికి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. 'కన్నప్ప' సక్సెస్ తరువాత వాళ్లంతా ఫోన్లు చేసి అభినందనలు తెలియజేస్తున్నారు. వారి ప్రేమకు నేను తిరిగి ఏం ఇవ్వగలను. ఈ చిత్రం కోసం అందరూ ప్రాణం పెట్టి పని చేశారు. అందరికీ హృదయ పూర్వక అభినందనలు. ఆ భగవంతుడి ఆజ్ఞతోనే ఈ సినిమాను తీశామనిపిస్తుంది. అందరి ప్రోత్సాహం ఉండబట్టే ఇక్కడి వరకు రాగలిగాం. వినయ్ లేకపోతే.. కన్నప్ప చిత్రం ఉండేది కాదు. ఈ సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ హృదయ పూర్వక అభినందనలు అని అన్నారు. విష్ణు మంచు మాట్లాడుతూ,మాలాంటి ఆర్టిస్టులకు ప్రేక్షకులే దేవుళ్లు. వారి ఆదరణ, ప్రేమతోనే మేం ఈ స్థాయికి వస్తాం. 'కన్నప్ప'కు అద్భుతమైన స్పందన వస్తోంది. ఇదంతా శివలీల. 'కన్నప్ప' ను ఇంత గొప్ప సక్సెస్ చేసిన ఆడియెన్స్‌కు థాంక్స్‌అని అన్నారు.ముఖేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, 'కన్నప్ప' సినిమా మీద అందరూ ప్రేమను కురిపిస్తున్నారు. ఇంకా సినిమాను చూడాల్సినవాళ్లు చాలా మంది ఉన్నారు. అందరూ ఈ మూవీని చూడండి. మోహన్ బాబు , విష్ణు పదేళ్లుగా ఈ సినిమా కోసం కష్టపడుతూ వచ్చారు. ప్రతీ ఒక్కరూ ప్రాణం పెట్టి ఈ మూవీకి పని చేశారు. అందరికీ ధన్యవాదాలు అని అన్నారు.

మైత్రి శశి మాట్లాడుతూ,కన్నప్పకి అన్ని చోట్లా హౌస్ ఫుల్స్ పడుతున్నాయి. మారుమూల గ్రామాల్లో ఎక్కువగా హౌస్ ఫుల్స్ పడుతున్నాయి. సలార్, పుష్ప లాంటి చిత్రాల తరువాత 'కన్నప్ప'కి కల్వకుర్తి వంటి ఊర్లో థియేటర్లు నిండుతున్నాయి. మల్టీప్లెక్స్, సింగిల్ స్క్రీన్స్ ఇలా అన్ని చోట్లా ప్రభంజనం సృష్టిస్తోంది. 'కన్నప్ప' చిత్రం మున్ముందు భారీ విజయాన్ని నమోదు చేయనుంది. క్లైమాక్స్ చూసి నాకు కన్నీళ్లు వచ్చాయి. విష్ణు అద్భుతంగా నటించారు. ఇప్పుడున్న తరం చూడాల్సిన చిత్రమిది. ఇలాంటి సినిమాను తీసుకు వచ్చిన మోహన్ బాబుకి, విష్ణుకి ధన్యవాదాలు అని అన్నారు.ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వినయ్ మహేశ్వరి మాట్లాడుతూ,మోహన్ బాబు ఫ్యామిలీతో నాకు ఎంతో మంచి సంబంధం ఉంది. కన్నప్ప చిత్రం అద్భుతం చేసింది. ఇంతటి ప్రేమను 'కన్నప్ప' దక్కించుకుంది. అందరూ తప్పకుండా చూడాల్సిన చిత్రమిది. విష్ణు ఈ మూవీ కోసం చాలా కష్టపడ్డారు. ఇది అతని డ్రీమ్ ప్రాజెక్ట్. ఇది తరతరాలు నిలిచిపోయే సినిమా అవుతుంది అని అన్నారు. అర్పిత్ రంకా మాట్లాడుతూ, 'కన్నప్ప' కోసం మూడేళ్లుగా విష్ణు, మోహన్ బాబుతో ప్రయాణిస్తున్నాను. వారిని ఎప్పుడూ కూడా ఇంత సంతోషంగా చూడలేదు. అక్కడే మా 'కన్నప్ప' ఎంత సక్సెస్ అయిందో అర్థం అవుతోంది. చాలా నెగెటివిటీని వారు ఎదుర్కొన్నారు. మహాదేవుడు ఎన్నో కష్టాలు పెడుతుంటాడు. కానీ చివరకు ఇలాంటి విజయాన్ని అందిస్తారు. ఈ మూవీ క్లైమాక్స్ చూసి అందరూ ఏడ్చేస్తున్నారు. ఇలాంటి చిత్రాలు అరుదుగా వస్తాయి. అందరూ కన్నప్ప మూవీని చూడండి అని అన్నారు. శివ బాలాజీ మాట్లాడుతూ, 'కన్నప్ప'కి వస్తున్న ప్రేమను చూస్తే నాకు మాటలు రావడం లేదు. విష్ణు ఈ మూవీ కోసం చాలా కష్ట పడ్డారు. తల్లి దండ్రులంతా పిల్లలకు ఇలాంటి చిత్రాలను చూపించాలి అని అన్నారు.

**సినీ అభిమానులు** ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రకటన వచ్చేసింది. భారతీయ సినిమా చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రాలలో ఒకటైన 'హరి హర వీరమల్లు' ట్రైలర్ ను జూలై 3వ తేదీన విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మునుపెన్నడూ చూడని శక్తివంతమైన చారిత్రక యోధుడు వీరమల్లు పాత్రలో కనువిందు చేయనున్నారు. మొఘల్ శక్తిని ధిక్కరించిన ఓ ధైర్యవంతుడి ప్రయాణాన్ని ఈ చిత్రంలో చూడబోతున్నాం.

క్రిష్ జాగర్లమూడి నుంచి 'హరి హర వీరమల్లు' చిత్ర దర్శకత్వ బాధ్యతలు అందుకున్న దర్శకుడు ఎ.ఎం. జ్యోతి కృష్ణ.. వెండితెరపై అద్భుతాన్ని సృష్టించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు. తుది మెరుగులు దిద్దుకుంటున్న ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి కూడా తన సహకారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగించడమే లక్ష్యంగా పని చేస్తూ.. ప్రతి ఫ్రేమ్ విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది చిత్ర బృందం. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన నాలుగు గీతాలకు విశేష స్పందన లభించింది. 'మాట వినాలి', 'కొల్లగొట్టినాదిరో', 'అసుర హననం', 'తార తార' గీతాలు ఒక దానిని మించి మరొకటి శ్రోతలను మెప్పించాయి.

బాబీ డియోల్, నిధి అగర్వాల్‌తో పాటు ఎందరో ప్రముఖ నటీనటులు 'హరి హర వీరమల్లు'లో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జ్ఞాన శేఖర్ వి.ఎస్., మనోజ్ పరమహంస ఛాయాగ్రాహకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ కళా దర్శకుడు తోటతరణి నభూతో నభవిష్యతి అన్నచందాన అద్భుతమైన సెట్‌లను రూపొందించారు. ప్రతిభగల సాంకేతిక బృందం సహకారంతో ఈ చిత్రం ఒక దృశ్య కావ్యంగా రూపుదిద్దుకుంటోంది.

## జులై 3న 'హరి హర వీరమల్లు' ట్రైలర్ విడుదల



ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న 'హరి హర వీరమల్లు' చిత్రం జూలై 24వ తేదీన తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. చారిత్రాత్మక నేపథ్యంలో అద్భుతమైన నాటకీయత, శక్తివంతమైన ప్రదర్శనలు, ఉత్కంఠభరితమైన యాక్షన్‌తో'హరి హర వీరమల్లు' చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతుందని చిత్ర బృందం ఎంతో నమ్మకంగా ఉంది.తారాగణం: పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్, బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నరా ఫతేహి. దర్శకత్వం: జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి, నిర్మాత ఎ.దయాకర్ రావు, సమర్పణ: ఎ. ఎం.రత్నం, బ్యానర్: మెగా సూర్య, ప్రొడక్షన్స్, సంగీతం: ఎం.ఎం. కీరవాణి,ఛాయాగ్రహణం: మనోజ్ పరమ హంస, జ్ఞాన శేఖర్, వి.ఎస్, కూర్పు: ప్రవీణ్ కె.ఎల్, సాహిత్యం: సిరివెన్నెల సీతారామశాస్త్రి, చంద్రబోస్, పెంచల్ దాస్,

## సినిమాల్లోకి రావాలనుకునే వారికోసం 'దిల్ రాజు డ్రీమ్స్': విజయ్ దేవరకొండ

**ఇండస్ట్రీలోకి** రావాలనుకునే కొత్తవారికి సరైన వేదిక అవుతుందనే ఆలోచనతో దిల్ రాజు డ్రీమ్స్ వెబ్‌సైట్‌ని లాంచ్ చేస్తున్నాం కొత్త దర్శకులు, కొత్త నిర్మాతలు, ఆర్టిస్టులు టెక్నీషియన్స్‌కి ఇండస్ట్రీలోకి రావాలని ఉంటుంది. వాళ్లకి సరైన గైడెన్స్ ఉండదు. అలాంటప్పుడు ఏం చేస్తే బాగుంటుందని వచ్చిన ఆలోచనే ఈ దిల్ రాజు డ్రీమ్స్. దిల్ రాజు డ్రీమ్స్ వెబ్ సైట్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరై వెబ్ సైట్‌ని లాంచ్ చేశారు.




'దిల్ రాజు డ్రీమ్స్' లాంచింగ్ ఈవెంట్‌లో రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, 13 ఏళ్ల క్రితం పొద్దున లేచిన వెంటనే డాట్ కామ్ అనే వెబ్సైట్‌ని ఓపెన్ చేసే వాడిని. ఎక్కడైనా కాస్టింగ్ కాల్స్ ఉన్నాయా అని చెక్ చేసుకునే వాడిని. ఆ రోజుల్లో ఇంత ఇంటర్నెట్, సోషల్ మీడియా లేదు. శేఖర్ కమ్ముల లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సినిమా కాస్టింగ్ కాల్ అందులో చూడడం నాకు ఇంకా గుర్తుంది. దానికి అప్లై చేశాను. దాదాపు 6 నెలలు టెన్షన్ పడ్డాను. ఆ టెన్షన్ కూడా ఒక తృప్తిని ఇచ్చేది. ఒక ప్రయత్నం చేస్తున్నాం. ఒక ఆపర్చునిటీ ఉందనే ఆనందం ఉండేది. 16 వేల అప్లికేషన్స్ ఆ సినిమాకి వచ్చాయి. 11 మందిని సెలెక్ట్ చేశారు. అందులో నేను ఉన్నాను. ఆ సినిమా నా జీవితంలో పెద్ద రోల్‌ని ప్లే చేసింది. దిల్ రాజు డ్రీమ్స్‌ని దిల్ రాజుకి ఎందుకు లాంచ్ చేయాలని అనిపించిందో నాకు తెలియదు కానీ ఇది లక్షలాది మందికి ఒక హోప్‌ని ఇచ్చింది. అప్లై చేసిన ప్రతి ఒక్కరికి బెస్ట్ ఆఫ్ లక్. ఇందులో ఒక్కరి కల నెరవేరినా ఈ వెబ్సైట్ లాంచ్ చేయడానికి న్యాయం జరిగినట్టే. ఐదేళ్ల తర్వాత మీలో కూడా ఎవరో ఒకరు ఇలా స్టేజ్ మీద నిలబడి దిల్ రాజు డ్రీమ్స్ ద్వారా తమ డ్రీమ్‌ని నెరవేర్చుకున్నామని చెప్తే చాలా ఆనంద పడతాను. ఇంత అద్భుతమైన ప్లాట్ ఫామ్ క్రియేట్ చేసిన దిల్‌రాజుకి అభినందనలు అన్నారు. రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ, ఒక క్రియేషన్ ఒకరి కల. ఆ కలని సాకారం చేసుకోవడానికి సపోర్ట్ చేసేవారికంటే నిరుత్సాహపరిచే వారు ఎక్కువ మంది ఉంటారు. అయితే మన పక్కనున్న వాళ్ళు మనల్ని నిరుత్సహపరిస్తే మనలో ఒక ఫైర్ రావాలి. ఎంతమంది నిరుత్సాహపరిచినా మీ కలని మీరు నమ్మితే ముందడుగు వేసుకుంటూనే వెళ్ళండి. దానికి బిగ్గెస్ట్ ఎగ్జాంపుల్ దిల్ రాజు, శిరీష్, విజయ్ దేవరకొండ. మన కలని మన లక్ష్యాన్ని మనమే నమ్మాలి. మీ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. దిల్ రాజు డ్రీమ్స్ అనేది ఒక అద్భుతమైన వేదిక. యాక్టర్స్ డైరెక్టర్స్ టెక్నీషియన్స్‌తో పాటు ప్రొడ్యూసర్స్‌కూడా ఒకకాలమ్ కేటాయిం చడం గొప్ప విషయం. ఇది మీ అందరికీ ఒక గొప్ప ఫ్లాట్ ఫామ్. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్ అన్నారు.

ప్రొడ్యూసర్ శిరిష్ మాట్లాడుతూ, ఇంతమందిని ఆశీర్వదించడానికి వచ్చిన దేవిశ్రీ ప్రసాద్‌కి, విజయ్ దేవరకొండకి థాంక్యూ. ఇక్కడికి ఎంతోమంది టాలెంట్ ఉన్న వాళ్ళు వచ్చారు. మీ ట్యాలెంట్‌తో ఎదిగిన తర్వాత ఇండస్ట్రీని మర్చిపోవద్దు. ఇది ప్రామిస్ చేసి ఎంటర్ అవ్వండి. మీరు సక్సెస్ అవుతారు. థాంక్యూ అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, విజయ్, దేవి థాంక్యూ. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ మీద దిల్ సినిమా తర్వాత ఎంతోమంది కొత్త దర్శకుల్ని లాంచ్ చేసాం. వాళ్ళు ఈరోజు సక్సెస్ఫుల్ డైరెక్టర్స్‌గా ఇండస్ట్రీలో ఉన్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో 57 సినిమాలు పూర్తయ్యాయి. నేను, శిరీష్ కథ విని బాగుందన్న తర్వాతనే స్క్రిప్ట్ నెక్స్ట్ లెవెల్‌కి వెళుతుంది.హర్షిత్ హన్సిత దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్ పెట్టి బలగం వేణుతో పాటు నలుగురు కొత్త దర్శకుల్ని పరిచయం చేశారు. వాళ్లు కూడా కొత్త దర్శకులతో అన్ని రకాల సినిమాలు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త దర్శకులు కొత్త నిర్మాతలు ఆర్టిస్టులు టెక్నీషియన్స్ ఇండస్ట్రీ ఇండస్ట్రీలోకి రావాలని ఉంటుంది. వాళ్లకి సరైన గైడెన్స్ ఉండదు. అలాంటప్పుడు ఏం చేస్తే బాగుంటుందని వచ్చిన ఆలోచన ఈ దిల్ రాజు డ్రీమ్స్. దిల్ డ్రీమ్స్ సంస్థని ఒక యంగ్ జనరేషన్ టీంతో ఫామ్ చేసాము. చాలామంది నిర్మాతలుగా రావాలనుకుంటారు. వాళ్ళు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు గాని సినిమాని ఎలా మొదలు పెట్టాలి ఎలా కంప్లీట్ చేయాలో క్లారిటీ ఉండదు. కొంతమంది సినిమా తీశాము వీడియో చూడండి అని చూపిస్తుంటారు. సినిమా తీయడం ముఖ్యం కాదు సినిమాని తీసి ప్రేక్షకులు దగ్గరికి తీసుకెళ్లడం పెద్ద టాస్క్, అందరికీ సినిమాల్లోకి రావాలని పాషన్ వుంది. కానీ రైట్ ఫ్లాట్ ఫామ్ వాళ్లకి దొరకదు. అలాంటి రైట్ ఫ్లాట్ ఫామ్‌ని క్రియేట్ చేయడానికి దిల్ రాజు డ్రీమ్స్ వెబ్సైట్ లాంచ్ చేస్తున్నాం. సినిమాలోకి రావడం ఇక్కడ రాణించడం అంత ఈజీ కాదు. వందమంది దర్శకులు కావాలని ప్రయత్నిస్తే అందులో ఐదు మందికి ఛాన్స్ వస్తుంది.ఒకరు హిట్ సినిమా తీస్తారు. అంటే ఇక్కడ సక్సెస్ అనేది అది మీరు దృష్టిలో పెట్టుకోవాలి. సినిమా కోసం మీరు చేస్తున్న వర్క్‌ని విడిచిపెట్టకండి. సినిమా వల్ల మన ఫ్యామిలీ ఎఫెక్ట్ అవ్వకూడదు. మేము కూడా ఇక్కడ స్ట్రగుల్స్ పడ్డాం. అయితే వదలకుండా ప్రయత్నించాం. సాధించాం. నిజానికి సినిమా ఇండస్ట్రీలో మనం రాణించగలుగుతామా లేదా అనేది మీకే తెలియాలి. మీపై మీకు నమ్మకం ఉండాలి. సినిమా అనేది ఒక అట్రాక్షన్. అది లాగుతుంటుంది. జీవితాలు మీద ఇంపాక్ట్ పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీదే. ఎప్పుడైతే మీరు సినిమాలో సక్సెస్ అవుతున్నారని మీకు అర్థం అవుతుందో అప్పుడు మీరు 24 గంటలు కష్టపడాలి. సినిమా అంటేనే హార్డ్ వర్క్. 'దిల్‌రాజు డ్రీమ్స్' ద్వారా మేము ఒక ఫ్లాట్‌ఫామ్ క్రియేట్ చేస్తున్నాం. దీనికి మీరు అప్లికేషన్స్ ఇవ్వచ్చు. దానిలో టీమ్ స్క్రూటినీ చేసి మెజారిటీ పీపుల్ లైక్ చేసిన తర్వాత మా దగ్గర పంపిస్తారు. మేము టైం స్పెండ్ చేసి దాన్ని ఒకే చేస్తాము. కానీ చాలామంది రిజెక్ట్ అవ్వచ్చు. అంతమాత్రాన నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు. మీలో కాన్ఫిడెన్స్‌ని దృష్టిలో పెట్టుకొని మీరు ప్రయత్నిస్తూనే ఉండాలి. అప్పుడే సక్సెస్ వస్తుంది. 'దిల్ రాజు డ్రీమ్స్' లో ఒక ప్రొడ్యూసర్ కాలమ్ కూడా పెడుతున్నాం. ఈవెంట్‌కి రావడానికి పదివేల రిజిస్ట్రేషన్ వచ్చాయి. వరల్డ్ వైడ్‌గా లక్ష నుంచి రెండు లక్షల మంది సినిమా ఇండస్ట్రీలోకి రావడానికి ఈ ప్లాట్ ఫామ్ ని వాడుకోవడానికి సిద్ధంగా ఉన్నారని నాకు అర్థం అవుతుంది. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్అన్నారు.

**వసంత్, భాగ్యలక్ష్మి,** రమ్య హీరో హీరోయిన్లుగా దర్శకుడు టి.రాము రూపొందిస్తున్న మూవీ అలలు లేని సముద్రం. ఈ చిత్రాన్ని ప్రొడ్యూసర్ రాం రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. శనివారం సాయంత్రం హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో అలలు లేని సముద్రం సినిమా ట్రైలర్‌ను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా వచ్చిన నిర్మాత బాలాజీ నాగలింగం మాట్లాడుతూ, దర్శకుడు రాము నాకు బాగా పరిచయం. ఆయన ఈ సినిమా చేస్తున్నానని చెప్పినప్పుడు ఇండస్ట్రీలో చిన్న చిత్రాలకు పరిస్థితులు అంత బాగా లేవని చెప్పాను. అయినా పట్టుదలగా ఆయన మూవీ రూపొందించారు. అలలు లేని సముద్రం మూవీ ట్రైలర్ బాగుంది. ఈ సినిమాకు

## 'అలలు లేని సముద్రం' ట్రైలర్ లాంచ్



నా వంతు సపోర్ట్ చేస్తా. అన్నారు. అతిథిగా వచ్చిన వేణు మాధవ్ మాట్లాడుతూ అలలు లేని సముద్రం సినిమా ట్రైలర్ చాలా బాగుంది. సముద్రం అంటే అలలు ఉండాల్సిందే. అలలు లేకుండా సముద్రం ఎలా ఉంటుందో ఈ సినిమాలో దర్శకుడు చూపించబోతున్నారు. అన్నారు. నటి రోజారాణి మాట్లాడుతూ, అలలు లేని సముద్రం సినిమాలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో పనిచేస్తున్నప్పుడు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా దర్శకుడు రాము మేము నటించేలా చేశారు. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు. అతిథిగా వచ్చిన నిర్మాత రామశర్మ మాట్లాడుతూ ఈ రోజుల్లో చిన్న సినిమా నిర్మించడం అంటే కష్టమైన వ్యవహారం. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని దర్శకుడు రాము అలలు లేని సముద్రం సినిమాను రూపొందించాడు. ఈసినిమా టీమ్ అందిరకీ సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నా అన్నారు. అతిథిగావచ్చిన కర్నూలు జిల్లా బిజెపి నాయకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ, నేనూ ఆర్టిస్టు అవ్వాలనే కలగన్నాను. అయితే క్రమంగా పాలిటిక్స్ వైపు వచ్చాను. దర్శకుడు రాము సినిమా మీద ప్యాషన్ ఉన్న వ్యక్తి. ఆయనతో నేను త్వరలోనే ఓ సినిమా నిర్మించబోతున్నాను. మంచి కథ తయారు చేసుకోమని చెప్పానుఅన్నారు. దర్శకుడు టి.రాము మాట్లాడుతూ, అలలు లేని సముద్రం సినిమా ట్రైలర్ లాంచ్‌కు వచ్చిన మిత్రులు అందరికీ థ్యాంక్స్. మీరంతా నా బలం. మా మూవీ ట్రైలర్ మీ అందరికీ నచ్చిందనే అనుకుంటున్నాను. సినిమా కోసం మా టీమ్ బాగా సపోర్ట్ చేశారు. నా మీద మా నిర్మాత రాంరెడ్డి పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతాను. ఆయన ఈ రోజు ట్రైలర్ లాంచ్‌కు రాలేకపోయారు. ప్రస్తుతం మా మూవీ చిత్రీకరణ దశలో ఉంది. అక్టోబర్, నవంబర్‌లో చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం అన్నారు.




## 'జిగ్రీస్' క్రేజీ ఫస్ట్ లుక్ విడుదల



**కృష్ణ బురుగుల,** ధీరజ్ అథేర్య, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో మౌంట్ మెరు పిక్చర్స్ ఓ యూత్‌ఫుల్ క్రేజీ ఎంటర్‌టైనర్‌ని నిర్మిస్తోంది. హరిష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ వోడపల్లి నిర్మాత. ఈ చిత్రానికి "జిగ్రీస్" అనే క్రేజీ టైటిల్ ఖరారు చేశారు. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా జిగ్రీస్ టైటిల్, ఫస్ట్ లుక్‌ని లాంచ్ చేసి టీంకి ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో ఒక వింటేజ్ మారుతీ 800 కారు పక్కన నిలబడ్డ నలుగురు ఫ్రెండ్స్‌నిపై నుంచి చూపించడం ఇంట్రస్టింగ్‌గా ఉంది. బోల్డ్ ఆరెంజ్ బ్యాక్‌డ్రాప్, గ్రిట్టీ టైటిల్ టైపోగ్రఫీ, సినిమా ఎంత అడ్వెంచరస్‌గా ఉండబోతోందో తెలియజేస్తోంది. ఈ ఫస్ట్ లుక్, టైటిల్ సోషల్ మీడియాలో మంచి బజ్ క్రియేట్ చేసింది. జిగ్రీస్ చైల్డ్‌హుడ్ ఫ్రెండ్షిప్, నాస్టాల్జియా, క్రేజీ అడ్వెంచర్స్, హిలేరియస్ రోడ్ ట్రిప్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ఈశ్వరాదిత్య డీవోపీ, కమ్రాన్ మ్యూజిక్, చాణక్య రెడ్డి ఎడిటర్. త్వరలోనే మరిన్ని వివరాలు మేకర్స్ తెలియజేస్తారు.

## 'ది పారడైజ్' హైదరాబాద్ షెడ్యూల్‌లో జాయిన్ అయిన నాని



**నేచురల్ స్టార్ నాని** తన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'ది పారడైజ్'లో అడుగుపెట్టారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సినిమాస్ సుధాకర్ చెరుకూరి ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని భారీగా నిర్మిస్తున్నారు. దసరా బ్లాక్ బస్టర్ తర్వాత నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రం కోసం మరోసారి చేతులు కలిశారు. జూన్ 21న షూటింగ్ ప్రారంభమైంది. నాని ఈరోజు సెట్స్‌లో అడుగుపెట్టారు. వారం పాటు సాగిన కీలకమైన చైల్డ్ వుడ్ సన్నివేశాల షూటింగ్‌తో సినిమా జర్నీ ప్రారంభమైంది. ఇప్పుడు నాని ఎంట్రీ ఇచ్చారు "ధగడ్ ఆగయా!" అంటూ అమేజింగ్ అనౌన్స్‌మెంట్‌తో లుక్ రిలీజ్ చేశారు. ఈ 40 రోజుల హైదరాబాద్ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంతో కూడిన పవర్‌ఫుల్ సన్నివేశాలు షూట్ చేయనున్నారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన గ్రాండ్ సెట్స్‌లో షూటింగ్ జరగనుంది. 'దసర'సినిమా పాన్ ఇండియా అదరగొట్టింది. 'ది పారడైజ్' గ్లోబల్ లెవెల్‌కు వెళ్లబోతోంది. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ 8 భాషలలో విడుదల కానుంది. టైటిల్ పోస్టర్, గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు పెరిగాయి. ముఖ్యంగా గ్లింప్స్‌లో ఉన్న పవర్‌ఫుల్ డైలాగ్, విజువల్స్, రాక్‌స్టార్ అనిరుధ్ రవిచంద్రన్ మ్యూజిక్, నాని స్ట్రాంగ్ ఎంట్రీ ఇవన్నీ సినిమా పై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. మార్చి 26, 2026న 'ది పారడైజ్' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని మేకర్స్ మరోసారి అనౌన్స్ చేశారు.

## ఎయిర్: 'ఆల్ ఇండియా ర్యాంకర్స్' పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుంది: హీరో శివాజీ



**సందీప్ రాజ్** షో రన్నర్‌గా హర్ష రోషన్, భాను, జయతీర్థ ప్రధాన పాత్రల్లో జోసెఫ్ క్లింటన్ దర్శకత్వం వహించిన వెబ్ సిరిస్ 'ఎయిర్: ఆల్ ఇండియా ర్యాంకర్స్'. జూలై 3 నుంచి సిరీస్ ఈటీవి విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. హీరోలు శివాజీ, సుహాస్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో శివాజీ మాట్లాడుతూ, చదువు అనేది చాలా అవసరం.' ఆల్ ఇండియా ర్యాంకర్స్' ఈ టైటిల్ వినగానే ఈటీవీలో 90కి మించి మరో పెద్ద బ్లాక్ బస్టర్ సిరీస్ రాబోతుందని నాకు అనిపించింది. ఎందుకంటే ప్రతి ఒక్కరూ దీనికి కనెక్ట్ అవుతారు. చదువు అనేది నేచురల్‌గా చదవాలి. కేవలం ర్యాంక్స్ కోసం చదవడం అనేది ఒక రకమైన హింస. ఈ సిరీస్ అలాంటి తల్లిదండ్రులకి ఒక గుణపాఠం కావాలి. ఈటీవీ విన్ కొత్తరకంగా కథల్ని చెప్పాలని ప్రయత్నం చేస్తుంది. ఇది కూడా చాలా పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుంది. అందరికీ థాంక్యుఅన్నారు.

హీరో సుహాష్ మాట్లాడుతూ, ఇందులో పని చేసిన రోషన్ భాను మిషన్ ఇంపాజిబుల్ నుంచి తెలుసు. చాలా మంచి యాక్టర్స్. ఈ సిరీస్‌కి చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు సంజిత్. డైరెక్టర్ జోసెఫ్ కి ఆల్ ది బెస్ట్. ఈటీవీ నుంచి అద్భుతమైన కంటెంట్స్ వస్తున్నాయి.ఈ సిరీస్ కోసం నేను ఎంతో ఈగర్‌గా ఎదురు చూస్తున్నాను అన్నారు.

షోరన్నర్ సందీప్ రాజ్ మాట్లాడుతూ, జోసెఫ్ ఈ కథని అద్భుతంగా చెప్పాడు. ఈ కథ వినగానే ఇందులో భాగమవాలనిపించింది. చాలా అద్భుతమైన జర్నీ ఇది. అందరికీ కనెక్ట్ అయ్యే కంటెంట్ ఇది. ఈ ప్రాజెక్టులో భాగమైన ప్రతి యాక్టర్‌కి టెక్నీషియన్స్‌కి థాంక్యూ. ఇంట్లో ఫ్యామిలీతో కలిసి చూడండి. చాలా ఎంజాయ్ చేస్తారుఅన్నారు .

డైరెక్టర్ జోషెఫ్ మాట్లాతూ శివాజీకి, సుహాస్‌కి సందీప్‌కి థాంక్యూ. నా స్క్రిప్ట్ విని నన్ను బిలీవ్ చేసిన సాయి నితిన్ సందీప్‌కి థాంక్యూ. మీ అందరికీ ట్రైలర్ నచ్చిందని అనుకుంటున్నాను. ఈటీవీ విన్లో జులై3న తప్పకుండా చూడండి అన్నారు. ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టుకి కాంట్రిబ్యూట్ చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఇంకో హిట్ కొడతాం. ఇంకో సక్సెస్ మీట్‌లో మళ్ళీ మాట్లాడదాం అన్నారు. ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ మాట్లాడుతూ, ఆల్ ఇండియన్ ర్యాంకర్స్ అద్భుతమైన విజయం సాధించబోతుంది. సందీప్‌రాజు, సుహాస్ మా అందరికీ ఒక ఇన్స్పిరేషన్. యూట్యూబ్లో క్రియేటివ్ కంటెంట్ చేసి డైరెక్టర్స్, స్టార్స్ కావచ్చుని నిరూపించారు. ఎంతోమందికి ఇన్స్పిరేషన్ ఇచ్చారు. జోసెఫ్ ఈ ప్రాజెక్టుని అద్భుతంగా తీర్చిదిద్దాడు. తనకి చాలా మంచి ఫ్యూచర్ ఉంటుంది. ఇందులో నటించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. తప్పకుండా ఫ్యామిలీతో కలసి చూడండి చాలా ఎంజాయ్ చేస్తారుఅన్నారు.

యాక్టర్ హర్ష రోషన్ మాట్లాడుతూ, అందరికి నమస్కారం.సుహాస్, శివాజీకి థాంక్యూ. ఈ ప్రాజెక్టులో పార్ట్ కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకి థాంక్యూ. ఈ సినిమాల్లో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు .ఈ ప్రాజెక్టును చాలా ఎంజాయ్ చేసాం. ఆల్ ఇండియన్ ర్యాంకర్స్ అందరికీ కనెక్ట్ అవుతుంది. కామెడీ ఎమోషన్స్ అన్నీ ఉన్నాయి. కచ్చితంగా మీ అందరికీ నచ్చుతుంది అన్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో టీం అందరూ పాల్గొన్నారు.

# మహిళా కేడెట్‌లకు ఆమె స్ఫూర్తి..




సృష్టి దక్ష నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ) చరిత్రలో తనకంటూ ప్రత్యేక పేజీ రాసుకుంది. ఎన్డీఏ 148వ స్నాతకోత్సవంలో బీఏ డిగ్రీ 59మంది పట్టా పొందగా వారిలో టాపర్‌గా విజయం సాధించింది. చదువులోనే కాదు ఇతర విభాగాల్లోనూ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి అంకితభావం, పట్టుదల, ప్రతిభకు లింగ వేదం ఉండదని నిరూపించింది. 'మిలిటరీ శిక్షణ, చదువు తర్వాత అయినా బ్యాలెన్స్ చేసుకోవడం కఠినమైన సవాలుగా ఉంది. అయినా మొదటి సెమిస్టర్ నుంచీ సమ ప్రాధాన్యత ఇచ్చి అంకితభావంతో పనిచేశాను.

అదే నన్ను క్లాస్‌లో ముందుండేలా చేసింది అని చెప్పే సృష్టి పదో తరగతిలో 95 శాతం ఇంటర్మీడియట్‌లో 98 శాతం మార్కులతో పాసైంది. సృష్టి తండ్రి వింగ్ కమాండర్(రిటైర్డ్) యోగేష్ కుమార్ ఆయన ఎన్డీడిఏ కేడెట్ శిక్షణలో ఉన్నారు. తీసుకున్న హంటర్ స్క్వాడ్రన్‌నే తనూ ఎంపికచేసుకుంది. 'హంటర్ స్క్వాడ్రన్‌లో చేరతానన్నప్పుడు ఎంతో గర్వంగా ఫీలయ్యా కానీ దానికున్న ఘనమైన చరిత్రను గుర్తుచేసి శారీరక శిక్షణ కఠినంగా ఉంటుందని చెప్పా కానీ ఆమె అందరినీ అధిగమించడమే కాదు, నాకంటే 'ఎక్కువ ప్రశంసలు అందుకుంది' అంటూ ఆనంద బాష్పాలు రాల్చారు యోగేష్. ఎన్డీడిఏలో చేరాలనుకుంటున్నట్టు సృష్టి చెప్పినప్పుడు ఆమె నోయిడా3లోని ఒక మైదానానికి తీసుకెళ్లి కొన్ని రౌండ్లు పరిగెత్తమన్నారట యోగేష్. అప్పటికి ఆమె ఫిట్‌నెస్ అంత గొప్పగా లేదు. కానీ కొద్ది వారాల్లోనే ఎంతో మెరుగుపడింది. మూడేళ్ల కిందట తొలిసారిగా ఎన్‌డిఏలో లో చేరడానికి మహిళల్ని అనుమతించారు. 17 మంది మహిళా కేడెట్‌లు తొలి బ్యాచ్‌లో శిక్షణ ముగించుకుని తాజాగా పట్టా అందుకున్నారు. త్వరలో వీరంతా సైనికులతో చేరనున్నారు. భవిష్యత్తులో మరింత మంది అమ్మాయిలు ఎన్‌డిఏలో చేరేందుకు సృష్టి, ఇతర మహిళా కేడెట్‌లు స్ఫూర్తిగా నిలుస్తారనడంలో సందేహం లేదు.

**చెలి చిట్కా**

★ మిక్సీలో ఎండుద్రాక్ష వేసేటపుడు కొద్దిగా నిమ్మరసం కలిపితే ద్రాక్షలు బ్లేడ్‌కు అంటుకోకుండా వుంటాయి.
★ కొత్తమీర పొడికి కొద్దిగా ఉప్పు నిల్వవుంచితే ఎక్కువ కాలం తాజాగా వుంటుంది.
★ అమ్లేట్ లావుగా రావాలంటే సొన గిలకొట్టాక కొద్దిగా నీరు కలపాలి.

# సంప్రదాయ విధానంతో వ్యాపారం

**ఆరోగ్యం కోసం సేంద్రియ కాయగూరలు, ఆకుకూరల వైపు మొగ్గు చూపుతున్న వారెందరో! అవి మాత్రమే చాలా? వంటకు ఉపయోగించే నూనెలూ స్వచ్ఛమైనవి అయితేనే కదా ఆరోగ్య ప్రయోజనాలు అందేది. ఇదే ఆలోచించారు బొబ్బల జ్యోతి సంప్రదాయ విధాన తీస్తూ ఉపాధినీ అందుకుంటున్నారు.**

భర్త ప్రకృతి వ్యవసాయం చేస్తారు. ఇంట్లో వంటకాలు వాటితోనే అయినా జీర్ణ సంబంధ సమస్యలు తప్పలేదు జ్యోతి కుటుంబానికి అప్పుడే గానుగ నూనెపై అవగాహన వచ్చిందామెకు. అయితే వాటిని తన కుటుంబానికే కాదు, ఇతరులకూ అందిస్తే ఉపాధినీ పొందొచ్చు అనుకున్నారు. అందుకే జ్యోతి నేచురల్ ఫార్మింగ్. ఈమెది నల్గొండ జిల్లాలో రాములబండ ఆలోచన రాగానే దాని గురించి తెలుసుకోవడం మొదలుపెట్టారు యంత్రాలతో తీసేవి ఖర్చు ఎక్కువ కాబట్టి సంప్రదాయ పద్ధతిలో ఎద్దులను తిప్పుతూ తీసేందుకు ప్రయత్నించారు. ఇప్పటికీ ఈ ప్రదర్శన వారి వద్దకు వెళ్లి అవగాహన తెచ్చుకున్నారు. ఆపై వసాయంతో చెక్క గానుగలు, రోళ్లు సిద్ధం చేసుకున్నారు. వ్యవసాయ కుటుంబమే కాబట్టి సాగు పనికొస్తుందని 11 ఎద్దులను కొనుగోలు చేశారు. మూడు గ్రామాలకు మూడు ఎద్దులు పనిచేస్తాయి. గంటకోసారి వీటి స్థానాన్ని వేరేవి భర్తీ చేసేలా ప్లాన్ చేసుకున్నారు. పల్లీ, నువ్వులు, కొబ్బరి.. నుంచి నూనె తీశాక వచ్చే పిట్టు వంటివి ఎద్దులకే దాణాగా పెడతారు దీంతో వాటికీ ఆరోగ్యకరమైన ఆహారం. జ్యోతి ఇంటర్ కూడా పూర్తిచేయలేదు. ఇద్దరు చిన్నపిల్లలు చూసుకుంటూనే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఉదయం నాలుగింటికే లేచి పనులన్నీ చకచకా పూర్తిచేసు కొని ఏడింటికలా నూనె పరిశ్రమకి వస్తారు. సాయంత్రం ఆరింటివరకూ ఇక్కడే ఎదులను శుభ్రం చేయడం, రాజా, నీరు పెట్టడం.. ఎద్దులను శుభ్రం చేయడం, దాణా, నీరు పెట్టడం, ఎద్దుమోపుపై చెక్క గానుకను బిగించి తిప్పడం.. వంటివన్నీ పనివాళ్లతోపాటు ఆమె కూడా చేస్తారు. చెక్క గానుగను బిగించి తిప్పడం. వంటివన్నీ పనివాళ్లతోపాటు ఆమె కూడా చేస్తారు.



**రూ. 30 లక్షల వ్యాపారం ..**

73 కిలోల పల్లీలకు 55 లీటర్ల నూనె వస్తుంది. దీన్ని మూడుగంటలకు పైగా ఎండలో ఉంచుతాం. అప్పుడు తెట్టులా తేలుతుంది దాన్ని తొలగించి, సీసాలలో పోసి నూనె అమ్ముతాం దీనికోసం రెండు గంటల పాటు దాదాపు వందల సార్లు ఒక ఎద్దు గానుగ చుట్టూ తిరుగుతుంది. ఎద్దును అదుపు చేయడానికి ఈ యంత్రం మీద నేనూ కూర్చుంటా. ఎండ వేడికి తోడు ఎద్దుతో పాటు గుండ్రంగా తిరగడంతో కళ్లు తిరిగి పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. నెమ్మదిగా అలవాటు చేసుకున్నా అనే జ్యోతి. ఆముదం, కుసుమ, సన్‌ఫ్లవర్, అవిసె, తెల్ల/నల్ల నువ్వులు, ఆవాల నూనెలు సైతం తయారు చేస్తారు. ఏడాదికి దాదాపు రూ.30లక్షలు వ్యాపిస్తున్నారు. మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు.

# సువాసన రోజ్‌మేరీ !



సన్నటి ఈనెల్లాంటి ఆకులతో ..

**గాఢమైన పరిమళాన్ని పంచే మొక్క రోజ్‌మేరీ. మధ్యధరా వంటకాల్లో ఎక్కువగా వాడే ఈ ఆకులకు, కొమ్మలకు ఆరోగ్య ప్రయోజనాలెక్కువట. అందుకే వీటితో చేసే హెర్బల్‌టీ తాగమంటున్నారు పోషకాహార నిపుణులు.**

★ తాజా రోజనమేరీ ఆకులతోపాటు ఎండిన వాటతో టీ తయారు చేసుకుని తాగొచ్చు. ఇందులోని యంటీ ఆక్సిడెంట్లు, ఫాలీఫెనాల్స్.. జీర్ణశక్తికి తోడ్పడి ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. అజీర్తి, ఉబ్బరం, గ్యాస్ వంటివి అదుపు చేస్తాయి. జీవక్రియల్ని వేగాన్ని పెంచుతాయి. అంతేకాదు, అతిగా తినే అలవాటుతో పాటు బరువుని తగ్గించే గుణాలూ దీనికి ఉన్నాయి. ★ రోజ్‌మేరీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా వీటిల్లోని రోస్మరినిక్ యాసిడ్, కార్నోసిక్ యాసిడ్ చాలా శోక్తిమంతమైనవి. ఇవి శరీరానికి హానికలిగించే ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. దాంతో వ్యాధుల ముప్పు తగ్గుతుంది. ఈ మూలికా మొక్కలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికం. ఒంట్లోనివాపుల్నీ, కీళ్లు, కండరాల నొప్పుల్ని తగ్గించే సుగుణాలు ఇందులో ఉన్నాయి. నొప్పుల్నీ నియంత్రిస్తాయి. ★. మనసు అలజడిగా ఉన్నప్పుడో, పని ఒత్తిడితో అలసటగా అనిపించి నప్పుడో ఓ కప్పు రోజ్‌మేరీ చాయ్ తాగి చూడండి. ఎంత హాయిగా ఉంటుందో! ఇందులో పుష్కలంగా ఉండే థయామిన్ నరాల పనితీరుని మెరుగుపరు స్తుంది. హాయిగా నిద్రా పడుతుంది.

# కురులు వేగంగా పెరగాలా?

పుట్టు కుచ్చులా అందంగా, పొడవుగా ఉండే కురులు.. కోరుకోని అమ్మాయి ఉంటుందా? కానీ ఈ కాలుష్యానికి ఊడటమే కానీ పెరగడం ఎక్కడుంది? ఈ చిన్న చిట్కాలను పాటిం చండి. వేగంగా పెరుగుతాయి అంటున్నారు నిపుణులు. అవేంటో చూద్దామా?



తల ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ దాన్ని శుభ్రం చేయడం తప్పని సరి. కానీ ఆరబెట్టడమే పెద్ద పని. అందుకే చాలామంది డ్రైయ్యర్‌ని వాడుతుంటారు. కానీ దాని వేడి కురుల పెరుగు దలను అడ్డుకుంటుందని తెలుసా? స్టైలింగ్, స్టైలింగ్, స్ట్రెయిట్‌నింగ్ కోసం వాడేవే కాదు.. ఎండలో అతిగా తిరగడం, జడను లాగి వేయడం, తువాలుతో తడిపోవాలని కొట్టడం వంటివీ చేటు చేసేవే. వీటికి దూరంగా ఉండండి. కండిషనర్ వెంట్రుకలకు బాగా పడుతుంది. ఇప్పుడైతే చిక్కులు బాగా వస్తాయి. అని తడి తలమీద దువ్వెన ఉపయోగిస్తున్నారా? మేలు చేయడం మాట అటుంచితే కుదుళ్లకు హాని. ఫలితమే కురులు రాలడం. కాబట్టి, తడి వెంట్రుకలు ఆరేవరకూ ఆగండి. తరవాతే దువ్వండి. ఒకప్పుడు సమస్యేదైనా నిపుణులను సంప్రదించేవారు. మరి ఇప్పుడు? అరచేతిలోనే సమాచారం. దాని సలహాతో ఇష్టారీతిన సప్లిమెంట్లను వాడేస్తున్నారు. మీదీ అదే ధోరణా? ఇవి మేలు చేయకపోగా చేటు చేస్తాయి. వాటి ప్రభావం తొలుత పడేది చర్మం, కురులపైనే! నిపుణుల సలహా లేనిదే వాడకపోవడమే మేలు. త్వరగా పెరగవు అని చాలామంది కురులను కత్తిరించడానికి వెనకాడతారు. కానీ రెండు నెలలకో సారైనా ట్రిమ్ చేసుకోవాలి. చిట్లడం, చివర్లు పొడిబారడం కూడా కురుల పెరుగుదలకు అవరోధంగా మారతాయి. కాబట్టి, వాటిని తొలగించడం తప్పనిసరి. జిడ్డు, సమయం లేదని బద్ధకించక వారానికి రెండుసార్లు గోరువెచ్చని నూనెతో తలకు మర్దనా చేయండి. మాడుకి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. అలాగే కండిషనర్ వాడకం కూడా తప్పనిసరి. ఇది వాతావరణ పరిస్థితుల నుంచి కురులకు సంరక్షిస్తుంది. దిండు కూడా కేశాల పెరుగుదలపై ప్రభావం చూపుతుందని తెలుసా? సరైన గలేబులను వాడకపోతే అవి కురుల్లోనే సహజ నూనెలను పీల్చేయడమే కాదు, రాపిడికి గురిచేసి వెంట్రుకలు తెగేలానూ చేయగలవు. కాబట్టి, శాటిన్ రకాలనే ఎంచుకోండి. చిన్నవే కదూ.. అందమైన, ఆరోగ్యకరమైన కురుల కోసం పాటించండి మరి.

# మసాజ్ మంచిదే !

ముఖం మీద స్క్రబ్ రాసుకోవటం మంచిదే. దీనివల్ల మృత కణాలు తొలగి పోతాయి. ముఖ్యంగా దుమ్ము, ధూళి కారణంగా ముఖం మీద అట్టకట్టిన ట్లుంది. దీనివల్ల సిబం ఉత్పత్తి అయి చర్మం జిడ్డుగా మారి రకరకాల సమస్యలు వస్తాయి. అందుకే స్క్రబర్స్‌తో ముఖాం రుద్దుకోవాలి. స్క్రబ్ చేసే ముందు కచ్చితంగా ముఖాన్ని గోరు వెచ్చటి నీటితో కడిగేయాలి. ఆ తర్వాత మెత్తని టవల్‌తో తుడుచుకోవాలి. ఇలా స్మూత్‌గా ఉన్నప్పుడే స్క్రబ్ చేసుకోవాల్సి ఉంటుంది. బొప్పాయి స్క్రబ్, గ్రీన్ టీ స్క్రబ్, కోకనట్-నిమ్మ స్క్రబ్, కుకుంబర్ మింట్ స్క్రబ్. లాంటి చల్లని స్క్రబ్స్ మాత్రమే ముఖం మీద అప్లై చేయాలి. ఇలా చేయటం వల్ల చర్మం చల్లగా ఉంటుంది. స్క్రబర్స్‌తో మరీ గట్టిగా చర్మాన్ని రుద్దుకూడదు.

# ప్రకృతిలోంచి వచ్చిన అందాలు

కాయలూ, పండ్లూ.. సహజంగానే బోలెడంత అందంగా ఉంటాయి. వాటిని ఇంకాస్త అందంగా పేర్చి, చిన్నచిన్నగా కత్తిరించి.. చెట్టుచేమలుగా, బుజ్జి జీవాలుగా తీర్చిదిద్దితే.. వారెవా.. ఎంత సొగసు, సోయగం! ప్రకృతిలోంచి వచ్చిన ప్రకృతిని చూసి ఆనందించండి.













# భక్తి, ఆచారం

**భక్తి, ఆచారం**

మనమంతా కోరుకునేది ఆనందాన్ని. అందుకు మన శ్శాంతినిచ్చే పూజలూ,ఉపవాసాలూ ఎంతగానో తోడ్పడ తాయి. ఉపవాసం గురించి ఆధ్యాత్మికవేత్తలు మనసు ఎంత నిలకడలేనిదో నాలుక కూడా అంతే చంచలమైంది. అది ఎన్నెన్నో రుచులు కోరుకుంటుంది. ఏవేవో తినాలను కుంటుంది. అలాంటి జిహ్వాచాపల్యాన్ని తగ్గిస్తుంది ఉపవాసం. అంటే కేవలం ఆహారం తీసుకోకపోవ డమే కాదు, పుణ్య దినాల్లో దైవాన్ని స్మరిస్తూ గడపటం. భక్తి పేరుతో అనుసరిస్తున్న ఈ ఆచారం శాస్త్ర ప్రకారమూ మంచిదే. 'ఉపవాసం ఉపకారి' అని మనం గుర్తుంచు కోవాలి. ఉపవాసం శారీరకంగా, మానసికంగా చురుగ్గా ఉండేలా చేస్తుంది. ఉపవాసం పూర్తయ్యాక భక్తిశ్రద్ధలతో దైవాన్ని స్మరించు కోవాలి. తర్వాత.. ఆయా కాలాలకు తగ్గట్టు ఆహారం తీసుకోవాలి. పూర్వ రుషులు కందమూలాలు మాత్రం తిని, సరోవరంలో తేటనీరు సేవించి సంవత్సరాల తరబడి తపస్సు చేసుకునేవారు. ఉపవాసం మంచి దైనప్పటికీ బాలలు, వృద్ధులు, రోగులు అభోజనంగా ఉండకూడదు అంటూ హితవు పలికారు. ఉపవాసం తో తోటివారి ఆకలి బాధ అర్థమవుతుం దనే ఆంతర్యమూ ఉంది. దాంతో అన్న దానం చేయాలనే స్ఫూర్తి కలుగుతుంది. ఇది అత్యుత్తమ దానం. ఆకలితో ఎవరూ తపించ కూడదన్నదే ఉద్దేశం. సాటి మనుషులే కాదు, చుట్టూ ఉన్న మూగజీవాల ఆకలి తీర్చడమూ కర్తవ్యమే. అన్నం మినహా పండ్లు, ఫలహారాలూ అతిగా సేవించడం ఉపవాసం అనిపించుకోదు. ఇది పెద్ద ఉద్దేశానికి ఆటంకమే. అలాగే దేవుడికి కొబ్బరికాయ, పండ్లు, బెల్లం లాంటివి నైవేద్యంగా సమర్పించడంలో ధర్మసూక్ష్మం ఉంది. అవి ప్రసాదంగా తీసు కోవడం వల్ల నీరసం పోయి శక్తి చేకూరుతుంది. ఆహారం అధికమయ్యే కొద్దీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. పొట్టలో కొంతభాగం ఖాళీగా ఉంటే జీర్ణప్రక్రియ సవ్యంగా ఉంటుంది. అనారోగ్యాలు దరిచేరవు. తామసుగుణాన్ని పెంచే ఆహారం కూడదు. సూర్యా స్తమయం తర్వాతతినకూడదు లాంటివి భక్తి, ఆచారం పేరుతో శ్రేయోదాయకం.

ఆధ్యాత్మికం

# పిల్లలకు పంచుకోవడం నేర్పించాలి

**ఎంతో ఇష్టంగా ఆడుకొనే తన బొమ్మను చింటూ మరెవ్వరికీ ఇవ్వడు. కానీ.. పక్కింటి రాహుల్ కారు కావాలని పేచీ పెడుతుంటాడు. పిల్లలు చిన్నప్పటి నుంచి తమవద్ద ఉన్నదాన్ని తోటివారితో పంచుకోవడానికి ఇష్టపడుతూన్నరా లేదా.. తల్లిదండ్రులు గుర్తిస్తుండాలి.** ఎందుటివారి నుంచి తీసుకోవడమే కాకుండా తనవద్ద ఉన్న దాన్నివ్వడం కూడా నేర్పించాలి. లేదంటే ఇది భవిష్యత్తులో వారి వ్యక్తిత్వ లోపమయ్యే ప్రమాదం ఉంది. పిల్లలు తమ బొమ్మలతో ఇతర పిల్లలనూ ఆడుకోనివ్వాలని చెబితే ఒప్పుకోకపోవచ్చు ఈ అలవాటు రావాలంటే తగిన వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలి. నలుగురైదుగురిని బృందంగా ఒకచోట ఆడుకునేలా ప్రోత్సహించాలి. ఆ సందర్భాన్ని వేదికగా తీసుకున్న ఒకరి బొమ్మలను మరొకరు కలిసి పంచుకోవడమెలాగో నేర్పించాలి. అందరం ఒక్కటే అనే భావన వచ్చేలా చేయాలి. దీంతె తనకెంతో ఇష్టమైన బంతి లేదా కారు బొమ్మను మరొకర పిల్లాడు తీసుకెళ్లి పోతాడేమో అనే భయం నెమ్మదిగా వారిలో దూరమవుతుంది. ఆవతలివాడి వల్ల ఉన్న అందమైన బొమ్మ తన వద్ద లేదనే అసూయా తగ్గుతుంది. ఇతరుల వస్తువులను తీసుకవోడమే కాదు.. తన బొమ్మల్ని వారితో పంచుకునే అలవాటూ ఏర్పడుతుంది.

**సరదా ప్రాజెక్టులు..** ఇంట్లో లేదా మైదానంలో అందరూ కలిసి ఆడుకునేట ప్పుడు బాబు చేతిలో అందరికీ సరిపడా బిస్కెట్లో, చాక్లెట్లో ఇచ్చి అందరికీ సమానంగా పంచమన్నాలి. అది వారిలో ఐకమత్య భావనను తెస్తుంది. ఎదుటివారికి ఏదైనాఇచ్చినప్పుడు కలిగే సంతోషం వారికర్థమవుతుంది. పిల్లలందరినీ ఒక చోటచేర్చి క్లే బొమ్మలు వేసిసరంగులేయడం చిత్రలేఖనాలు గీయడం వంటి ఆర్ట్ ప్రాజెక్టులను సరదాగా చేయించాలి. సమష్టిగా చేయించే తోటపని వారి మధ్య స్నేహ బంధానాన్ని పెంచుతుంది. సాయం చేస్తూ .. స్నేహితులతో ఆటవస్తువులు పంచుకోవడమే కాదు తెలియని వారికి సాయం చేయడమెలాగో కూడా బాల్యం నుంచే నేర్పాలి. నెలకోసారైనా అనాథాశ్రమాలకు తీసుకెళ్లి ఆ పిల్లలను పరిచయం చేయాలి. ప్రత్యేక దినాల్లో వారికి కానుకలిచ్చేలా ప్రోత్సహించాలి. ఈ అలవాటు కష్టంలో ఉన్నవారికి సాయం చేయాలనే ఆలోచనలకు చిన్నవయసులోనే బీజం పడేలా చేస్తుంది. ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా దక్కే ఆనందం ఎలా ఉంటుందో కూడా తెలుసుకోగలుగుతారు.



# వీగన్ గుడ్డు !

*ప్రతి ఏడాదీ కొన్ని ఫుడ్ ట్రెండ్స్ మనల్ని పలకరిస్తుంటాయి కదా!* అలా ఈ సంవత్సరం వచ్చిన వాటిల్లో వీగన్ గుడ్డు ఒకటి. వంటకాల్లో గుడ్డుకు ప్రత్యామ్నాయంగా ఈ వీగన్ వాటిని వాడుతున్నారు. పోషకాలు కూడా అదే స్థాయిలో అందుతాయి. సాధారణ గుడ్లు తినడానికి ఇష్టపడని వారికి రెస్టరంట్లలో ఈ వీగన్ గుడ్లని ఇప్పటికే ప్రత్యా మ్నాయంగాం వాడుతున్నారు. కోళ్లతో గుడ్డు పెట్టించేందుకు హార్మోన్లని వాడటం, యాంటీబయాటిక్‌లు ఉపయోగించడం, ఈకొలి బ్యాక్టీరియా విస్తరాంచడం, పర్యావరణానికి చేటు వంటి కారణాలతో చాటామంది సాధారణ గుడ్లకి దూరమవుతున్న వేళ ఈ వీగన్ గుడ్లకి ప్రాధాన్యం పెరుగుతోంది. జస్ట్ ఎగ్, జీరోఎగ్, వీగన్ ఎగ్ వంటి సంస్థలు ఈ ఉత్పత్తులని అందిస్తున్నాయి. టోఫు, అవిసె గింజలు వంటి వాటితో వీటిని చేస్తున్నారు వినియెగించుకోవడమూ తేలిక.



### అంతర్జాతీయ టోర్నమెంట్‌లో..

# మెరిసిన భారత్ మహిళా రెజ్లర్లు

### 4 స్వర్ణాలు, 1 కాంస్యంతో రన్నరప్

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ రెజ్లింగ్ వేదికపై భారత మహిళా రెజ్లర్లు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం టర్కీలో జరుగుతున్న ప్రతిష్టాత్మక యాసర్ డోగు అంతర్జాతీయ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు పతకాల పంట పండింది. భారత్‌కు చెందిన ఆరుగురు మహిళా రెజ్లర్లతో కూడిన బృందం ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. ఇందులో పాల్గొన్న ఆరుగురు రెజ్లర్లలో, ఐదుగురు భారతీయ మహిళా రెజ్లర్లు పతకాలు సాధించారు, ఇందులో 4 స్వర్ణాలు మరియు ఒక కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. భారత్ రెజ్లర్ పుష్ప 55 కిలోల విభాగంలో స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, నేహా 57 కిలోల విభాగంలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. మనీషా 62 కిలోల విభాగంలో ఆధిపత్యం చెలాయించి స్వర్ణం గెలుచుకుంది. అలాగే హర్షిత 72 కిలోల విభాగంలో మరో స్వర్ణం సాధించింది. 50 కిలోల విభాగంలో నీలం కాంస్యం సాధించి పతకాల సంఖ్యకు దోహదపడింది, దీంతో భారతదేశం మొత్తం జట్టు ర్యాంకింగ్స్‌లో రన్నరప్‌గా నిలిచింది. అంతకుముందు, వియత్నాంలోని వుంగ్ టౌలో జరిగిన అండర్17 ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత అండర్17 రెజ్లర్లు 3 స్వర్ణాలు, 2 కాంస్యాలతో సహా మొత్తం ఐదు పతకాలను సాధించారు, 65 కిలోల విభాగంలో గౌరవ్ పునియా, అర్జున్ రుహిల్ (92 కిలోలు), లాకీ (110 కిలోలు) బంగారు పతకాలు గెలుచుకున్నారు. 45 కిలోల విభాగంలో శివమ్, 51 కిలోల విభాగంలో ధనరాజ్ గణపతి రెండు కాంస్య పతకాలను గెలుచుకున్నారు.

### మహిళల ఆసియా కప్‌లో..

## భారత్ వరుసగా రెండో మ్యాచ్ 4-0తో గెలుపు



**న్యూఢిల్లీ:** ఆసియా కప్-2025 క్వాలిఫయర్స్‌లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో విజయాన్ని సాధించింది. ఆదివారం థాయ్‌లాండ్‌లోని చియాంగ్ మాయిలో జరిగిన ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు 4-0 తేడాతో తైమూర్‌ను ఓడించింది. గత వారం మంగోలియాపై 13-0 తేడాతో భారీ విజయాన్ని సాధించి భారత్ అద్భుతంగా ప్రారంభించింది. ఆ తర్వాత ఆరు రోజుల అనంతరం ఆదివారం మ్యాచ్ ప్రారంభంలో మనీషా కళ్యాణ్ అద్భుతమైన ముగింపుతో భారత్ హాఫ్ టైం ముగిసే సమయానికి 1 గోల్ ఆధిక్యాన్ని కొనసాగించింది. భారత జట్టు ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకోవడానికి చాలా పెద్ద అవకాశాలు వచ్చాయి, కానీ రెండు నిరక్ష్యప్లు షాట్లు మరియు తైమూర్ లెస్టే డిఫెన్సివ్ యూనిట్ నుండి దృఢమైన రక్షణాత్మక ప్రదర్శన స్కోరును మార్చకుండా ఉంచాయి. భారత ఫార్వర్డ్ ప్యారీ జాక్సా రెండో అర్ధభాగంలో భారత వింగర్లు ఇచ్చిన కొన్ని సులభమైన అవకాశాలను గోల్స్‌గా మార్చలేకపోయింది, దీనివల్ల స్కోరు లైన్ మారలేదు. సంజు ఎడమ పార్శ్వం నుండి అద్భుతమైన క్రాస్ అందించింది. అది తైమూర్ గోల్ కీపర్‌ను సమీప చివరలో ఓడించడంతో రెండవ అర్ధభాగంలో భారత్ ఆధిక్యం 2-0 చేరింది. తైమూర్ లెస్తెతైమూర్ డిఫెన్సివ్ బాక్స్‌లో సంజు మరో అద్భుతమైన క్రాస్ చేశాడు. మనీషా కళ్యాణ్ గోల్ కీపర్ చివరి వైపు శక్తివంతమైన షాట్ కొట్టి తన గోల్ ఖాతాలో మరో గోల్ వేయడంతో ఇండియా స్కోర్ 3-0కు చేరింది. తైమూర్ లెస్తేడాంగ్మ్ గ్రేస్ అద్భుతమైన నైపుణ్యాలను ప్రదర్శించి తన రెండు మార్కులను అధిగమించి, గోల్ వైపు పరుగెత్తుతున్న లిండా కోమ్‌కు మైనస్ పాస్‌తో దాడి చేసే ఎత్తుగడ వేయడంతో భారత్ ఈ పాస్‌ను గోల్‌గా మార్చడంతో 4-0కు చేరింది. దీంతో రెండు మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లతో భారత్ లీడర్‌బోర్డ్‌లో అగ్రస్థానంలో ఉంది. వారికి ఇరాక్ మరియు థాయిలాండ్‌తో మరో రెండు మ్యాచ్‌లు ఉంటాయి, ఇవి ఆసియా కప్‌లో జట్టు భవితవ్యాన్ని నిర్ణయించనున్నాయి.

ఆట



### యుఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో

# దూసుకెళ్లిన ఆయుష్, తన్వి

**న్యూఢిల్లీ:** యుఎస్ ఓపెన్-2025 లో యువ భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు తన్వి శర్మ, ఆయుష్ శెట్టి తమ తొలి బిడబ్ల్యూఎఫ్ సూపర్ 300 ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. దీంతో 16 ఏళ్ల తన్వి బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్‌లో ఫైనల్‌కు చేరుకున్న తొలి భారతీయ మహిళా షట్లర్‌గా కూడా నిలిచింది. ఆయుష్ శెట్టి మూడు గేమ్‌ల థ్రిల్లర్‌లో (21-23, 21-15, 21-14) టాప్ సీడ్ మరియు, ప్రపంచ 6వ ర్యాంకర్ చౌ టియెన్ చెన్‌ను చైనీస్ తైపీని ఓడించగా, తన్వి (21-14, 21-16) ఉక్రెయిన్‌కు చెందిన ఉన్నత ర్యాంక్ పొందిన పోలినా బుహ్రోవాను ఓడించింది. తన్వి మళ్ళీ అద్భుత గేమ్‌ప్లేను ప్రదర్శించి సెమీఫైనల్‌లో ఆధిపత్యం చెలాయించింది. రెండవ గేమ్‌లో బుహ్రోవా ఆలస్యంగా ముందుకు సాగినప్పటికీ, తన్వి సౌకర్యవంతమైన విజయాన్ని సాధించింది. ఆమె ఇప్పుడు ఫైనల్‌లో అనుభవజ్ఞురాలైన అమెరికన్ క్రీడాకారిణి బీవెన్ జాంగ్‌ను ఎదుర్కోనుంది. భారత్ యొక్క మొట్టమొదటి బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్‌ను గెలుచుకోవాలనే లక్ష్యంతో ఉంది. ఇక 20 ఏళ్ల ఆయుష్ కూడా అనుభవజ్ఞుడైన ప్రచారకర్త చో టియన్ చెన్‌పై తన కెరీర్‌లో అతిపెద్ద విజయంతో టోర్నమెంట్ యొక్క శిఖరాగ్ర ఘర్షణకు దూసుకెళ్లాడు. ఆయుష్ మొదటి గేమ్‌లో 19-14తో ఆధిక్యంలో బలంగా ఆడాడు, కానీ చౌ ముందుకు దూసుకెళ్లాడు. అతను డ్యూస్ తర్వాత 23-21తో గెలిచేందుకు పోరాడాడు. అయితే ఆయుష్ దృఢ సంకల్పంతో తిరిగి కీలక సమయంలో సంచలన ప్రదర్శన చేశాడు, తదుపరి రెండు గేమ్‌లలో (21-15, 21-14) ఆధిపత్యం చెలాయించాడు, దీంతో వరల్డ్ టూర్‌లో తన మొట్టమొదటి ఫైనల్‌లో తన స్థానాన్ని దక్కించుకున్నాడు.



### వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌లో..

# టీమిండియాకు ఫైనల్ గండం

### ఊహించని షాకిచ్చిన ఆసిస్.. ఇంగ్లండ్‌పై ఓటమితో లాస్ట్ ర్యాంక్







**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి)-2025-27 సైకిల్ ఉత్కంఠగా కొనసాగుతోంది. ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఓటమి పాలవడంతో పాయింట్ల పట్టికలో దిగువకు దిగజారి కష్టాల్లో పడింది. వెస్టిండీస్‌పై ఆస్ట్రేలియా సాధించిన ఘన విజయం, ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఓటమి తర్వాత పాయింట్ల పట్టికలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం డబ్ల్యూటిసి పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ టాప్‌లో నిలిచాయి. ఈ డబ్ల్యూటిసి సైకిల్‌లో ఆస్ట్రేలియా ఆడిన ఒక మ్యాచ్‌లో విజయంతో 12 పాయింట్లు సంపాదించి 100 శాతం పాయింట్ల పర్సెంటేజీ (పిసిటి)తో అగ్రస్థానంలో ఉంది. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో 159 రన్స్ తేడాతో విజయం సాధించడంతో ఇది సాధ్యమైంది. అలాగే ఇంగ్లాండ్ సైతం భారత్‌తో ఆడిన ఒక మ్యాచ్‌లోనూ గెలవడంతో 12 పాయింట్లతో, 100 శాతం పిసిటితో 2వ స్థానంలో ఉంది. శ్రీలంక ఇప్పటి వరకూ 2 మ్యాచ్‌లు ఆడగా, అందులో ఒకటి విజయం, మరొకటి డ్రా గా కావడంతో ఆ జట్టు 16 పాయింట్లను సాధించి 66.67 శాతం పిసిటితో 3వ ప్లేస్‌లో నిలిచింది. బంగ్లాదేశ్ 2 మ్యాచ్‌ల్లో ఒకటి ఓటమి చెంది, మరొకటి డ్రా అయి 4 పాయింట్ల 16.67 పాయింట్ల పర్సెంటేజ్‌తో 4వ ప్లేస్‌లో చేరింది. ఇక టీమిండియా ఆడిన ఒక్కటి ఓటమి చెందడంతో ఒక్క పాయింటు కూడా రాకపోవడంతో పట్టికలో 5వ స్థానంలో ఉంది. ఇంగ్లాండ్‌తో తొలి టెస్టులో ఓటమితో పెద్ద ఎదురుదెబ్బ అయింది. వెస్టిండీస్ కూడా ఒకే మ్యాచ్ ఆడి అది ఓడి ఒక్క పాయింటు కూడా లేకుండా చిట్టచివరన ఆరో స్థానంలో ఉంది. ఇక దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, పాకిస్తాన్ ఈ మూడు జట్లు ఈ సైకిల్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడా ఇంకా ప్రారంభం కాలేదు. ఈ పరిస్థితుల్లో భారత జట్టు ఫైనల్‌కు చేరుకునేందుకు అవకాశాలు సన్నగిల్లాయి. డబ్ల్యూటిసి ఫైనల్‌కు అర్హత సాధించాలంటే, రాబోయే మ్యాచ్‌లలో భారత్ మెరుగైన ప్రదర్శన కనబరచడం చాలా అవసరం. ఈ 2025-27 డబ్ల్యూటిసి సైకిల్‌లో బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లతో భారత్ ఆడే అవకాశం లేదు. ఇది టీమిండియాకు మరింత కఠిన సవాలుగా మారుస్తోంది. మొత్తంగా ప్రారంభ దశలోనే జట్ల మధ్య హోరాహోరీ పోరు జరుగుతుండటంతో రాబోయే మ్యాచ్‌లలో పాయింట్ల పట్టికలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో, ఏ జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయో అనేది ఉత్కంఠ కలిగిస్తోంది.

## ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్‌లో కుషారేకు హైజంప్ టైటిల్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్-2025,లో ఫైనల్లో తేజస్విన్ శంకర్‌ను ఓడించి సర్వేష్ కుషారే హైజంప్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. పారిస్ 2024 ఒలింపియన్ కుషారే 2.21 మీటర్లు ఎగిరి శంకర్‌ను వెనక్కి నెట్టి పురుషుల హైజంప్‌లో విజయాన్ని కైవసం చేసుకున్నాడు. జాతీయ రికార్డు 2.29 మీటర్లతో ఉన్న తేజస్విన్ ఆ రోజు 2.19 మీటర్లు దూకి రజతంతో సరిపెట్టుకోగా, ఆదర్శ్ రామ్ 2.13 మీటర్ల ప్రయత్నంతో పోడియంను పూర్తి చేశాడు. పారిస్ 2024 ఒలింపిక్స్‌లో, కుషారే 2.15 మీటర్ల ఎత్తుతో అర్హతలో మొత్తం 25వ స్థానంలో నిలిచాడు. అదే సమయంలో, తేజస్విన్ శంకర్ హైజంప్‌లో కామన్వెల్త్ గేమ్స్ కాంస్య పతక విజేతగా నిలిచాడు. ఇక మహిళల లాంగ్ జంప్‌లో భవానీ యాదవ్ 6.31 మీటర్ల ఉత్తమ జంప్‌తో సాండ్రా బాబుపై విజయం సాధించింది. ప్రారంభ రౌండ్లలో సీజన్‌లో అత్యుత్తమంగా 6.23 మీటర్లతో ముందంజలో ఉన్న సాండ్రా కూడా 6.24 మీటర్ల జంప్‌ను అమలు చేయగలిగింది కానీ భవానీని అధిగమించలేకపోయింది. కుసుమ రవాడ 6.22 మీటర్ల జంప్‌తో కాంస్యం గెలుచుకుంది. ఇక పురుషుల 800 మీటర్ల ఫైనల్‌లో జాతీయ రికార్డు హోల్డర్ మహ్మద్ అఫ్సల్ పి ఎదురుదెబ్బ తగిలింది. సగం దూరం వరకు మైదానంలో ముందుండి నడిపిన అఫ్సల్ గాయం కారణంగా వైదొలగాల్సి వచ్చింది. అంతకుముందు రోజు, కార్తీక్ ఉన్నికృష్ణన్ పురుషుల ట్రిపుల్ జంప్‌ను 16.08 మీటర్ల ప్రయత్నంతో గెలుచుకున్నాడు, విమల్ ముగేష్ (16.01 మీ) మరియు గైలీ వెనిస్టర్



(16.00 మీ)లను అధిగమించారు. షీనా ఎన్వి (13.05 మీ) మరియు ఏంజెల్ సిల్వియా (23.81 సె) కూడా మహిళల ట్రిపుల్ జంప్ మరియు 200 మీటర్ల ఫైనల్స్‌లో వరుసగా విజయాలు నమోదు చేశారు. ట్రాక్‌పై, తమిళ్ అరసు (10.46సె), అభినయ రాజరాజన్ (11.55సె) 100 మీటర్ల రేసుల్లో గెలిచిన తర్వాత మీట్‌లో అత్యంత వేగవంతమైన పురుషుడు, మహిళగా కిరీటాలను గెలుచుకున్నారు.

# పెరుగుతున్న పసిడి రుణాలు..

**న్యూఢిల్లీ, జూన్ 29:** అత్యవసరంగా సొమ్ము అవసరమైనప్పుడు గోల్డ్ లోన్ ఒక ఉపయోగకరమైన ఎంపికగా ఉంటుంది. చాలా మంది బంగారు ఆభరణాలను సెక్యూరిటీగా తాకట్టు పెట్టి డబ్బు తీసుకుంటారు. చాలా సులభంగా నిధులు పొందడానికి త్వరిత, సులభమైన మార్గంగా గోల్డ్ లోన్స్ ఉంటాయి. బంగారు రుణం అనేది ఒక రకమైన సెక్యూర్డ్ రుణం. గోల్డ్ లోన్ ద్వారా మీ బంగారు ఆభరణాలు, నాణేలు లేదా కడ్డీలను బ్యాంకు లేదా ఆర్థిక సంస్థకు సెక్యూరిటీగా ఇవ్వడం ద్వారా డబ్బు



పొందవచ్చు. అయితే రుణ మొత్తం బంగారం ప్రస్తుత మార్కెట్ విలువపై ఆధారపడి ఉంటుంది. మీరు రుణం, వడ్డీని పూర్తిగా చెల్లించిన తర్వాత మీ బంగారం మీకు తిరిగి ఇస్తారు. మీరు మీ బంగారు ఆభరణాలు లేదా నాణేలతో బ్యాంకు లేదా ఎన్‌బీఎఫ్‌సీను సందర్శించాల్సి ఉంటుంది. వారు స్వచ్ఛత, బరువును తనిఖీ చేస్తారు. 18 నుండి 24 క్యారెట్ల మధ్య బంగారం మాత్రమే తాకట్టుకు తీసుకుంటాయి. రుణదాత మీ బంగారం విలువ ను లెక్కించడానికి బంగారం ప్రస్తుత మార్కెట్ ధరను తనిఖీ చేస్తారు. విలువ ఆధారంగా బ్యాంకులు మీకు రుణం మంజూరు చేస్తాయి. సాధారణంగా మీ బంగారం విలువలో 75 శాతం వరకు ఉంటుంది. అలాగే డబ్బు కూడా అదే రోజు ఖాతాలో వేస్తారు. మీరు లోన్‌ను వివిధ మార్గాల్లో తిరిగి చెల్లించవచ్చు. ఈఎంఐల ద్వారా, నెలవారీ వడ్డీని చెల్లించి, అసలును తరువాత చెల్లించండి లేదా వన్‌టైమ్ బుల్లెట్ చెల్లింపును ఉపయోగించండి. పూర్తి రుణ మొత్తం, వడ్డీ చెల్లించిన తర్వాత మీ బంగారాన్ని అదే స్థితిలో తిరిగి ఇస్తారు. గోల్డ్ లోన్స్‌పై ఆసక్తి ఇందుకే గోల్డ్ లోన్స్ సాధారణంగా ప్రాసెస్ చేసి నగదు నిమిషాల్లో ఇస్తారు. బంగా రాన్ని సెక్యూరిటీగా ఉపయోగిస్తారు కాబట్టి మీరు జీతం స్లిప్‌లు లేదా ఆదాయ పత్రాలను చూపిం చాల్సిన అవసరం లేదు. మీరు 3 నుండి 36 నెలల వరకు రుణ నిబంధనలను ఎంచుకోవచ్చు. వ్యక్తిగత రుణాలతో పోలిస్తే బంగారు రుణాలకు తరచుగా తక్కువ వడ్డీ ఉంటుంది. మీరు తిరిగి చెల్లింపులను మిస్ అయితే తప్ప మీ క్రెడిట్ స్కోర్ సురక్షితంగా ఉంటుంది.

# ఈక్విటీ స్కీమ్స్‌లో ఆ రెండే టాప్..

**ముంబై, జూన్ 29:** ఏఎంఎఫ్ఐ మే 2025 డేటా ప్రకారం మల్టీక్యాప్ ఫండ్స్ నికర ఇన్‌ఫ్లో రూ.2,999.29 కోట్లుగా ఉండగా, ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ రూ.3,841.32 కోట్లుగా వచ్చాయి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు భారతీయ పెట్టుబడిదారులలో ఆదరణ పొందుతూనే ఉన్నందున, ఫ్లెక్సీక్యాప్, మల్టీక్యాప్ ఫండ్ల మధ్య వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవడం అనేది పెట్టుబడి నిర్ణయాలకు చాలా ముఖ్యం. మల్టీక్యాప్ ఫండ్లు సెబీ నిర్దేశించిన నిర్మాణాన్ని అనుసరిస్తాయి. అంటే లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ స్టాక్‌లకు కనీసం 25 శాతం కేటాయింపుతో పొదుపు చేస్తాయి. ఈ నియమం కంపెనీ పరిమాణాలలో క్రమశిక్షణ కలిగిన వైవిధ్యతను నిర్ధారిస్తుంది. మార్కెట్ సర్కిల్స్‌లో పనితీరును సమతుల్యం చేయడంలో సహాయ పడుతుంది. అయితే ఈ నిర్మాణం మార్కెట్ మార్పులకు ప్రతిస్పందించడంలో ఫండ్ మేనేజర్‌కు ప్రాముఖ్యతను కూడా పరిమితం చేస్తుంది. ఇది అస్థిర దశలలో రిస్క్‌రివార్డ్ తీవ్రతను పెంచుతుంది. 65 శాతం ఆస్తులు ఈక్విటీల్లో పెట్టుబడి పెట్టబడినంత వరకు ఫ్లెక్సీక్యాప్ ఫండ్లు పూర్తి సౌలభ్యాన్ని అందిస్తాయి. ఫండ్ మేనేజర్లు మార్కెట్ పరిస్థితుల ఆధారంగా కేటాయింపులను సర్దుబాటు చేయవచ్చు. తిరోగమనాల సమయంలో లార్జ్ క్యాప్‌లపై పూర్తిగా దృష్టి పెట్టడం లేదా ర్యాలీల సమయంలో మిడ్‌స్మాల్‌క్యాప్‌లపై దృష్టి పెట్టాలని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్ క్యాప్స్ కంటే రంగాలు తరచుగా ముఖ్యమైనవిగా ఉంటాయి. ముఖ్యంగా స్వల్ప నుంచి మధ్యకాలిక



వ్యాపారులకు నగదు అనేది చాలా కీలకంగా ఉంటుంది. అయితే రాబడికి సమయంతో పాటు కేటాయింపుకు సంబంధించిన ప్రాముఖ్యత ఉంటుంది. నియమాల ఆధారిత విధానంతో స్థిరమైన, సమతుల్య వైవిధ్యాన్ని కోరుకునే పెట్టుబడిదారులకు మల్టీక్యాప్ ఫండ్లు అనువైనవని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్ ట్రెండ్‌ల ఆధారంగా డైనమిక్ కేటాయింపును కోరుకునే వారికి ఫ్లెక్సీక్యాప్ ఫండ్లు మరింత అనుకూలంగా ఉంటాయని వివరిస్తున్నారు.

## వాణిజ్యం

# వారెన్ బఫెట్ మరోసారి భారీ విరాళం

**ముంబై, జూన్ 29:** ప్రపంచ కుబేరుడు వారెన్ బఫెట్ మరోసారి భారీ విరాళం ఇచ్చారు. బెర్క్‌షైర్ హాత్వే స్టాక్‌లోని మరో 6 బిలియన్ డాలర్ల వాటాను గేట్స్ ఫౌండేషన్, నాలుగు కుటుంబ దాతృత్వ సంస్థలకు విరాళంగా ఇచ్చారు. మన ఇండియన్ కరెన్సీలో దాదాపు 51 వేల కోట్లు. వారెన్ బఫెట్ దాదాపు 20 ఏళ్లుగా ఇలా విరాళాలు ఇస్తూనే ఉన్నారు. ఆయన తన సంపదను దానం చేయడం ప్రారంభించినప్పటి నుండి ఇది అతిపెద్ద వార్షికవిరాళం. దాదాపు 12.36 మిలియన్ బెర్క్‌షైర్ క్లాస్ బి షేర్లను విరాళంగా ఇవ్వడంతో బఫెట్ మొత్తం ఛారిటీలకు ఇచ్చిన విరాళం 60 బిలియన్ల డాలర్లకు పైగా పెరిగింది. గేట్స్ ఫౌండేషన్‌కు 9.43 మిలియన్ షేర్లను, సుసాన్ థాంప్సన్ బఫెట్ ఫౌండేషన్‌కు 943,384 షేర్లను, అతని పిల్లలు హోవార్డ్, సూసీ, పీటర్ నేతృత్వంలోని మూడు ఛారిటీలకు 6,60,366 షేర్లను విరాళంగా ఇచ్చారు. అవి వరుసగా హోవార్డ్ జీ బఫెట్ ఫౌండేషన్, షేర్వుడ్ ఫౌండే షన్, నోవో ఫౌండేషన్‌లు. ఇన్ని షేర్లు విరాళంగా ఇచ్చినా కూడా బెర్క్‌షైర్ స్టాక్‌లో వారెన్ బఫెట్ ఇప్పటికీ 13.8 శాతం వాటాను కలిగి ఉన్నారు. శుక్రవారం విరాళాలకు ముందు అతని 152 బిలియన్ల డాలర్ల నికర విలువ అతన్ని ప్రపంచంలోని ఐదవ అత్యంత ధనవంతుడిని చేసిందని ఫోర్బ్స్ తెలిపింది. 2024 జూన్‌లో 5.3 బిలియన్ డాలర్లు, 2024 నవంబర్‌లో కుటుంబ దాతృత్వ సంస్థలకు 1.14 బిలియన్ డాలర్లను విరాళంగా ఇచ్చారు. ఒక ప్రక టనలో బెర్క్‌షైర్ షేర్లను విక్రయించే ఉద్దేశం తనకు లేదని బఫెట్ స్పష్టం



చేశారు. ఇప్పుడు 94 ఏళ్ల వయ సులో ఉన్న బఫెట్ 2006లో తన సంపదను దానం చేయడం ప్రారంభించారు. గతేడాది ఆయన తన వీలు నామాను సైతం మార్చుకున్నారు. తన మరణాంతరం తన మిగిలిన సంపదలో 99.5శాతం తన పిల్లలు పర్యవేక్షించే ఛారిటబుల్‌ట్రస్ట్‌కు చెందాలని రాశారు.

# జులైలో వర్కింగ్ డేస్ 18 రోజులే!

**ముంబై, జూన్ 29:** వచ్చే నెలలో బ్యాంకులు 18 రోజులు మాత్రమే పనిచేస్తాయి. జూలై 3 (గురువారం) త్రిపురలోని అగర్తలాలో ఖర్చి పూజ సందర్భంగా బ్యాంకులు మూసివేయడం జరుగుతుంది. మిగతా రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేస్తాయి. జూలై 5 (శనివారం) జమ్మూ కశ్మీర్‌లో గురు హరోబింద్ జీ జయంతి సందర్భంగా మూసివేత ఉంటుంది. మిగతా రాష్ట్రాల్లో బ్యాంకులు యధావిధిగా పనిచేస్తాయి.జూలై 6 ఆదివారం. దేశమంతటా బ్యాంకులు పనిచేయవు. జూలై 12 రెండో శనివారం సందర్భంగా దేశమంతటా బ్యాంకులు పనిచేయవు. జూలై 13 ఆదివారం సందర్భంగా దేశమంతటా బ్యాంకులు పనిచేయవు. జూలై14 మేఘాలయలోని షిల్లాంగ్ లో బెహ్ దేంఖ్లామ్ ఫెస్టివల్ సందర్భంగా బ్యాంకులు క్లోజ్ అవుతాయి. మిగతా రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేస్తాయి. జూలై 16 (బుధవారం) ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ లో హరేలా ఫెస్టివల్ సందర్భంగా బ్యాంకులు మూసివేయడం జరుగుతుంది. మిగతా రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేస్తాయి. జూలై 17 (గురువారం) మేఘాలయలోని షిల్లాంగ్‌లోయు తిరోత్ సింగ్ వర్ధంతి సందర్భంగా బ్యాంకులు మూసివేయడం జరుగుతుంది. మిగతా రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేస్తాయి. జూలై 19 (శనివారం) త్రిపురలోని అగర్తలాలో కేర్ పూజ సందర్భంగా బ్యాంకులు మూసివేయడం జరుగుతుంది. మిగతా రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేస్తాయి. జూలై 20 ఆదివారం సందర్భంగా దేశమంతటా బ్యాంకులు పనిచేయవు. జూలై 26 నాలుగో శనివారం సందర్భంగా దేశమంతటా బ్యాంకులు పనిచేయవు. జూలై 27 ఆదివారం సందర్భంగా దేశమంతటా బ్యాంకులు పనిచేయవు.జూలై 28 (సోమవారం) సిక్కింలోని గ్యాంగ్‌టక్‌లో ద్రుక్పా త్షెజీ సందర్భంగా మూసివేత ఉంటుంది.

# నెలవారీ పొదుపులో 'ఆర్‌డి'యే బెస్ట్

**ముంబై, జూన్ 29:** క్రమం తప్పకుండా డబ్బు ఆదా చేయడం అనేది అత్యంత ముఖ్యమైన ఆర్థిక అలవాట్లలో ఒకటిగా ఉంటుంది. అత్యవసర పరిస్థితుల కోసం అయినా, భవిష్యత్తు లక్ష్యాల కోసం అయినా, లేదా ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించడం కోసం అయినాపొదుపు మార్గం వైపు పయనించాలని నిపుణులు చెబుతున్నారు. ప్రతి నెలా ఒక స్థిర మొత్తాన్ని ఆదా చేయడంలో రికరింగ్ డిపాజిట్లు కీలక పాత్ర పోషిస్తాయి. ఆర్‌డీ అనేది మీ పొదుపులను కాలక్రమేణా హామీ ఇచ్చిన రాబడితో పెంచుకోవడానికి ఒక సులభమైన, సురక్షితమైన మార్గం. రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) అనేది బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అందించే పొదుపు పథకం. ఇది వ్యక్తులు ప్రతి నెలా ఒక నిర్దిష్ట కాలానికి నిర్ణీత మొత్తంలో డబ్బును డిపాజిట్ చేయడానికి అనుమతిస్తుంది. ప్రతిగా బ్యాంక్ డిపాజిట్ చేసిన మొత్తంపై స్థిర వడ్డీ రేటును అందిస్తుంది. పెట్టుబడిదారుడు కాలపరిమితి ముగింపులో ఏకమొత్తం అందుకుంటాడు. మీ ఎంపిక మరియు స్థోమత ఆధారంగా మీరు ప్రతి నెలా రూ. 500 లేదా రూ. 1,000 వంటి నిర్ణీత మొత్తాన్ని జమ చేస్తారు. మీరు ఎంత కాలం ఆదా చేయాలను కుంటున్నారో ఎంచు కోవచ్చు. సాధారణంగా బ్యాంకును బట్టి 6 నెలల నుంచి 10 సంవత్సరాల వరకు ఉంటుంది. వడ్డీ రేటు ప్రారంభ సమయంలో స్థిరంగా ఉంటుంది.



మార్కెట్ పరిస్థితులతో మారదు. మీరు ఎంత సంపాదిస్తారో మీకు కచ్చితంగా అంచనా వేస్తుకోవచ్చు. ఈ స్కీమ్ ఇది స్టాక్ మార్కెట్‌తో ముడిపడి లేనందున ఆర్‌డీలు సురక్షితమైనవి, భద్రంగా ఉంటాయి. ఇవి సంప్రదాయవాద పొదుపు దారులకు అనువైనవిగా చేస్తాయి. వడ్డీ సాధారణంగా త్రైమాసికానికి ఒకసారి చక్రవడ్డీ చేస్తారు. కాబట్టి మీరు మీ డిపాజిట్లపై మాత్రమే కాకుండా ఇప్పటికే సంపాదించిన వడ్డీపై కూడా వడ్డీని పొందు తారు. మీకు అత్యవసర నిధులు అవసరమైతే కొన్ని బ్యాంకులు మీ ఆర్‌డీ బ్యాలెన్స్‌పై రుణం లేదా ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకోవడానికి అనుమతిస్తాయి. మీరు మెచ్యూరిటీకు ముందే మీ ఆర్‌డీ ఖాతాను మూసివేయవచ్చు. కానీ దీనికి జరిమానా లేదా తక్కువ వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. మీరు నెలవారీ డిపాజిట్ మొత్తాన్ని, కాలపరిమితిని ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రతి నెలా మీ పొదుపు ఖాతా నుంచి ఆటోమెటిక్‌గా తీసివేస్తారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.